




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 06 బుధవారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 322

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# ముంచేసింది

## ఉత్తరాఖండ్‌లో క్లౌడ్ బరస్ట్

- ఉత్తరకాశీలో క్లౌడ్ బరస్ట్‌తో మునిగిన గ్రామాలు
- 3 గ్రామాలను ముంచెత్తిన ఖీర్‌గంగా నది
- వరదల్లో 60 మందికి పైగా గల్లంతు
- శిథిలాల కింద చిక్కుకున్న బాధితుల కోసం గాలింపు
- సహాయక చర్యల్లో ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- సహాయ చర్యలు సమీక్షిస్తున్న సీఎం ధామి
- కేంద్రం నుంచి పూర్తి మద్దతు:అమిత్ షా
- వర్షాకాలం ప్రారంభం నుంచే ఉత్తరాఖండ్‌లో వర్షాలు
- తెగిపోయిన రహదారులు,కొట్టుకుపోయిన హోటళ్లు
- ఐఎండీ రెడ్, ఎల్లో అలర్టు జారీ రెకే

2



**ఉత్తరాఖండ్-నవభూమి బ్యూరో**

దేవభూమి ఉత్తరాఖండ్‌పై ప్రకృతి కన్నెర్ర జేసింది. ఉత్తర కాశీ జిల్లాలో మంగళవారం క్లౌడ్‌బరస్ట్‌తో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. ఈ పెను విపత్తులో 60 మందికిపైగా గల్లంతయ్యారు. కుండపోత వర్షానికి ఖీర్ గంగా నదీకి వరద పోటెత్తి.. ఖీర్‌బద్, ధరాలి గ్రామాలను ముంచెత్తింది. కొండలపై నుంచి వచ్చిన భారీ ప్రవాహంలో పలు ఇళ్లు కొట్టుకుపోగా.. అనేక నివాసాలు ధ్వంసమయ్యా యి. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నట్టు అధికారులు తెలిపారు. మెరుపు వరద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్రామస్థులు భయాందోళనతో అరుస్తూ పరుగులు తీస్తుండటం వీడియోల్లో కనిపిస్తుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి ఉంది. అయితే, ఘటనా స్థలానికి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ బృందాలు చేరుకుని, సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఉత్తర కాశీలోని ధరాలి ప్రాంతంలో ఆకస్మిక వరదలతో తీవ్ర నష్టం సంభవించిన వార్త చాలా బాధాకరం.. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, ఇతర బృందాలు సహాయ, రక్షణ




# భారత్ వర్సెస్ ట్రంప్..!

## 24 గంటల అల్టిమేటం

- రష్యా చమురు కారణంగా భారత్‌పై ట్రంప్ ఫైర్
- 24 గంటల అల్టిమేటంతో తీవ్ర పన్నుల హెచ్చరిక
- భారత్ మాతో న్యాయం చేయడంలేదని ట్రంప్ వ్యాఖ్య
- వాణిజ్య ఒప్పందాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన అమెరికా
- సుంకాల్ని గణనీయంగా పెంచబోతున్నానన్న ట్రంప్
- విదేశాంగశాఖ కౌంటర్-చమురు దిగుమతులు తప్పనిసరి
- రష్యాతో వ్యాపారం కొనసాగుతుందన్న భారత్ సంకేతం
- ట్రంప్ హెచ్చరికలపై స్పందించని కేంద్రం

**వాషింగ్టన్-నవభూమి బ్యూరో**

అమెరికా, భారత్ మధ్య పోరు మరింత ముదిరింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్ పై యుద్ధంలో ఆ దేశానికి సాయం చేస్తుందన్న కారణంతో భారత్ పై మరిన్ని సుంకాలు విధిస్తానంటూ నిన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేశారు. ఇవాళ దానికి కొనసాగింపుగా మరింత తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. రష్యా నుంచి ఇంకా చమురు కొనుగోలు చేస్తున్న భారత్ పై 24 గంటల్లో తీవ్ర స్థాయిలో పన్నులు



## ధర్మస్థల కేసులో సంచలన మలుపు!

- వందల మంది శవాలు పాతిపెట్టినట్టు వెల్లడి
- తవ్వకాల్లో పుర్రెలు, ఎముకలు లభ్యం
- వానలతో తవ్వకాలకు ఆటంకం

2



2

## నిజమైన భారతీయులెవరో చెప్పేది జడ్జీలు కాదు: ప్రియాంకా గాంధీ

- సుప్రీం వ్యాఖ్యలకు ప్రియాంకా కౌంటర్
- న్యాయవ్యవస్థపై గౌరవమే కానీ అభిప్రాయ స్వేచ్ఛకూ హక్కు ఉంది
- ప్రశ్నించడం ప్రతిపక్ష నేతల విధి: ప్రియాంకా స్పష్టం

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన!

- రాజ్యసభ ఆమోదంతో పాలనకు కొనసాగింపు
- ప్రతిపక్ష వ్యతిరేకంతో మధ్య తీర్మానం ప్రవేశం
- బిరేన్ సింగ్ రాజీనామాతో రాష్ట్రపతి పాలన మొదలు
- గవర్నర్ చేతుల్లో పరిపాలనా బాధ్యతలు
- శాసనసభ అధికారాలు పార్లమెంటుకు బదిలీ
- ఆర్టికల్ 356 ప్రకారం మరో 6 నెలలు
- భూమి-ఉద్యోగ వివాదాలే హింస మూలాలు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ఉదయం, ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ఎగువ సభ(రాజ్యసభ)లో ప్రవేశపెట్టారు. '2025 ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు' అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది.ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద అమలులోకి వచ్చే ఈ నిర్ణయం ప్రకారం.. రాష్ట్రపతి ఇప్పుడు గవర్నర్ ద్వారా మణిపూర్ రాష్ట్ర పరిపాలనా విధులను నేరుగా నియంత్రిస్తారని అర్థం.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన భారత గెజిట్‌లో ప్రచురించబడిన ఈ ప్రకటన, మణిపూర్

## చిరు రాజకీయ రీ ఎంట్రీ

### వేడి రాజుకున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

- చిరంజీవిని బరిలోకి దించేందుకు రేవంత్ వ్యూహం
- మెగాస్టార్ గెలిస్తే హోంమంత్రి పదవి ఆఫర్?
- రేవంత్-చిరంజీవి భేటీ వెనుక అసలేముంది?
- బీఆర్ఎస్ నేతల గుసగుస -రాజకీయ మతలబు ఇదేనా?
- చిరంజీవి ఎంట్రీపై కాంగ్రెస్‌లో వర్గ పోరు
- విజయం కోసం రేవంత్ డైరెక్ట్ మెగాప్లాన్
- జిహెచ్ఎంసి ఎన్నికలకూ ప్రభావం చూపే ఉపఎన్నిక

2




**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ ఇప్పుడు రాజకీయంగా రసవత్తరంగా మారుతుంది. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి రంగంలోకి దించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారా? మెగాస్టార్ కనుక గెలిస్తే హోం మంత్రి పదవి ఇస్తావంని రేవంత్ రెడ్డి ఆఫర్ ఇస్తున్నారా? అంటే అవుననే అంటున్నారు బీఆర్ఎస్ నాయకులు. చిరంజీవి రాజకీయంపై చర్చ జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ లో సినీస్టార్ ను ఎందుకు బరిలో దింపాలి అనుకుంటున్నారు? అసలు రేవంత్ రెడ్డి ని మెగాస్టార్ చిరంజీవి కలవడం

## ఏపీ పీ-4 కార్యక్రమంపై చంద్రబాబు క్లారిటీ

- 19 నుంచి ఏపీలో పీ-4 అమలు ప్రారంభం
- పేదరిక నిర్మూలనే పీ-4 కార్యక్రమం లక్ష్యం
- సంపన్నులు-పేదల మధ్య అభివృద్ధి భాగస్వామ్యం
- మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమే - బలవంతం లేదు
- పేదలకు దత్తత తీసుకున్న చంద్రబాబు
- 250 కుటుంబాలకు తోడు
- బంగారు కుటుంబాల అభివృద్ధికి అదనపు సహాయం
- పీ-4 దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని సీఎం విశ్వాసం
- ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలకు ఊపిరి
- అబద్ధాలు నమ్మకండి - పీ-4 మార్గదర్శకాల విడుదల

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఆగస్ట్ 19 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కొత్త కార్యక్రమం అమల్లోకి రానుంది. ఆగస్ట్ 19 నుంచి పీ-4 కార్యక్రమం అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. పీ-4 కార్యక్రమం అమలుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సచివాలయం వేదికగా జరిగిన సమీక్షా సమావేశంలో సీఎంతో పాటుగా ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలన కోసం ఏపీ ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు. పీ4 కార్యక్రమం కింద బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని వివరించారు. అలాగే మార్గదర్శుల ఎంపికలో వ్యతిరేకత రాకుండా చూడాలని చంద్రబాబు సూచించారు.మరోవైపు పీ-4 కార్యక్రమం కింద సంపన్న వర్గాలలోని తొలి 10 శాతం మంది.. అట్టడుగున ఉన్న 20 శాతం వర్గాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి తోడ్పడటమే దీని ముఖ్య ఉద్దేశం. దత్తత తీసుకునే వారిని మార్గదర్శులు

## కాంగ్రెస్‌కు బిగ్ షాక్

### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామా?

- కాంగ్రెస్‌లో రాజకీయ ప్రకంపనలు
- మంత్రి పదవి కంటే ప్రజలే ముఖ్యం: రాజగోపాల్ రెడ్డి
- పదవికి కాదు, ప్రజాసేవకే తాను సిద్ధం
- పార్టీ హైకమాండ్‌పై విమర్శలు
- సీఎం వ్యాఖ్యపై తీవ్ర అసంతృప్తి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తనకు మంత్రి పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందని.. అందరిలా పైరవీలు చేస్తూ దోచుకునే వాడిని కాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కావాలా..?మునుగోడు ప్రజలు కావాలా..? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానని అన్నారు. ఈ మేరకు ప్రజల కోసం మరోసారి పదవి త్యాగానికైనా రెడీ అంటూ సంచలన ప్రకటన చేశారు. ప్రజల కోసం మళ్లీ పదవీ త్యాగానికి సిద్ధం అయినట్లు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో రాజీనామా చేసి ప్రభుత్వాన్ని మునుగోడు ప్రజల కాళ్ల దగ్గరికి తెచ్చానని గుర్తుచేశారు. మంత్రి పదవి ఇస్తామంటేనే కాంగ్రెస్ లోకి వచ్చినట్లు తెలిపారు. జూనియర్లకు మంత్రి పదవి ఇచ్చి తనను దూరం పెట్టినట్లు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం వారి విజ్ఞత అని స్పష్టం చేశారు. మంత్రి పదవి కావాలా..?మునుగోడు ప్రజలు కావాలా..? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానని అన్నారు. ఈ మేరకు ప్రజల కోసం మరోసారి పదవి త్యాగానికైనా రెడీ అంటూ సంచలన ప్రకటన చేశారు. ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి వచ్చేదని.. కానీ.. నియోజకవర్గ ప్రజల కోసం మునుగోడు నుంచి పోటీ చేసినట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. "మంత్రి పదవిని నా స్వార్థం కోసం అడగటం లేదు. మంత్రినైతే మంచి జరుగుతుందని మునుగోడు ప్రజలు భావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవి ఇస్తారా..? ఇవ్వరా..? అనేది పార్టీ అధిష్ఠానం ఇష్టం. ఇతర

## రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదు

- 'విలీనం-విభజన' పుస్తకం యువత తప్పనిసరిగా చదవాలి
- నాయకులు భాష విషయంలో హుందాగా ప్రవర్తించాలి
- జర్నలిస్టులకు భాషపై బాధ్యత తప్పనిసరి
- వ్యూస్ కోసం న్యూస్ చేయొద్దు - మీడియాకు సూచన
- రెండు సార్లు కన్నీళ్లు పెట్టుకున్నానని భావోద్వేగం
- అమ్మ జ్ఞాపకం, ఉప రాష్ట్రపతిగా ఎంపిక - కన్నీటి మూమెంట్లు
- ఉపరాష్ట్రపతిగా రిటైర్ అయ్యాక బీజేపీ ఆఫీస్‌కు వెళ్లలేదు

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

భాష విషయంలో నాయకుల తీరు మారాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. మంగళవారం సీనియర్ సంపాదకులు ఇనగంటి వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మీడియాతో మాట్లాడారు.విలీనం - విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదని.. దానికోసమే కాలమ్స్ ఉన్నాయని, రాసుకోవడానికి అందులో వాళ్ల అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. చాలా మంది జర్నలిస్టులు కొత్తగా యూట్యూబ్‌లో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. పాత్రికేయంలో భాష చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు వెంకయ్యనాయుడు.తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు... తాను తన అమ్మను చూడలేదని భావోద్వేగానికి గురయ్యారు.

## వివేకా హత్య కేసు తేల్చేసిన సీబీఐ!

- సుప్రీంకోర్టులో విచారణ - సునీత పిటిషన్‌పై నిర్ణయం వాయిదా
- అవినాష్ రెడ్డికి బెయిల్ రద్దు కోరుతూ సునీత పిటిషన్
- అంతిమ నిర్ణయం కోసమే సుప్రీంలో వేగంగా వాదనలు
- సుప్రీం ఆదేశిస్తేనే తదుపరి దర్యాప్తు -సీబీఐ మాట
- ముఖ్య నిందితులపై ఇంకా చర్యలేమన్న సునీత ఆరోపణ
- బయటకు రాని కీలక సూత్రధారుల అరెస్ట్‌పై ప్రశ్నలు



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సుదీర్ఘ దర్యాప్తు చేస్తూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ.. ఇవాళ సుప్రీంకోర్టులో మాత్రం స్పష్టత ఇచ్చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి తెలంగాణ

2

## చిరంజీవిని కలిసిన టాలీవుడ్ నిర్మాతలు.. సినీ కార్మికుల వేతనాలపై చర్చ



**ఫిలింనగర్-నవభూమి:** తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం కార్మికుల వేతనాల అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో సినీ కార్మికులకు నిర్మాతలకు మధ్య వివాదం కొనసాగుతుంది. అయితే నిర్మాతలు వేతనాలు పెంచకపోవడం, ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ రద్దు చేయడంతో కార్మికులు బంద్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొందరూ నిర్మాతలు మెగాస్టార్ చిరంజీవిని కలిశారు.
ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి ఇంటికి నిర్మాతలు సురేష్ బాబు, అల్లు అరవింద్, సుప్రియ, మైత్రీ రవి చేరుకున్నారు. సినీ కార్మికుల బంద్ విషయంపై నిర్మాతలు చర్చిస్తున్నట్లు సమాచారం. కార్మికుల వేతనాల పెంపు వివాదం, యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ తీసుకున్న నిర్ణయాలను నిర్మాతలు చిరంజీవికి వివరించనున్నారు.
తాజాగా ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ రద్దుపై అధ్యక్షుడు వల్లభనేని అనిల్ స్పందించారు. కార్మికులు సమాన హక్కులు కోరుతున్నారని, పరిశ్రమలో నైపుణ్యం ఉన్నవారిని పక్కన పెట్టడం సరికాదన్నారు. వేతనాలు అడిగితే కొత్తవారిని తీసుకువస్తామని నిర్మాతలు చెబుతున్నారని.. సినిమాపై ఇంట్రెస్ట్‌తో ఎవరైనా వస్తే వారిని శ్రమ దోపిడి చేస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదం చర్చలతోనే పరిష్కారమవుతుందని ఆశిస్తున్నప్పటికీ, అవసరమైతే ఉద్యమ మార్గాన్ని కూడా ఎంచుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## నవ వార్త





## నిజమైన భారతీయులెవరో చెప్పేది జడ్జీలు కాదు: ప్రియాంకా గాంధీ



**న్యూఢిల్లీ-నవభూమి:** చైనా మన భూభాగాన్ని ఆక్రమించినట్లు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సోమవారం సుప్రీంకోర్టు సీరియస్ అయిన విషయం తెలిసిందే. నిజమైన భారతీయులు అలా మాట్లాడరు అని కోర్టు ఆ కేసులో పేర్కొన్నది. కోర్టు చేసిన వ్యాఖ్యలపై రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీ స్పందించారు. ఇవాళ పార్లమెంట్ ఆవరణలో అడిగిన ఓ ప్రశ్నకు ఆమె బదులిస్తూ రాహుల్‌ను సమర్థించారు. ప్రశ్నలు వేయడం, ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్ష నేత విధి అని ఆమె అన్నారు. నిజమైన భారతీయులు కాదా అన్న స్టేట్మెంట్‌పై మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి గౌరవం ఉందని, కానీ నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జీలు కాదు అని ఆమె అన్నారు. రాహుల్ గాంధీ సైన్యాన్ని, సైనికులను ఎల్లప్పుడూ గౌరవించారని ఆమె పేర్కొన్నారు. నిజమైన భారతీయుడు ఎవరన్న దానికి నిర్వచనం ఎవరు ఇస్తారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేస్తే సమాధానం ఇవ్వడం లేదని, కానీ పార్లమెంట్ బయట మాట్లాడితే జాతివ్యరేకులమని ముద్ర వేస్తున్నట్లు ఆరోపించారు. ఇలాంటి సందర్భంలో నిజమైన భారతీయుడికి నిర్వచనం ఎవరు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. మేం నిజమైన భారతీయులమని, అందుకే దేశం తరపున ప్రశ్నలు వేస్తున్నామన్నారు.

## కేసీఆర్, హరీష్ రావుల బండారం బట్టబయలైంది : మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్-నవభూమి:** మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యా రు. కాళేశ్వరం నివేదికతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల బండారం బట్టబయలైందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అక్రమాలకు పాల్పడిందో జ్యుడిషియల్ కమిషన్ విచా రణలో బయటపడిందని తెలిపారు. అందుకే తేలు కుట్టిన దొంగలా.. హరీష్ రావు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ విమర్శించారు. హరీష్ అబద్ధపు సాక్ష్యాలు, బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయని స్పష్టం చేశారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణలో కేసీఆర్ పాత్ర ఏమిటో.. హరీష్ రావు చేసిన ఘనకార్యాలేమిటో తేలిపోయిందన్నారు.
కాళేశ్వరం నివేదికపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. అందుకే హరీష్ రావు ఏకంగా జ్యుడిషియల్ కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారని విమర్శించారు. విచారణ కమిషన్ తేల్చిన విషయాలపైనా, ఇచ్చిన నివేదికపైన అసెంబ్లీలో చర్చిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలు, చట్ట సభలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నమ్మకం ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. అందుకే.. కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఫార్మ్ హౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్షన్ అంటూ ఎద్దేవా చేశారు. హరీష్ రావు అసెంబ్లీకి వచ్చి, చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ డిమాండ్ చేశారు.

## రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదు

(1వపేజీ తరువాయి)రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడు...తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తాను బీజేపీ ఆఫీస్‌కు పోలేదని వెల్లడించారు. తాను ఉప రాష్ట్రపతిగా దిగిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ ఆఫీస్ గుమ్మం తొక్కలేదని చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## ఏపీ పీ-4 కార్యక్రమంపై చంద్రబాబు క్లారిటీ

(1వపేజీ తరువాయి)అని.. పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా పేర్కొంటారు. అయితే మార్గదర్శుల ఎంపిక పూర్తిగా స్వచ్ఛందంగానే జరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. మార్గదర్శులుగా మారాలని ఎక్కడా ఎవరినీ బలవంతం చేయొద్దని అధికారులను ఆదేశించారు. మంచి పనులను అడ్డుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తారని.. ప్రజలలో వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అప్పట్లో జన్మభూమి, శ్రమదానం చేపట్టిన సమయంలోనూ ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్నట్లు చంద్రబాబు గుర్తు చేశారు. మరోవైపు బంగారు కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. బంగారు కుటుంబాలకు యథాతథంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందుతుందని.. అలాగే పీ-4 కార్యక్రమం కింద అదనపు సాయం అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్లు చంద్రబాబు తెలిపారు. అలాగే 1,03,938 మందిని మార్గదర్శులుగా గుర్తించినట్లు వివరించారు. పీ-4 కార్యక్రమం కింద తాను 250 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు చంద్రబాబు వివరించారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం నారా చంద్రబాబు నాయుడు వివరించారు.

# ధర్మస్థల కేసులో సంచలన మలుపు!

(1వపేజీ తరువాయి) కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. మంజునాథ స్వామివారి ఆలయం ఉండే చోటు. ప్రతి ఏడూ లక్షలాది భక్తులు ఇక్కడకు విచ్చేస్తారు. గోవా వెళ్లే మార్గంలో ఉండటంతో పర్యాటకుల రద్దీ కూడా అధికంగా ఉంటుంది. కానీ ఇటీవలి కాలంలో ఈ పవిత్ర స్థలం చుట్టూ ఆవిరైన కొత్త మిస్టరీ ఒక్కసారిగా బయటకు వచ్చింది. అందులో వందల మంది చనిపోయినట్టూ, వారి శవాలను పాతిపెట్టినట్టూ ఓ పారిశుద్ధ్య కార్మికుడు చెప్పడం.. దీనికి అధికారులు దృష్టి మళ్లించడం.. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. - ఊహించని నిజాలు వెలుగు చూస్తున్నాయా? ఒక పారిశుద్ధ్య కార్మికుడు అధికారులకు ఇచ్చిన వివరాలు ప్రకారం.. వందల మంది శవాలను తానే స్వయంగా పాతిపెట్టాడని చెబుతూ "ఆ శవాల్లో చాలామంది మహిళలు ఉన్నారు. వాళ్లను ఎవరు చంపారో నాకు తెలియదు. కానీ నేనేం చేయలేకపోయాను. మృతదేహాలను పాతిపెట్టమన్నారూ.. పాతిపెట్టాను" అని వెల్లడించడంతో అధికారులు షాక్ అయ్యారు. - తవ్వకాల్లో పుర్రెలు, ఎముకలు లభ్యం.. ఈ సమాచారంతో వెంటనే కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. మొదటి దశ తవ్వకాల్లో అతడు సూచించిన కొన్ని చోట్ల వాస్తవంగా పుర్రెలు, ఎముకలు బయటపడడం ఈ కేసులో కొత్త మలుపు తెచ్చింది. ఇది నిజంగా పెనువివాదం అయ్యే సూచనగా మారింది. అయితే ఆ తర్వాత అదే కార్మికుడు చెప్పిన మరికొన్ని ప్రాంతాల్లో తవ్వకాలు చేసినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీనితో అతడు అబద్ధం చెబుతున్నాడా? లేక ఏదైనా మరొక ఆచూకీ కోల్పోయామా? అనే సందేహాలు మొదలయ్యాయి. వానలతో ఆటంకం ప్రస్తుతం ధర్మస్థల పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో తవ్వకాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పైగా వాస్తవంగా ఎక్కడెక్కడ శవాలు పాతిపెట్టబడ్డాయో స్పష్టంగా గుర్తించలేకపోతుండడంతో అధికారులు అంతర్మథనం చెంది ఉన్నారు. - ఇంకా ఎన్నో ప్రశ్నలు సమాధానాలు రాలేదు! ఈ కేసు లో ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. శవాలెంత వరకు నిజంగా పాతిపెట్టబడ్డాయి? వీరిని ఎందుకు చంపారు? అంత దారుణంగా హింసించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? గత 20 ఏళ్లలో 450 మంది మిస్సింగ్ కేసులు నమోదవడం ఇదే నేపథ్యంలోనా? గతంలో ఈ విషయాలు ఎందుకు బయటపెట్టలేదు? అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. దర్యాప్తుతో న్యాయం తేలుతుందా? ఈ ఉదంతం పూర్తిగా వెలుగులోకి వస్తే, ఇది కేవలం ఒక మానవ హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా సంచలనం రేపే కేసుగా మారే అవకాశముంది. కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే %ూ×ు% ఏర్పాటు చేసిన నేపథ్యంలో దర్యాప్తు సాగుతూనే ఉంది. కానీ పారిశుద్ధ్య కార్మికుడు చెప్పినది నిజమేనా? లేక ఇందులో మరొక కుట్ర దాగి ఉందా? అనే అంశాలు తెలియాలంటే ఇంకా సమయం పట్టేలా ఉంది. ధర్మస్థల దిశగా జరుగుతున్న ఈ విచారణ మరెన్ని నిజాలు వెలికి తీస్తుందో వేచి చూడాల్సిందే.

# బుద్ధిమారని పాక్

**కరాచీ-నవభూమి:** పాకిస్తాన్ తన దుర్బుద్ధిని వీడడం లేదు. ఉగ్రవాదాన్ని అణచివేయాలని భారత్ స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, పాకిస్తాన్ మాత్రం తన పాత పంథాలోనే ముందుకు సాగుతోంది. భారత భద్రతా బలగాలు గతంలో చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో ధ్వంసమైన ఉగ్రవాద శిబిరాలను, లాంచ్ ప్యాడ్‌లను పీఓకేలో మళ్లీ పునరుద్ధరిస్తోంది. ఈ చర్యల వెనుక పాకిస్తాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఉగ్రవాద శిబిరాల పునర్నిర్మాణం గత 3నెలల కాలంలో పీఓకేలో దాదాపు 15కు పైగా ఉగ్రవాద శిబిరాలు, లాంచ్ ప్యాడ్‌లను తిరిగి స్థాపించారు. ఈ శిబిరాల ఏర్పాటుకు ఐఎస్ఐతో పాటు ఇతర పాకిస్తాన్ ప్రభుత్వ సంస్థలు కూడా సహకరిస్తున్నాయి. దీనికి ఉగ్రవాద సంస్థల నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. ముఖ్యంగా కెల్, షార్ది, దుధ్నియల్, అత్మకం, జురా, లిపా వ్యాలీ, తండపాణి, నయ్యాలి, జాంకోట్, చకోఠి వంటి సున్నిత ప్రాంతాల్లో ఈ పునర్నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. అంతేకాక, జమ్మూ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి మస్రూర్, చాప్రార్, షకర్‌గఢ్ వంటి ప్రాంతాల్లోనూ లాంచ్ ప్యాడ్‌లు, డ్రోన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యూహాలు మారుస్తున్న ఉగ్రవాదులు భారత సైనిక దళాల దాడుల వల్ల ఉగ్రవాదులు తమ పాత పద్ధతులను మార్చుకున్నారు. గతంలో 100 మందికి పైగా ఉగ్రవాదులు ఉండే పెద్ద శిబిరాలకు బదులుగా, ఇప్పుడు చిన్న చిన్న శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక శిబిరంలో 20-25 మంది మాత్రమే ఉండేలా చూస్తున్నారు. దీనివల్ల భారత బలగాలు సులభంగా గుర్తించకుండా ఉంటారని వారి ఉద్దేశం. అధునాతన సాంకేతికతతో శిక్షణ ఉగ్రవాదులకు ఇచ్చే శిక్షణలో కూడా అధు నాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నా రు. డ్రోన్లు, నైట్ విజన్ కెమెరాలు, ఉపగ్రహ మాస్కింగ్ టెక్నాలజీ వంటి ఆధునిక పరికరాలను వినియోగిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాల్లో మహిళలు, పిల్లలను మానవ కవచాలుగా ఉపయోగించడం వంటి దారుణ పద్ధతులు అవలంబిస్తున్నారు. రూ. 100 కోట్ల పాకిస్తానీ రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నట్లు అంచనా. అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతు న్నా, పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతునివ్వడం ఆపలేదు. పీఓకేలో శిబిరాల పునరుద్ధరణ అనేది భారత భద్రతా వ్యవస్థకు ఒక సవాలుగా పరిణమించింది. అయితే, ఇటు వంటి కుట్రలను ఎదుర్కోవడానికి భారత్ సిద్ధం గా ఉందని, తగిన విధంగా బుద్ధి చెబుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వివేకా హత్య కేసు తేల్చేసిన సీబీఐ!

(1వపేజీ తరువాయి)హైకోర్టులో గతంలో ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై వాదనలు వినిపించే క్రమంలో సీబీఐ ఈ క్లారిటీ ఇచ్చింది. వివేకా హత్య కేసులో గతంలో సీబీఐ అరెస్టు భయంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందారు. దీన్ని రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై సీబీఐ తన అభిప్రాయం తెలిపింది. అయితే దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. వివేకా కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగిస్తారా లేదా అన్న దానిపై అఫిడవిట్ దాఖలు చేయాలని సీబీఐని గత విచారణ సందర్భంగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ఇవాళ సుప్రీంకోర్టులో తన అభిప్రాయం చెప్పేసింది. వివేకా హత్య కేసుపై తమ దర్యాప్తు ముగిసిందని వెల్లడించింది. అయితే సుప్రీంకోర్టు ఆదేశిస్తే మాత్రం తదుపరి దర్యాప్తు కొనసాగిస్తామని సీబీఐ తెలిపింది. మరోవైపు వివేకా కేసులో దర్యాప్తు ముగిసిందన్న సీబీఐ అఫిడవిట్ పై వాదన వినిపించేందుకు సునీతారెడ్డి తరపు లాయర్ మరో కోర్టులో విచారణలో ఉన్నారు. దీంతో జస్టిస్ సందరేశన్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం.. విచారణను తాత్కాలికంగా వాయిదా వేసింది. సునీతారెడ్డి లాయర్ రాగానే మరోసారి విచారణ జరిపి వివేకా కేసులో నిందితుల బెయిల్ రద్దుపై కీలక నిర్ణయం వెలువరించనుంది. సుప్రీంలో కానిస్టేబుల్ యూటర్న్..! 2019 ఎన్నికలకు ముందు జరిగిన వివేకానందరెడ్డి హత్యపై ఆయన కుటుంబ సభ్యుల విజ్ఞప్తిపై 2020లో వైసీపీ అధికారంలోకి వచ్చాక హైకోర్టు సీబీఐ దర్యాప్తుకు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఐదేళ్లుగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ.. కీలక నిందితుల్ని అరెస్టు చేసింది కొందరు బెయిల్‌పై ఉన్నారు. ఈ హత్యలో కీలక సూత్రధారులు ఇంకా అరెస్టు కాలేదని వివేకా కుమార్తె సునీత ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీబీఐపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన సునీతారెడ్డి దర్యాప్తు వేగంగా పూర్తి చేసేలా కీలక ఆదేశాలు తెచ్చుకున్నారు. ఆ తర్వాత కూడా ఈ కేసులో సీబీఐ నత్తనడక కొనసాగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో అసలు దర్యాప్తు ముగిసిపోయిందంటూ సుప్రీం కోర్టుకు చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# జల ప్రళయం.. కొట్టుకుపోయిన గ్రామం

**డెహ్రాడూన్-నవభూమి:** ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలతో ఉత్తరాఖండ్ రాష్ట్రం చిగురుటాకులా వణుకుతోంది. పలు ప్రాంతాల్లో భారీగా కొండ చరియలు విరిగిపడుతున్నాయి. మంగళవారం ఉత్తర కాశీ సమీపంలోని దరాలి గ్రామంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో నలుగురు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 50 మంది వరకు గల్లంతయినట్లు తెలుస్తుంది. దీనిపై సమాచారం అందుకోగానే జిల్లా అధికారులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు.
మరోవైపు గంగోత్రికి వెళ్లే మార్గం భారీ వరదల కారణంగా కొట్టుపోయింది. దీంతో ఆ ప్రాంతంతో రవాణా సంబంధాలు తెగిపోయాయి. అదీకాక పర్వత ప్రాంతాలపై కురిసిన భారీ వర్షం వరదగా మారి.. జనవాసాలను ముంచెత్తాయి. దీంతో పలు ఇళ్లు..



.. ఆ ప్రవాహ దాటికి కొట్టుకుని పోగా.. భారీ వృక్షాలు సైతం నెలకూలాయి. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామీ.. ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ.. తగిన సూచనలు చేస్తున్నారు.
భారీ వర్షాల కారణంగా ఉత్తర కాశీలో చోటు చేసుకున్న ఘటన తనను కలచి వేసిందని సీఎం పుష్కర్ సింగ్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు..యుద్ధ ప్రాతిపదిక సహాయక చర్యలు చేపట్టాయని వివరించారు. ప్రతి ఒక్కరు క్షేమంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం సింగ్ పేర్కొన్నారు. ఇక ఈ ఘటన వివరాల కోసం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తనకు ఫోన్ చేసి మాట్లాడారన్నారు.
అనంతరం ఈ సంఘటన జరిగిన ప్రాంతానికి 16 మంది ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీసుల బృందానికి తరలించామని చెప్పారని వివరించారు. రహదారులు కొట్టుకు పోవడం వల్ల ఛార్‌ధామ్ యాత్రలో భాగమైన గంగోత్రితో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయన్నారు. ఇంకోవైపు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. స్కూళ్లతోపాటు కాలేజీలకు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. ఇక హరిద్వార్‌లోని గంగా, కాళీ నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయన్నారు.

## ఉత్తరాఖండ్‌లో క్లౌడ్ బరస్ట్

(1వపేజీ తరువాయి)చర్యలలో నిమగ్నమై ఉన్నాయి... సీనియర్ అధికారులతో నిరంతర సమన్వయం చేసుకుని.. పరిస్థితిని సమీక్షిస్తున్నాం.. అక్కడి ప్రజల క్షేమం కోసం దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని ఎక్స్ ( ట్విట్టర్)లో ధామి పోస్ట్ చేశారు. ఇక, వరదల బీభత్సంపై స్పందించిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా.. ఉత్తరాఖండ్ సీఎం ధామికి ఫోన్ చేసి మాట్లాడారు. అవసరమైతే మరిన్ని బలగాలను రంగంలోకి దింపుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపిలేని భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో హరిద్వార్‌లో గంగా సహా అనేక ప్రధాన నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. సోమవారం రుద్రప్రయాగ్ జిల్లాల్లో కురిసిన వర్షానికి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కొండచరియల విరిగిపడి.. రాళ్లు, మట్టితో షాపులు పూర్తిగా కూరుకుపోయాయి. అంతకుముందు రోజు ఆదివారం నాడు ఉద్ధమమ్ సింగ్‌నగర్ జిల్లాలో భారీ వర్షాలకు లేవ్హా, దాని ఉపనదులు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో రాంపూర్-నైనిటాల్ ప్రధాన రహదారి, చకర్పూర్, లఖన్‌పూర్, పిస్టోర్, బర్హైని గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. ఈ భారీ వర్షాలు ఇంకా కొనసాగే అవకాశం ఉన్నట్న్టట భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. మంగళవారం కొండ ప్రాంతాలకు 'రెడ్ అలర్ట్'జారీ చేసింది. అలాగే, లిఈ వారం మొత్తం 'ఎల్లో అలర్ట్'ను కూడా ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని స్థానిక అధికారులు సూచిస్తున్నారు.

## భారత్ వర్సెస్ ట్రంప్..!

(1వపేజీ తరువాయి)విధిస్తానని ట్రంప్ హెచ్చరించారు. సాయిరెడ్డి షాకింగ్ ట్వీట్..! భారతదేశం మంచి వాణిజ్య భాగస్వామి కాదని, ఎందుకంటే వారు మాతో చాలా వ్యాపారం చేస్తారు, కానీ మేము వారితో వ్యాపారం చేయమని ట్రంప్ సీఎన్బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. కాబట్టి తాము సుంకాల్ని 25శాతానికి పరిమితం చేసినట్లు తెలిపారు. కానీ రాబోయే 24 గంటల్లో తాను దానిని గణనీయంగా పెంచబోతున్నానని ట్రంప్ వెల్లడించారు. ఎందుకంటే భారత్ రష్యన్ చమురును ఇంకా కొనుగోలు చేస్తోందని తెలిపారు. రష్యా నుంచి భారీ ఎత్తున చమురు కొంటూ దాన్ని అత్యధిక లాభాలకు అమ్ముకుంటోందంటూ భారత్ పై నిన్న ట్రంప్ విరుచుకుపడ్డారు. దీన్ని ఆపకపోతే భారీగా సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. ఇవాళ ఈ హెచ్చరికల తీవ్రత మరింత పెంచి 24 గంటల డెడ్ లైన్ కూడా ఇచ్చేశారు. నిన్న ట్రంప్ హెచ్చరికల తర్వాత స్పందించిన విదేశాంగశాఖ .. భారతదేశ దిగుమతులు ప్రపంచ మార్కెట్ పరిస్థితి వల్ల తప్పనిసరి అవసరం అయినప్పటికీ, దానిని విమర్శించే దేశాలు అటువంటి వాణిజ్యం కీలకమైన తప్పనిసరి కానప్పటికీ రష్యాతో వాణిజ్యంలో మునిగిపోతున్నాయంటూ విమర్శించింది. భారత్ నుంచి ఈ ప్రకటన రావడం, రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపకపోవడం వంటి కారణాలతో ట్రంప్ ఇవాళ తీవ్ర హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. 24 గంటల్లో భారత్ పై తీవ్ర స్థాయిలో సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ చేసిన హెచ్చరికపై కేంద్రం స్పందించాల్సి ఉంది. అయితే రష్యా చమురు దిగుమతుల్ని మాత్రం ఆపేందుకు కేంద్రం నిరాకరిస్తూనే ఉంది. ట్రంప్ రేపు అత్యధిక సుంకాలు విధిస్తే ఇతర మార్కెట్లపై ఫోకస్ చేయాలన్న ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది.

## చిరంజీవి రాజకీయ రీ ఎంట్రీ

(1వపేజీ తరువాయి)వెనుక మతలబు ఇదేనా? అంటూ బీఆర్ఎస్ నేతలు గుసగుసలాడుతున్నారు. ఇక తాజాగా జరుగుతున్న ప్రచారంతో మరోమారు ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో చిరంజీవి రాజకీయం హాట్ టాపిక్ గా మారింది. రేవంత్ రెడ్డిని కలిసిన చిరంజీవి ఇటీవల మెగాస్టార్ చిరంజీవి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అయితే ఈ కలవడం వెనుక మతలబు వేరే ఉందని ప్రస్తుతం చర్చ జరుగుతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో మెగాస్టార్ చిరంజీవిని దించాలని రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నట్లుగా చర్చ జరుగుతుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో చిరంజీవిని దింపాలని రేవంత్ యత్నం రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపై దృష్టి సారించిన మెగాస్టార్ చిరంజీవిని జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో దించితే కచ్చితంగా విజయం సాధిస్తారు అన్న భావనలో ఉన్న రేవంత్ రెడ్డి చిరంజీవి ముందు ఆ ప్రపోజల్ పెట్టినట్టుగా చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఉపఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఈ ఉప ఎన్నికల్లో పోటీ పడడం కోసం కాంగ్రెస్ పార్టీ నుండి స్థానిక ఆశావహులు చాలామంది ఉన్నారు. చిరంజీవిని పోటీ చేయించాలనే రేవంత్ ఆలోచన వెనుక అయినప్పటికీ వారందరినీ కాదని చిరంజీవికి ఆఫర్ చేయడం వెనుక ఆసక్తికర విషయం ఉందని టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు జరిపిన సర్వేలో బిఆర్ఎస్‌తో పోటీ విషయంలో కాంగ్రెస్ వెనుకబడి ఉందని ఇక దీనిని సీరియస్‌గా తీసుకున్నారు రేవంత్ రెడ్డి, చిరంజీవిని పోటీ చేయిస్తే తిరిగే ఉండదని భావిస్తున్నారని చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం సాధిస్తే పార్టీ రానున్న లోకల్ బాడీ ఎన్నికలలోను, జిహెచ్ఎంసి ఎన్నికలలోను విజయం సాధించే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి భావిస్తున్న క్రమంలోనే చిరంజీవితో ఈ విషయం పైన చర్చించి అధిష్టానానికి నివేదించేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య ఇటీవల భేటీ జరిగినట్టుగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఏం జరగబోతుంది అన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.


## కాంగ్రెస్‌కు బిగ్ షాక్

(1వపేజీ తరువాయి)పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు, నా జూనియర్లకు కూడా ఇచ్చారు. ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాలని అనుకోవడం లేదు. దిగజారి బతకడం తెలియదు. మళ్లీ త్యాగానికైనా సిద్ధం. ఎంత దూరమైనా మునుగోడు ప్రజల కోసం వెళ్తా. నా నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయను.. అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. గత కొన్ని రోజులుగా పార్టీపై ఆగ్రహంతో ఉంటూ వస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మరో పదేళ్లు తానే సీఎం అని రేవంత్ రెడ్డి అనడంపై.. ఇలా చెప్పుకోవడం కాంగ్రెస్ విధానం కాదన్నారు రాజగోపాల్ రెడ్డి. సోషల్ మీడియా జర్నలిస్టులపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయిన నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. ఇది కరెక్ట్ కాదంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన సోదరుడైన రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. తాను మంత్రి పదవి ఇప్పించే స్థాయిలో లేనని వ్యాఖ్యానించారు.

# మళ్లీ బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్!

**హైదరాబాద్-నవభూమి:** మూడేళ్ల తర్వాత బీజేపీ తన ఆపరేషన్ ఆకర్ష్‌ను మళ్లీ ప్రారంభించిందా? ఏ ఫాంహౌస్ నుంచైతే తమను లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్ రాజకీయ రచ్చ చేసిందో.. అదే ఫాంహౌస్ కేసులోని కీలక వ్యక్తులతోనే రివర్స్‌గేమ్‌ను మొదలుపెట్టిందా? అంటే తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. నాడు ఫాంహౌసలో సమావేశమైన నలుగురు ఎమ్మెల్యేల్లో ఇద్దరు (ప్రస్తుతం మాజీ) ఇటీవల బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌ని కలుసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. తాను ఈ నెల 9న బీజేపీలో చేరుతున్నట్లు గువ్వల ప్రకటించగా, మరో మాజీ ఎమ్మెల్యే కూడా త్వరలోనే కాషాయ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. ఆయనతో పాటు బీఆర్ఎస్ మరో మాజీ ఎమ్మెల్యే కూడా బీజేపీలో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మునుగోడు ఉప ఎన్నికలో తాము గెలిచి ఉంటే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోయేదని కమలనాథులు అభిప్రాయపడుతున్నారు. ఉప ఎన్నిక ముందు ఆ ఘటన జరిగి ఉండకపోతే తప్పకుండా తామే గెలిచేవాళ్లమని, అప్పుడు రాజకీయ చిత్రమే మారిపోయేదని పేర్కొంటున్నారు. అందుకే ఎక్కడైతే తమ ప్రణాళిక ఆగిపోయిందో అక్కడి నుంచే బీఆర్ఎస్ లక్ష్యంగా రివర్స్‌ప్లాన్ మొదలు పెట్టిందని అంటున్నారు. ఈ వ్యవహారమంతటికీ ఫోన్ ట్యాపింగే కారణమని పార్టీ నేతలు అంతర్గత సంభాషణల్లో చెప్పుకొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం, అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న బీఆర్ఎసను మరింత దెబ్బతీయడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెసకు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగే క్రమంలో బీఆర్ఎసలో జరుగుతున్న పరిణామా లను అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# కశ్మీర్‌లో ఆపరేషన్ నాగ్నీ.. భారీగా ఆయుధాల పట్టివేత







**శ్రీనగర్-నవభూమి:** జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా లో భద్రతా దళాలు కీలకమైన కౌంటర్ టెర్రర్ ఆపరేషన్ నిర్వహించారు. 'ఆపరేషన్ నాగ్నీ' పేరుతో సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు, బీఎస్ఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఉగ్రస్థావరాన్ని గుర్తించారు. పెద్దఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్ధాలు స్వాధీనం చేసుకున్నారు. కలరూస్ ప్రాంతంలో మూడురోజులుగా ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు చినార్ కోర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. ఉగ్రవాద స్థావరంలో ఒక పిస్తోలు, రెండు మ్యాగ్జైన్‌లు, 12 గ్రనేడ్లు, ఇతర పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. 370వ అధికరణ రద్దయి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ జరిపిన ఆపరేషన్‌లో ఈ భారీ డంప్ దొరికినట్టు చెప్పారు. దక్షిణ కశ్మీర్‌లో కుల్గాం జిల్లాలో 5రోజులుగా అఖల్ దేవసర్‌లో బలగాలు ప్రత్యేకమైన ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌లో ఇంతవరకూ ఒక ఉగ్రవాదిని బలగాలు మట్టుబెట్టారు. ఇటీవల 'ఆపరేషన్ మహదేవ్'లో పహల్గాం ఉగ్రవాదులు ముగ్గురిని భద్రతా బలగాలు మట్టుబెట్టగా, జూలై 30న ఆపరేషన్ శివశక్తిలో ఇద్దరు చొరబాటుదారులను భద్రతా బలగాలు హతమార్చాయి.

## బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు కాన్వాయ్‌పై దాడి



**సిలిగురి-నవభూమి:** పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి కాన్వాయ్‌పై ఇవాళ దాడి జరిగింది. బీజేపీ నేత సువేందు ఇవాళ కూచ్ బిహార్‌లో పర్యటిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయన వాహనంపై అటాక్ చేశారు. బుల్లెట్‌ప్రూఫ్‌కు వెహికల్‌కు చెందిన అద్దాలను ఆగంతకులు ధ్వంసం చేశారు. అయితే బుల్లెట్‌ప్రూఫ్ కారులో ఉండడం వల్ల ప్రాణాలతో బయటపడినట్లు ఆయన పేర్కొన్నారు. ఇలా జరుగుతుందని తనకు తెలుసు అని బీజేపీ నేత ఆరోపించారు.
కూచ్ బిహార్‌లో జరుగుతున్న నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో అటాక్ జరిగినట్లు బావిస్తున్నారు. ఇటీవల బెంగాల్‌లో మహిళలపై హింస అధికమైంది. నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో టీఎంసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన ర్యాలీ తీశారు. తాజాగా బంకురా జిల్లాలో ఆ ర్యాలీ నిర్వహించారు.

## కోటి రూపాయలతో భారత్‌లో జీవించవచ్చా.. ఎన్ఆర్ఐ వింత ప్రశ్న.. స్పందించిన నెటిజన్లు..




**న్యూఢిల్లీ-నవభూమి:** గత పదేళ్ల నుంచి చూసుకుంటే దేశం చాలా రంగాలలో అభివృద్ధి చెందింది. ఎంతలా అంటే పదేళ్ల క్రితం దేశం విడిచి వెళ్లిన వ్యక్తి నేడు దేశానికి వస్తే తన ఇంటి పరిసరాలను సైతం గుర్తించలేనంతగా.. 70 సంవత్సరాల భారత్ చాలా దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొనేది. నేడు అది లేదు పారిశుధ్యంలో దేశం అగ్రభాగానికి వెళ్లింది. ఆర్థిక పరంగా కూడా దేశం టాప్ 10లో ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. 11 సంవత్సరాల క్రితం న్యూజిలాండ్‌కు వెళ్లిన వ్యక్తి పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది. బొత్స, ధర్మాన మౌనమెందుకు? ఆశ్చర్యపరిచిని రెడ్డిట్స్ పోస్ట్.. పంజాబ్ కు చెందిన ఒక వ్యక్తి రెడ్డిట్స్‌లో ఒక పోస్ట్ పెట్టాడు. ఆ పోస్ట్ ఇప్పుడు ఇండియా వ్యాప్తంగా వైరల్ గా మారింది. పంజాబ్ పుట్టి పెరిగిన తాను 19వ సంవత్సరంలో భారత్‌ను వీడి న్యూజిల్యాండ్‌కు వచ్చాను. నాకు ఇప్పుడు 30 సంవత్సరాలు ఇన్నేళ్లలో న్యూజిల్యాండ్‌లో 2 లక్షల కరెన్సీ (ఇండియన్ రూపీలో 1.03 కోట్లు) కూడబెట్ట గలిగాను. ఇప్పుడు ఈ డబ్బులతో ఇండియాలో జీవించవచ్చా.. అనే ప్రశ్నను పోస్ట్ చేశాడు. దీంతో పాటు ఆయన ఫైనాన్సియల్ స్టేటస్‌ను కూడా ఇందులో పెట్టాడు. నేను న్యూజిలాండ్‌కు వస్తున్న సమయంలో ఇండియాలో కోటి రూపాయలు చాలా పెద్ద మొత్తం నేడు అది ఎంతలా ఉంది. అని ప్రశ్నిస్తూనే తనకు ఒక షాపు ఉంది ఇది ఏడాదికి ఐదు లక్షల వరకు సంపాదిస్తుంది దీనితో పాటు సొంత ఇల్లు కూడా ఉందని, 70 లక్షల న్యూజిల్యాండ్ యూఎస్ స్టాక్స్ కూడా ఉన్నాయని చెప్పుకచ్చాడు. పంజాబియన్ చేసిన పోస్ట్‌కు నెటిజన్లు స్పందించారు. కోటి రూపాయలు అనేవి పెద్ద మొత్తమే అని కొందరు చెప్తే.. అందులో టాక్స్ కూడా కట్ అవుతుంది ఇది కూడా చూసుకోవాలని కొందరు చెప్పారు. కోటి రూపాయలు పెద్ద డబ్బు కాదని, పెట్టుబడి పెట్టి మరింత ఆర్జించవచ్చని కొందరు చెప్తున్నారు. నేనైతే ఇండియాకు తిరిగిరాను అక్కడే శాశ్వతంగా ఉండిపోతానని మరొకరు చెప్తున్నారు. ఏది ఏమైనా న్యూజిల్యాండ్‌కు ఇండియాకు మధ్య కోటి రూపాయల వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నేడు భారత్ ఆర్థికంగా వేగంగా వృద్ధి సాధించడంతో పాటు భద్రత కలిగిన నేషన్‌గా గుర్తింపు సంపాదించుకుంది. దీంతో చాలా మంది ఎన్ఆర్ఐ దేశానికి తిరిగి వచ్చేందుకు ఇంట్రస్ట్ చూపుతున్నారు. అమెరికాలోని భారతీయులు కూడా ఇండియాకు తిరిగి రావడం కనిపిస్తుంది.

## యోగీ మార్క్ ట్రీట్‌మెంట్..



**లక్నో-నవభూమి:** కేవలం ఒక దేశమే కాదు.. ప్రపంచం మొత్తం కీర్తించే వ్యక్తి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. సన్యాసి అయిన ఆయన తన కుటుంబం, అక్కా, అన్న లాంటి బంధాలను పట్టించుకోకుండా కేవలం రాష్ట్ర ప్రజల కోసమే పని చేస్తున్న గొప్ప దర్శనికుడు. అతి చిన్న వయస్సులో సన్యాసాశ్రమం తీసుకున్న యోగీ అదే వయస్సులో రాజకీయల్లోకి కూడా వచ్చాడు. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి తోడు పడవోయ్ అన్న గురజాడవారి వ్యాఖ్యలకు నూటికి నూరు శాతం అమలు చేస్తున్నాడు. యోగీ సొంత లాభం కొంత కాదు.. స్వలాభం ఏమాత్రం పట్టించుకోరు. యూపీలో ఒక్క గ్యాంగ్ కూడా లేదు.. దేశంలోనే అత్యంత పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ అంత పెద్ద రాష్ట్రాన్ని పాలించాలంటే ఆశామాషీ కాదు. దేశంలోనే ఎక్కువ గ్యాంగులు ఉన్న రాష్ట్రం కూడా యూపీ. యోగీ ముఖ్యమంత్రి అయ్యాక ఆ పరిస్థితులు పోయాయి. చేసిన తప్పులు ఒప్పుకొని లొంగిపోవాలని, లేదంటే దేవుడి దగ్గర వెళ్లక తప్పదని హెచ్చరించారు. ఇప్పుడు యూపీలో ఒక్క గ్యాంగ్ కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఇక ధర్మంను పక్కాగా ఆచరిస్తూ పరమత సహనాన్ని వహిస్తుంది యోగీ ప్రభుత్వం. హిందూ వాది యోగి అని ముద్ర పడినా యూపీలో అన్ని మతస్తులు ఆనందంగా ఉన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయి. గోవులను సైతం రక్షించి పాడి పంటను ఊహించని విధంగా డెవలప్ చేస్తున్నారు యోగీ. గత పాలనలో యువతులపై దాడులు విపరీతంగా పెరిగేవి. సీరియస్ యాక్షన్ తీసుకునేవారు లేక వారి ఆగడాలు పెరిగిపోయాయి. వీటిని గుర్తించిన యోగీ ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. వర్గం ఏదైనా ఆడవారి జోలికి వెళ్తే.. కఠినంగా వ్యవహరించాలని చెప్పుకచ్చింది. దీంతో పోకిరీలు మహిళలతో జాగ్రత్తగా నడుచుకుం టున్నారు. ప్రైవేట్ పార్ట్స్ తాకినందుకు షూట్.. ఇటీవల జరిగిన ఘటన యోగీ ప్రభుత్వంలో మహిళలకు ఉండే భద్రత గురించి వివరిస్తుంది. మొరాదాబాద్ లో ఒక ముస్లిం స్త్రీ బుర్కా ధరించి రోడ్డుపై వెళ్లుంది. అయితే వెనుక నుంచి బైక్ పై వచ్చిన ఒక వ్యక్తి ఆమె విషయంలో తప్పుగా ప్రవర్తించాడు. వెనుక నుంచి గట్టిగా పట్టుకొని పారిపోయాడు. దీంతో ఆమె ఒక్కసారిగి షాక్ అయ్యింది. ఈ విషయాన్ని సీసీ కెమెరాలో చూసిన పోలీసులు సదరు వ్యక్తికోసం గాలించారు. అతను ఆదిల్‌గా గుర్తించారు. పారిపోతుండగా పట్టుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను ఇల్లీగల్ వెపన్ తో బెదిరించేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతని కాలిపై కాల్చారు. ఆ తర్వాత హాస్పిటల్ కు తరలించారు. ముస్లిం యువతికి హాస్పిటల్‌కు తీసుకువచ్చి క్షమాపణలు చెప్పించారు. యోగీ మార్క్ పాలన అంటే స్త్రీ పట్ల ఎంత గౌరవం ఉంటుందో ఈ ఒక్క సంఘటన తెలిస్తే అర్థం అవుతుంది.

# చనిపోయిన మహిళ ఖాతాలోకి రూ.లక్షా 13 వేల కోట్లు.. ఎలా వచ్చాయంటే?





**నోయిడా-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. చనిపోయిన గాయత్రి దేవి అనే మహిళ ఖాతాలో అకస్మాత్తుగా రూ. 1.13 లక్షల కోట్లు జమ అయ్యాయి. ఆమె కొడుకు దీపక్ ఈ విషయాన్ని గుర్తించి బ్యాంకు అధికారులకు తెలియజేశాడు. ఇంత పెద్ద మొత్తం ఎలా వచ్చిందనేది మిస్టరీగా మారింది. ఆదాయపు పన్ను శాఖ దీనిపై దర్యాప్తు చేస్తోంది. అసలు ఈ డబ్బు ఎవరిది, ఎందుకు వచ్చిందో తెలుసుకోవాల్సి ఉంది. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థలో అప్పుడప్పుడు విచిత్రమైన సంఘటనలు జరుగుతుంటాయి. అయితే ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన ఒక సంఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రెండు నెలల క్రితం మరణించిన ఒక మహిళ బ్యాంక్ ఖాతాలోకి ఏకంగా రూ. 1.13 లక్షల కోట్ల భారీ మొత్తం జమ అయింది. ఒక సాధారణ మహిళ ఖాతాలోకి ఇంత పెద్ద మొత్తం ఎలా జమ అయిందనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. గ్రేటర్ నోయిడాకు చెందిన గాయత్రి దేవి అనే మహిళ రెండు నెలల క్రితం మరణించింది. ఆమె కుమారుడు 19 ఏళ్ల దీపక్.. తన తల్లి ఖాతాను నిర్వహిస్తుండేవాడు. అయితే ఆదివారం రాత్రి తన తల్లి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన ఫోన్‌కి ఒక సందేశం వచ్చింది. అందులో 10,01,35,60,00,00,00,00,0 0,01,00,23,56,00,00,00,00,299 (ఒక లక్షా పదమూడు వేల కోట్ల రూపాయలకు పైగా) డబ్బులు జమ అయినట్లుగా చూపించింది. మొదట ఈ సంఖ్యలో ఉన్న సున్నాలను చూసి దీపక్ ఆశ్చర్యపోయాడు. ఇది పొరపాటు అనుకుని తన స్నేహితులకు ఈ సందేశాన్ని పంపించాడు. వారు నిజంగానే మీ అమ్మ ఖాతాలో లక్షల కోట్లు క్రెడిట్ అయ్యాయని చెప్పగా.. అతడు కూడా ఖాతా చూసుకుని మరింత షాక్ అయ్యాడు. దీంతో సోమవారం రోజు ఉదయమే.. దీపక్ కోటక్ మహీంద్రా బ్యాంక్ శాఖకు వెళ్లాడు. ఈ సంఘటన గురించి బ్యాంకు అధికారులకు తెలియజేయగా.. వారు కూడా నివ్వెరపోయారు. ఇంత పెద్ద మొత్తంలో లావాదేవీ జరగడం అసాధారణం కావడంతో.. వెంటనే ఆ ఖాతాను ఫ్రీజ్ చేసి, ఈ విషయాన్ని ఆదాయపు పన్ను (ఐటీ) విభాగానికి తెలియజేశారు. ఈ వార్త క్రమంగా చుట్టుపక్కల ప్రాంతాలకు పాకడంతో దీపక్‌కు ఫోన్ కాల్స్ వరదలా వచ్చి పడ్డాయి. బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారు ఆ డబ్బు గురించి వాకబు చేయడం మొదలు పెట్టారు. ఈ ఫోన్ కాల్స్ తాళలేక దీపక్ తన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ భారీ మొత్తం ఖాతాలో జమ కావడానికి పలు కారణాలు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇది బ్యాంకింగ్ లోపం వల్ల జరిగిందా, సాంకేతిక సమస్య వల్ల జరిగిందా లేదా మనీలాండరింగ్ వంటి అక్రమ లావాదేవీలకు సంబంధించినదా అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు.
అయితే ఇంత పెద్ద మొత్తం ఒక సాధారణ వ్యక్తి ఖాతాలోకి, అందులోనూ మరణించిన వ్యక్తి ఖాతాలోకి రావడం అనేక సందేహాలకు తావిస్తోంది. ఈ మొత్తంపై ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు ప్రారంభించింది. దీని వెనుక అసలు కారణాలు ఏమిటో తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. చూడాలి మరి ఏం జరిగింది.
ఎవరు గాయత్రీ దేవి ఖాతాలో ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు వేశారనేది.

## ఇథనాల్ కలిపిన పెట్రోల్ మంచిదా? కాదా?.. కేంద్రం క్లారిటీ ఇదే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఇటీవల E20 పెట్రోల్‌పై వస్తున్న విమర్శలకు గట్టిగా సమాధానం ఇచ్చింది. చాలామంది E20 పెట్రోల్ వాడడం వల్ల ఇంధన సామర్థ్యం గణనీయంగా తగ్గుతుందని, వాహనాల ఇంజిన్లకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ భయాలన్నీ నిరాధారమైనవని, శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల విశ్లేషణల మద్దతు ఎంత మాత్రమూ లేదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. E20 పెట్రోల్‌ను ఉపయోగించడం వల్ల ఇంధన సామర్థ్యం తక్కువగా తగ్గుతుందని, ఇంజిన్ పనితీరు మెరుగవుతుందని మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. మంత్రిత్వ శాఖ ప్రకారం.. 20 పెట్రోల్‌లోని ఇథనాల్‌కు సాధారణ పెట్రోల్ కంటే ఎక్కువ ఆక్టేన్ సంఖ్య ఉంటుంది. ఈ అధిక ఆక్టేన్ సంఖ్య ఇంజిన్‌ను మరింత సున్నితంగా, సమర్థవంతంగా పని చేసేలా చేస్తుంది. ముఖ్యంగా ఆధునిక, అధిక కంప్రెషన్ రేషియో గల ఇంజిన్లలో ఇది మెరుగైన పని తీరును చూపిస్తుంది. E20 పెట్రోల్ వాడకం వల్ల ఇంధన సామర్థ్యం కొంత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ.. ఇది చాలా స్వల్పం. 210 ఇంధనం కోసం రూపొందించబడినప్పటికీ.. E20 కి అనుకూలంగా ఉండే వాహనాలకు మైలేజీలో 1 నుంచి 2 శాతం మాత్రమే తగ్గుదల ఉంటుందని, ఇతర వాహనాలకు ఈ తగ్గుదల 3 నుంచి 6 శాతం వరకు ఉండవచ్చని మంత్రిత్వ శాఖ తెలియజేసింది. అయితే ఈ స్వల్ప నష్టాన్ని కూడా మెరుగైన ఇంజిన్ ట్యూనింగ్, E20 కి అనుకూలంగా ఉండే భాగాల వాడకం ద్వారా తగ్గించవచ్చని పేర్కొంది.
మంత్రిత్వ శాఖ దీని వల్ల దేశానికి కలిగే ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలను కూడా నొక్కి చెప్పింది. ఇథనాల్ కలపడం వల్ల దేశం ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని పేర్కొంది. 2014-15 నుండి ఇథనాల్ వాడకం ద్వారా సుమారు 1.40 లక్షల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయగలిగామని వెల్లడించింది. అంతేకాకుండా ఇథనాల్ ఉత్పత్తి కోసం రైతుల నుంచి పంటలను సేకరించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభిస్తుందని వివరించింది. ఈ కాలంలో రైతులకి 1.20 లక్షల కోట్ల రూపాయలకు పైగా చెల్లింపులు జరిగాయని చెప్పింది. ఇథనాల్ వాడకం వల్ల 700 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గాయని, ఇది పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని మంత్రిత్వ శాఖ వివరించింది.
E20 పెట్రోల్‌కు సంబంధించిన ప్రమాణాలను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ ఇప్పటికే నిర్దేశించాయని.. దీనిలో భాగంగా రబ్బరు, ప్లాస్టిక్ వంటి భాగాల క్షీణతను నిరోధించే రసాయనాలను ఇంధనంలో కలుపుతారని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీనివల్ల పాత వాహనాలకు కూడా పెద్దగా నష్టం జరగదని, ఒకవేళ ఏవైనా భాగాలు మార్చాల్సి వచ్చినా, అవి చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్నవని పేర్కొంది. E20 పెట్రోల్ వినియోగం వల్ల వాహనాలకు హాని జరుగుతుందని లేదా వినియోగదారులకు అనవసరమైన ఆర్థిక భారం పడుతుందని జరుగుతున్న ప్రచారం పూర్తి అవాస్తవం అని తేల్చి చెప్పింది. ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ఒక ప్రణాళికాబద్ధంగా, దశలవారీగా అమలు చేయబడుతోందని.. ఇది దేశ ఇంధన భద్రత, ఆర్థిక అభివృద్ధి, పర్యావరణ రక్షణకు ఎంతో కీలకమని తెలియజేసింది.


फॉर्म/Form - XII
निवास प्रमाण पत्र हेतु आवेदन पत्र
लिय का नाम: अंचल - मोहिउद्दीन नगर, अनुमंडल - पटोरी, जिला - समस्तीपुर, बिहार
RCCO/2025/17989735 आवेदन की तिथि : 29/07/2025
lication Type : ऑनलाइन / Online
of Applicant) : डोनाल्ड जॉन ट्रम्प (Donald John Trump)
: पुरुष / Male
Father) : फ्रेडरिक क्राइस्ट ट्रम्प (Frederick Christ Trump)
Husband) :
Mother) : मैरी ऐनी मैकलियोड (Mary Anne Macleod)

## బరి తెగిస్తున్న కేటుగాళ్లు.. ట్రంప్ పేరిట నివాస గృహపత్రం

**పట్నా-నవభూమి:** బిహార్ రాష్ట్రంలో కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఫేక్ రెసిడెన్స్ సర్టిఫికేట్ల కోసం ఏకంగా దేవుళ్ల పేర్లను వాడుకుంటున్నారు. రెసిడెన్స్ సర్టిఫికేట్ కోసం వచ్చిన అప్లికేషన్లు చూసి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం 'డాగ్ బాబు' పేరిట కుక్కకు అధికారులు సర్టిఫికేట్ ఇచ్చారు. ఆ సర్టిఫికేట్ కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. వెంటనే వారు ఆ సర్టిఫికేట్‌ను క్యాన్సిల్ చేయించారు. ఆ సర్టిఫికేట్ జారీ చేసిన అధికారులను సస్పెండ్ చేశారు. 'డాగ్ బాబు' సంఘటన తర్వాత.. 'డాగేశ్ బాబు' సంఘటన కూడా చోటుచేసుకుంది. డాగేశ్ బాబు అనే కుక్క పేరుతో రెసిడెన్స్ సర్టిఫికేట్ కావాలంటూ గుర్తుతెలియని వ్యక్తులు అప్లికేషన్ పెట్టారు. ఆ అప్లికేషన్ చూసి అధికారులు షాక్ అయ్యారు. దాన్ని రిజెక్ట్ చేశారు. నిన్నటి వరకు జంతువుల్ని వాడుకున్న కేటుగాళ్లు ఇప్పుడు ఏకంగా దేవుళ్లనే వాడుకుంటున్నారు. తాజాగా, రాముడి పేరు మీద రెసిడెన్స్ సర్టిఫికేట్ కావాలంటూ అప్లికేషన్ వచ్చింది. ఆ అప్లికేషన్ మీద రాముడి ఫొటో చూసి అధికారులు అవాక్ అయ్యారు. వెంటనే ఈ దరఖాస్తుదారుడిని పిలిచి మందలించారు. సమస్తిపూర్ జిల్లాలోని మొహియుద్దీన్‌నగర్ పరిధిలో జూలై 29న ఓ ఆన్‌లైన్ దరఖాస్తు అందింది. BRCCO%/2025/17989735 నంబర్‌తో ఉన్న ఆ దరఖాస్తులో డొనాల్డ్ ట్రంప్ ఫొటో ఉంది. చిరునామాగా హసన్‌పూర్ గ్రామం, వార్డ్ నెం. 13, బకర్‌పూర్ పోస్ట్, మొహియుద్దీన్‌నగర్ పోలీస్ స్టేషన్ అని పేర్కొన్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన అధికారులకు ఫొటో, ఆధార్ నంబర్, బార్‌కోడ్, చిరునామా వంటి వివరాలన్నీ తప్పుగా ఉన్నట్లు తేలింది. ఇది ఎవరో కావాలనే చేసిన పనిగా గుర్తించిన సర్కిల్ ఆఫీసర్ వెంటనే ఆ దరఖాస్తును తిరస్కరించారు. ప్రభుత్వ వ్యవస్థ పరువు తీసేందుకే ఈ చర్యకు పాల్పడ్డారని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఐటీ చట్టం కింద ఫిర్యాదు చేసినట్లు మొహియుద్దీన్‌నగర్ సీవో ధృవీకరించారు.
ఇది ఎవరో కావాలనే చేసిన పనిగా గుర్తించిన సర్కిల్ ఆఫీసర్ వెంటనే ఆ దరఖాస్తును తిరస్కరించారు.
ఈ ఘటనపై స్థానిక సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఐటీ చట్టం కింద ఫిర్యాదు చేసినట్లు మొహియుద్దీన్‌నగర్ సీవో ధృవీకరించారు. "ఈ పనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దరఖాస్తు చేసిన ఐపీ అడ్రస్, లాగిన్ వివరాల ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు" అని ఆయన వివరించారు.

## జమ్మూ కశ్మీర్ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూ కశ్మీర్ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. ఆయన వయస్సు 79 ఏళ్లు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సత్యపాల్ మాలిక్ ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. జమ్మూ కశ్మీర్‌తో పాటు పలు రాష్ట్రాలకు ఆయన గవర్నర్‌గా పనిచేశారు.
జాట్ సామాజిక వర్గానికి చెందిన సత్యపాల్ మాలిక్ స్వస్థలం ఉత్తర్ ప్రదేశ్‌లోని బాగ్‌పత్. విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. తొలిసారి 1974లో చౌధరి చరణ్ సింగ్ స్థాపించిన భారతీయ క్రాంతి దళ్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం రాజ్యసభ సభ్యుడిగా, తర్వాత జనతా దళ్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో అలీగఢ్ నుంచి పోటీచేసి విజయం సాధించారు . అనంతరం కాంగ్రెస్.. అక్కడ నుంచి లోక్‌దళ్ తర్వాత సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. గొప్ప రాజనీతిజ్ఞుడిగా గుర్తింపు పొందిన మాలిక్.. తొలిసారి 2017లో బిహార్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఒడిశా గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆగస్టు 2018లో జమ్మూ కశ్మీర్ గవర్నర్‌గా నియమితులయ్యారు.. ఏడాది తర్వాత ఆగస్టు 2019లో జమ్మూ కశ్మీర్‌కు కేంద్రం ప్రత్యేక హోదా రద్దు చేసి, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత మాలిక్‌ను గవర్నర్‌గా కొనసాగించారు. అలాగే, పుల్వామా ఉగ్రదాడి జరిగిన సమయంలో కూడా ఆయనే లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్నారు. జమ్మూ కశ్మీర్ తర్వాత గోవా, ఆపై మేఘాలయ రాష్ట్రాలకు గవర్నర్‌గా మాలిక్ సేవలందించారు.

# సైబర్ వలలో భారతీయులు.. ఒక్క ఏడాదిలోనే రూ.23 వేల కోట్ల మోసాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** టెక్నాలజీ పెరిగితే డెవలప్‌మెంట్ జరుగుతుంది అనేది ఎంత నిజమో.. అదే టెక్నాలజీతో కొత్త సమస్యలు వస్తాయి అనేది కూడా అంతే వాస్తవం. గత కొన్నేళ్లుగా దేశంలో డిజిటల్ పేమెంట్స్ భారీగా పెరిగిపోయాయి. అదే రేంజ్‌లో సైబర్ నేరాలు కూడా అంతే స్థాయిలో పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు వేసిన వలలో చిక్కుకుని సామాన్యులు.. తమ కష్టార్జితం మొత్తాన్ని ధారపోస్తున్నారు. వేలు, లక్షలు ఇలా అందినకాడికి అమాయకుల నుంచి సైబర్ కేటుగాళ్లు స్మార్ట్‌గా దోచేస్తున్నారు. ఇక గతేడాది ఒక్క సంవత్సరంలోనే భారతీయులకు సంబంధించిన దాదాపు రూ.23 వేల కోట్ల సొమ్మును సైబర్ నేరగాళు కొట్టేశారు. సైబర్ మోసాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. కొత్త కొత్త మార్గాల్లో కేటుగాళ్లు తమ చేతివాటం ప్రదర్శిస్తూ సవాల్ విసురుతున్నారు. ఇంతకీ ఎలాంటి సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అమాయకులను ఎలా సైబర్ ఉచ్చులోకి లాగుతున్నారు అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. సైబర్ వలలో భారతీయులు.. ఒక్క ఏడాదిలోనే రూ.23 వేల కోట్ల మోసాలు, అమాయకులను ఎలా మాయచేస్తున్నారంటే?
సైబర్ వలలో భారతీయులు.. ఒక్క ఏడాదిలోనే రూ.23 వేల కోట్ల మోసాలు, అమాయకులను ఎలా మాయచేస్తున్నారంటే? ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు .. పెను సవాల్ విసురుతున్నాయి. ఎన్ని సైబర్ భద్రతా చర్యలు, టూల్స్ అందుబాటులోకి తీసుకువచ్చి ఎత్తులు వేసినా.. వాటికి పైఎత్తులు వేస్తూ సైబర్ నేరగాళ్లు కొరకరాని కొయ్యలాగా మారుతున్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఎక్కడో ఓ మూలన ఉండి.. ఖాతాల్లో ఉన్న డబ్బును ఊడ్చేస్తున్నారు. చాలా మంది ఏళ్లుగా దాచుకున్న సేవింగ్స్.. జీవితాంతం పనిచేసి కూడబెట్టుకున్న పీఎఫ్ డబ్బులు.. పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం దాచి పెట్టిన డబ్బు.. ఆస్తులు అమ్మగా వచ్చిన సొమ్ములు అకౌంట్లలోకి పడగానే.. స్మార్ట్‌గా కొట్టేస్తున్నారు. ఒకప్పుడు ఓటీపీ, పిన్ నంబర్, ఏటీఎం కార్డులు, అకౌంట్ నంబర్లు తెలుసుకుని.. సైబర్ మోసాలకు పాల్పడితే.. టెక్నాలజీ పెరిగిన తర్వాత.. అవేమీ లేకుండానే ఖాతాను ఖాళీ చేస్తున్నారు. ఒక్కసారి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే.. ఉన్నదంతా ఊడ్చేవరకు వదిలిపెట్టరు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి సైబర్ నేరాలు తీవ్ర భయాందోళనలను కలిగిస్తూనే ఉన్నాయి. మన దేశంలోనూ గత కొన్ని ఏళ్లుగా సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇక 2024 ఏడాదిలోనే దేశంలో రూ.22,842 కోట్ల మోసాలు జరిగినట్లు తాజాగా వెల్లడి కావడం మరింత భయాందోళనలకు గురిచేస్తోంది. భారత్‌లో సైబర్ నేరాలకు సంబంధించి డేటాలీడ్స్ అనే మీడియా, టెక్నాలజీ కంపెనీ తాజాగా ఒక రిపోర్ట్‌ను విడుదల చేసింది. అందులో వెల్లడైన లెక్కలు తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. 2023 ఏడాదిలో దేశవ్యాప్తంగా రూ. 7,465 కోట్ల సైబర్ మోసాలు జరగ్గా.. అంతకుముందు 2022లో రూ. 2,306 కోట్లను సైబర్ నేరగాళ్లు కొట్టేసినట్లు ఆ రిపోర్ట్ వెలువరించింది. దీన్ని బట్టి చూస్తే.. ప్రతీ సంవత్సరం భారీగా సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయని అర్థం అవుతోంది. అయితే రకరకాల మార్గాల్లో జనాల నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బును దోచుకుంటున్నారు. ఈ సైబర్ నేరాలతో.. డిజిటల్ ఇండియా, డిజిటల్ పేమెంట్స్ అంటేనే జనాలు భయపడే పరిస్థితి నెలకొందంటే.. ఏ స్థాయిలో సైబర్ నేరాలు జరుగుతున్నాయో అర్థం అవుతోంది. 2022, 2023, 2024లో సైబర్ నేరాలు పెరిగిపోవడం.. వాటి వల్ల భారీగా డబ్బు కోల్పోవడానికి ప్రధాన కారణం డిజిటల్ పేమెంట్స్ సంఖ్య పెరగడమేనని సైబర్ నిపుణులు చెబుతున్నారు. మరీముఖ్యంగా యూపీఐ పేమెంట్లు గత కొంతకాలంగా భారీగా పెరిగిపోయాయి. ఒక్క 2025 జూన్ నెలలోనే యూపీఐ ద్వారానే రూ.24.03 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. గత 10 ఏళ్లలో డిజిటల్ చెల్లింపుల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. 2013లో భారతదేశంలో రూ.162 కోట్లుగా ఉన్న డిజిటల్ పేమెంట్ల సంఖ్య.. 2025 జనవరి నాటికి రూ.18,120 కోట్లకు చేరుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే డిజిటల్ పేమెంట్స్‌లో సగం చెల్లింపులు భారత్‌లోనే జరగడం గమనార్హం.

**కొవిడ్ వేళ పూర్తిగా డిజిటల్**

2019 కరోనా మహమ్మారి సమయంలో మన దేశంలో యూపీఐ, డిజిటల్ పేమెంట్ల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. దీనివల్ల మారుమూల గ్రామాలకు కూడా డిజిటల్ పేమెంట్లు చేరేందుకు ఉపయోగపడింది. కరోనా తర్వాత నుంచి.. చిరువ్యాపారుల వద్ద కూడా స్కాన్ చేసి పేమెంట్లు చేసే విధానాలు భారీగా పెరిగిపోయాయి. అదే సమయంలో సైబర్ నేరగాళ్లు కూడా తమ పంజా విసురుతున్నారు. సైబర్ మోసాలు చేయడంలో మరింత నైపుణ్యాన్ని పెంచుకుని.. ఆన్‌లైన్ వేదికగా తమ దోపిడీలను మరింత విస్తరించారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌ఫేక్ వీడియోలను ఉపయోగించి సెలబ్రిటీలు, బిజినెస్‌మెన్ ఫోటోలు, వీడియోలు, ఆడియోలను తయారు చేసి సైబర్ మోసాలకు పాల్పడటం తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి.

**సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయి?**

**బ్యాంక్ సంబంధిత సైబర్ మోసాలు**

ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, డిజిటల్ పేమెంట్లు చేయాలంటే ముందుగా బ్యాంక్ అకౌంట్ ముఖ్యం. అన్ని సైబర్ మోసాలకు బ్యాంక్ అకౌంటే కీలకం. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బ్యాంక్ మోసాలు దాదాపు 8 రెట్లు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ప్రైవేట్ బ్యాంకుల వాటా 60 శాతం ఉన్నట్లు పేర్కొన్నాయి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల కస్టమర్లు భారీగా డబ్బులు నష్టపోయినట్లు వెల్లడించాయి.

**ఇన్సూరెన్స్ మోసాలు**

ప్రస్తుతం డిజిటల్ ఇండియా ప్రచారంలో భాగంగా అన్ని సేవలు అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్ల ద్వారానే జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా ఇన్సూరెన్స్ కంపెనీలు.. యాప్‌ల ద్వారా కస్టమర్లకు సేవలు అందిస్తుండటంతో.. ఇదే సైబర్ నేరగాళ్లకు ఒక అస్త్రంగా మారింది. ఇలా ఫేక్ యాప్‌లను తయారు చేసి.. కస్టమర్ల డబ్బులను దోచేస్తున్నారు.

**పెట్టుబడుల మోసాలు**

రూ.లక్ష పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలోనే వాటిని రూ.10 లక్షలు చేసి చూపిస్తామని.. పెట్టిన పెట్టుబడికి అధిక లాభాలు వచ్చేలా చేస్తామని చెప్పి మోసాసు చేయడం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. ఇలాంటి పెట్టుబడుల మోసాలపై ప్రభుత్వాలు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా చాలా మంది మోసపోతున్నారు. ఇక పెట్టుబడి మోసాలకు చదువుకున్నవారు, ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా బలి కావడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## తమిళ రాష్ట్రంలో.. పెరుగుతున్న పరువు హత్యలు



చెన్నై-నవభూమి: రాష్ట్రంలో పరువు హత్యలు పెరుగుతన్నాయని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. కడలూరులో మృతి చెందిన కళాశాల విద్యార్థి జయసూర్య తండ్రి ఎం.మురుగన్ హైకోర్టు దాఖలు చేసిన పిటిషన్‌లో తన కుమారుడి మృతిపట్ల అనుమానం వ్యక్తం చేశారు. తన కుమారుడు ప్రమాదంలో మరణించినట్లు చిత్రీకరించారని, తాము దీనిని పరువు హత్యగా అనుమానిస్తున్నామని, అందువల్ల ఈ కేసు విచారణ మరో దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. తమ కుమారుడు ఇతర వర్గానికి చెందిన విద్యార్థినిని ప్రేమించినందువల్ల ఆమె బంధువులు తరచూ మమ్మల్ని బెదిరిస్తున్నారని, తమకు పోలీసుల భద్రత కల్పించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం హైకోర్టు ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అప్పుడు రాష్ట్రంలో పరువు హత్యలు పెరుగుతుండడంపై ఆవేదన వ్యక్తంచేసిన హైకోర్టు ధర్మాసనం ఈ పరువు హత్యలకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి రావడం లేదని, న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఆవేదన వ్యక్తంచేశారు. పిటిషనర్ కోరిక మేరకు జయసూర్య మృతి కేసు విచారణను సీబీసీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

భూమి ఒక ప్రజాస్వామ్య దేశంలో అత్యంత విలువైన వనరు. అది భౌగోళిక పరిమితిలో గల సంపత్తి మాత్రమే కాదుబీ అది ప్రజల జీవనాధారం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాది, రైతు జీవితం, భవిష్యత్తు తరాల భద్రతకు మూలం. అయితే, నేటి భారతదేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పభుత్వ భూముల పరిరక్షణ పెద్ద సవాలుగా మారింది. రెవెన్యూ రికార్డుల్లో వందల ఎకరాలుగా నమోదు అయిన భూములు, భౌతికంగా మాత్రం ఆక్రమణకు గురై, అరటిపండు ఎకరం కూడా మిగలని స్థితి ఏర్పడుతోంది. వాస్తవంగా, ప్రభుత్వ భూములు అనేవి ప్రజల సర్వసాధారణ హితార్థంగా ఉద్దేశించబడినవే. గ్రామపంచాయతీ, స్కూల్, ఆసుపత్రి, నీటి చెరువులు, రహదారులు, శ్మశానాలు వంటి వాటికోసం భవిష్యత్తులో అవసరం కోసం భద్రపరచబడినవి. కానీ ఈ భూములపై వేలుపెట్టే హక్కు ఎవరికీ ఉండకూడదు అనే స్పష్టతను నిర్వచించని పాలనా వ్యవస్థ అధికారుల నిర్లక్ష్యంరాజకీయ అరాజకత ఆ భూములు స్థలాలుగా మారి, అప్పటికప్పుడు గేట్లు వేసి, వెంచర్ ప్లాట్లుగా విక్రయించబడుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా, "పారిశ్రామికీకరణ" అనే నినాదం పేరుతో గ్రామాల శూన్యతను సద్వినియోగం చేసుకునే వ్యాపార దురాలోచనలు, ప్రభుత్వ భూములపై కన్నేశాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై తొలుత పంటలు వేసి, తర్వాత షెడ్డులు, తర్వాత మకాన్లు వేసి, చివరకు రెవెన్యూ రికార్డుల సవరణ కోర్టుల ద్వారా పొందే 'కల్యాణపథం' కొందరి చేతిలో ఇప్పటికీ అమలవుతోంది. అక్రమ నిర్మాణాలను తొలగించాలన్న ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా, రాజకీయ ఒత్తిళ్లు వంచన న్యాయపరమైన చిక్కుబంధాలు పాలకులను వెనక్కి లాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని ప్రభుత్వ భూముల రక్షణ అత్యవసరంగా మారింది. సర్వేపై ఆధారపడి గ్రామ స్థాయి భూ సమాచారం నవీకరించాలి. ఈ మేరకు డిజిటల్ రెవెన్యూ మ్యాపింగ్ చేపట్టాలి. ప్రతి ఎకరా భూమికి సంబంధించి ఆధారిత సరిహద్దు గుర్తింపులు అవసరం. అంతేగాక, ఆయా భూముల చుట్టూ ఖచ్చితమైన హద్దులు ఏర్పరచాలి. ప్రభుత్వ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు, నోటీసులు, కోడ్ ఆధారిత సమాచారం వినియోగం చేయడం ద్వారా వాటిపై దురాగతాలు జరగకుండా చేయొచ్చు. ఈ దిశగా ఉపాధిహామీ పథకం వంటి కార్యక్రమాల సహాయంతో ఆయా భూముల చుట్టూ కందకాలు తవ్వించడం, చెరువుల్లో పూడిక తీయించడం వంటి చర్యలతో ప్రభుత్వ భూములను భద్రపరచవచ్చు. తవ్విన మట్టిని రైతులకు ఉచితంగా తరలించేందుకు అవకాశం కల్పిస్తే, వారు కూడా ఆ పనుల్లో భాగస్వామ్యంగా మారుతారు. ఇదే కాకుండా తవ్విన చెరువుల్లో చేపల పెంపకం ద్వారా గ్రామాల్లో సముదాయ ఆదాయం, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఇలా పథకాల అనుసంధానంతో ప్రభుత్వ భూములను భద్రంగా, సమర్థంగా వినియోగించవచ్చు. అయితే, దీని రూట్ సమస్య మాత్రం పాలనా వ్యవస్థ నిష్క్రియతే. రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి పంచాయతీ అధికారులు %-% వీరందరూ సంయుక్తంగా ప్రభుత్వ భూముల జాగ్రత్త కోసం చర్యలు తీసుకోవాలి. ఒక్కో గ్రామంలో గ్రామ ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూముల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలి. ప్రజల్లో భాగస్వామ్యం లేని అభివృద్ధి ఏ రూపంలోనూ దీర్ఘకాలికం కాదు. భూమిపై సామూహిక బాధ్యత బలపడినప్పుడే, ఆక్రమణకు అడ్డుకట్ట పడుతుంది. అత్యంత దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న సమాచారం ఉన్నా, స్థానిక పాలనా వ్యవస్థల్లో దానికి వ్యతిరేకంగా చర్యలు తక్కువగానే ఉంటున్నాయి. ద్వారా సమాచారం పొందగలుగుతున్నా, దాన్ని పట్టించుకునే దృష్టి లేదు. భూముల సమాచారం నిక్షిప్తంగా అందుబాటులో లేకపోవడం, కలెక్టరేట్ నుంచి గ్రామ స్థాయివరకు సమాచారం అసంపూర్ణంగా ఉండటం వంటి సమస్యల వల్ల భూ వివాదాలు ఊబిలో పడుతున్నాయి. ఇంతకీ, ప్రభుత్వ భూములు ఎందుకు పరిరక్షించాలి? ఎందుకంటే ఇది ప్రజల ఆస్తి. ఇది భవిష్యత్తు తరాల వనరు. భవిష్యత్తులో స్కూల్ నిర్మాణానికి స్థలం లేకపోతే, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి స్థలం దొరకకపోతే, నూతన రహదారులు వేసే సమయంలో భూమి స్వాధీనం కాకపోతే, ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం లేకపోతే, దానికి కారణం ఇలాంటి అన్యాక్రాంత భూములే అవుతాయి. గ్రామాభివృద్ధిని అడ్డుకునే ప్రధాన అవరోధం ఇదే. అందుకే ఈ సమస్యపై పాలకులు తీవ్రంగా స్పందించాల్సిన అవసరం ఉంది. ఇక ఒక ముఖ్యమైన అంశం: ప్రభుత్వ భూముల రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా చట్టం అవసరం. అక్రమ ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు విధించగలిగే చట్టపరమైన సాధన లేకపోతే, చర్యలు సాధ్యపడవు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు పారదర్శకంగా పని చేయాలి. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక టాస్క్ ఫోర్సులను ఏర్పాటు చేసి రెగ్యులర్‌గా సర్వేలు జరపాలి. ఇందులో స్థానిక ప్రజలకూ భాగస్వామ్యం కల్పించాలి. గ్రామస్థాయిలో యువతను, శక్తివంతమైన సంఘటిత సంస్థలుగా తీర్చిదిద్దితే, ప్రభుత్వ భూముల విషయంలో అవగాహనతో కూడిన నిఘా వ్యవస్థను నెలకొల్పవచ్చు.


పురాతనకాలం నుంచి 'గోవు-భూమి-గురు' అనే మాటలు పౌరాణికంగా ఉన్నా, నేటి పాలనాధికారుల్లో భూమిపట్ల అట్టి ఆరాధనా భావం కనిపించటం లేదు. "ఓ భూమి ఓ దేవత" అని ఒక వేదమైనా చెబితే, "ఓ భూమి ఓ వెంచర్" అనే దారిలో వ్యవహారాలు సాగుతున్నాయి. ఇది నైతికంగా, న్యాయపరంగా, పరిపాలనా ప్రామాణికంగా పతన దిశలో నడక. దీన్ని తక్షణమే సరిచేయకపోతే, గ్రామ భూములు అధికారికంగా 'లభ్యతలేని' స్థితికి చేరతాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగా ప్రజా పత్రికలు, సామూహిక కమీటీలు, స్థానిక స్వయం సహాయ సంఘాలు ఇవన్నీ కలిసి ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఆందోళనలు, ప్రచారాలు చేయాలి. విద్యార్థులు, గ్రామ యువకులు, మహిళా సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి. ఎందుకంటే భూమి మీద హక్కు ప్రభుత్వానిదే కాదు ప్రభుత్వానికి హక్కు ఉన్నంత మాత్రాన బాధ్యత కూడా ఉంది. ప్రభుత్వ హక్కు అంటే ప్రజల పక్షంలో జరిగే పాలన. ప్రజల పక్షంలో జరిగే పాలన అంటే ప్రజల హక్కులకు చురుకైన రక్షణ కల్పించడం. ఈ వ్యాసాన్ని ముగించేముందు, ఒక విషయాన్ని గట్టిగా పునరుద్ఘాటించాలి. ప్రభుత్వ భూములు పరిరక్షించాలంటే ఇది కేవలం రెవెన్యూ శాఖ బాధ్యత మాత్రమే కాదు. ఇది ఒక గ్రామాన్ని నిర్మించే ప్రయత్నంలో భాగమైన సార్వత్రిక కర్తవ్యం.


# గద్దర్ ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తి.. గుమ్మడి శేషయ్య



మారుపేరుతో ప్రాచుర్యం పొందిన 'గుమ్మడి విఠల్ రావు' అనే ఒక సామాన్యమైన మానవుడు మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలోని అంటరాని దళిత కుటుంబంలో గుమ్మడి లచ్చుమమ్మ, గుమ్మడి శేషయ్య అనే దంపతులకు 1948, జనవరి 31 నాడు జన్మించారు. కుటుంబ సభ్యులలో అందరికన్నా చివరి వారు అయిన విఠల్ ఆరో యేట వచ్చే తల్లి లచ్చుమమ్మతో అమితమైన సాన్నిహిత్యాన్ని కలిగి ఉండేవారు. తల్లి లచ్చుమమ్మ మట్టి వాసనలు గుబాలించే పల్లె పదాలు మరియు జానపద పాటలు చాలా బాగా పాడేవారు. విఠల్ రావు తన తల్లి పాడే జానపద పాటల బాణీలను బాగా అనుకరించారు. తండ్రి గుమ్మడి శేషయ్య తరచుగా విఠల్ రావుకు 'ఆత్మగౌరవంతో జీవించాలి' అని నిర్దేశించేవారు. అంతేకాకుండా ఆయన 'సమతా సమాజాన్ని కాంక్షించి ఆత్మగౌరవ పోరాటాలలో అగ్రగామిగా ఉద్యమించారు'.

గుమ్మడి శేషయ్య కుటుంబానికి జీవనాధారం నిమిత్తం వ్యవసాయ భూమి లేదు. అందువల్ల వ్యవసాయం చేయలేక బతుకు భారమై కష్టాల కడగండ్లలో కొట్టుమిట్టాడారు. ఒక దశలో ఉన్న ఊరిలో ఉండలేని సంక్లిష్ట పరిస్థితులలో శేషయ్య పొట్టకూటి కోసం తన తల్లి (బాలమ్మ) తో పాటు మహారాష్ట్ర ప్రాంతంలోని గోదావరి తీరానికి వెళ్లారు. ఆయన అక్కడ ఉండే కూలీల మాదిరిగా గుడిసె వేసుకొని కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగించారు. అప్పుడు ఆ ప్రాంతంలో బలంగా సామాజిక చైతన్యం పరిఢవిల్లుతున్న తరుణంలో శేషయ్య ఒక పక్క కూలీ పనులకు వెళ్తూనే మరో పక్క క్రమంగా రాయడం, చదవడం నేర్చుకుని అక్షరాస్యులుగా తీర్చిదిద్దబడ్డారు. 'చదువు అనేది ఆయనను





మొట్టమొదటగా సామాజిక విముక్తుడిని గావించింది' అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఆ విధంగా ఆయన నేర్చుకున్న చదువు 'ఆత్మగౌరవ పోరాట జీవితానికి నాంది పలికింది' అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

గుమ్మడి శేషయ్య తాను నేర్చుకున్న చదువు ద్వారా క్రమక్రమంగా అనేక సామజిక సంఘర్షణలు అధిగమించగలిగారు. అదే క్రమంలో ఆయన భవన నిర్మాణ మేస్త్రీగాను పూర్తి పరిణతి చెందారు. ఔరంగబాద్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్థాపించిన మిళింద్ విశ్వవిద్యాలయం భవన నిర్మాణంలో శేషయ్య మెస్త్రీగాను,కాంట్రాక్టర్ గాను పనిచేశారు. ఆ క్రమంలో ఆయన ప్రత్యక్షంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ని చూడడమే కాకుండా ఆయనతో మాట్లాడి ఆయన ఆలోచనా విధానానికి ఎంతగానో ప్రభావితులు అయ్యారు. నిజానికి 'దళిత కులంలో జన్మించిన శేషయ్య సహజంగానే అంబేద్కర్ భావజాలం వైపు ఆకర్షింపబడ్డారు' అని చెప్పవచ్చు.

డాక్టర్ బి .ఆర్. అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలు శేషయ్యని ఎంతగానో ప్రభావితం చేశాయి. అలా ఆయన క్రమంగా అంబేద్కరిస్టుగా మారి ఒకానొక దశలో తాను సంపాదించిన ఆస్తినంతా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించారు. ఆయన అంతిమంగా 'ఆత్మగౌరవం గల వ్యక్తి'గా జీవించారు. ఆ రకంగా శేషయ్య తాను కూడా తన పిల్లలను అంబేద్కర్ లాగా గొప్పగా చదివించి ఉన్నత స్థానాలకు అధిరోహింపజేయాలి అని బలంగా నిర్ణయించుకుని ఆ దిశగా ముందుకు పయనించారు.

ఆరు ఏళ్ళు వచ్చే వరకు తల్లి లోకంగా జీవించిన విఠల్‌రావుని ఆ కాలంలోనే పాఠశాలలో చేర్పించారు. విఠల్ రావు రెండో తరగతికి వచ్చే నాటికి తండ్రి శేషయ్య మహారాష్ట్ర నుండి స్వస్థలమైన తూప్రాన్ గ్రామానికి వచ్చి అక్కడే జీవనాన్ని సాగించారు. ఆ క్రమంలోనే విఠల్ రావు క్రమక్రమం గా తండ్రి శేషయ్య ఆలోచనా విధానాలను అంట పెట్టుకోవడం ప్రారంభించారు. ఆ క్రమం నుండి తండ్రి శేషయ్య పొద్దు గూకాక తన కుమారుడు విఠల్ రావుని ఒళ్ళో కూర్చోబెట్టుకొని సొంత పాటలు కట్టి పాడేవారు. అలాగే అంబేద్కర్ ఉద్యమానికి సంబంధించిన మరాఠీ పాటలు ఇతర పాటలు కూడా పాడి వినిపించేవారు. ఆయన అప్పుడప్పుడు తత్వాలు కూడా వినిపించేవారు. అలాగే ఆయన వేమన శతకం, సుమతి శతకం నృసింహ శతకాలలోని జ్ఞాన బోధనల పద్యాలను విఠల్ రావుకి లయబద్ధంగా చదివి వినిపించేవారు. అదే విధంగా ఆయన ప్రత్యేకంగా కబీర్ గురించి ప్రస్థావించేవారు. ఆ రకంగా శేషయ్య అప్పటినుండి తాను ఎక్కడికి వెళ్లినా కూడా తన కుమారుడు విఠల్ రావుని ప్రత్యేకంగా తన వెంట తప్పకుండా తీసుకొని వెళ్లి అనేక సామాజిక విషయాల పట్ల పరిశీలనాత్మకమైన అవగాహనను కలిగింపజేశారు.

అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక,రాజకీయ పోరాటాలతో తన తండ్రి శేషయ్య తీవ్రంగా ప్రభావితులైన తీరు విఠల్ రావుని ఎంతగానో ఆకర్షింపజేసింది. అంతిమంగా విఠల్ రావు తండ్రి నుండి ఆత్మగౌరవ పోరాట ఆవశ్యకతని గుర్తించి, స్ఫూర్తి పొంది తాను కూడా అణచివేయబడ్డ తన దళిత బహుజన జాతి విముక్తి దిశగా నడుం బిగించారు. ఆయన ముందుగా సమాజ దార్శనికతని అలవరచుకొని తన దళిత బహుజన జాతి బతుకులను సమున్నతంగా తీర్చిదిద్దడానికి అనునిత్యం కృషి చేశారు. ఆ రకంగా విఠల్ రావు జీవితం చిన్ననాటి నుండే అంబేద్కరిజం వెలుగులో 'ఆత్మగౌరవం కోసం బతుకే ఒక పోరాటం'గా ప్రజ్వలించే పోరాట స్ఫూర్తిని రగిలింపజేయడంలో తండ్రి శేషయ్య క్రియాశీల పాత్రని నిర్వహించారు.

**( ఆగస్టు 6 గద్దర్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా )**

- జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్

# పల్లె జానపదాలకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన గద్దర్



అస శ్రీరాములు

భారతదేశ విప్లవ, శ్రామిక, కార్మిక, దళిత ఉద్యమాలు ఒకవైపు గద్దర్ పాటల పోరాట ప్రయాణం మరో వైపు అన్నట్టుగా సాగింది గద్దర్ జీవిత ప్రయాణం . దేశంలో సభలు సమావేశాలు ఏర్పాటు చేయాలంటే సంబంధిత నాయకులు అనేక రకాల అష్ట కష్టాలు పడి సమావేశానికి ప్రజలను తరలిస్తారు . కానీ గద్దర్ ఫలానా సమావేశానికి వస్తున్నాడని తెలిస్తే స్వచ్ఛందంగా వేలు లక్షల సంఖ్యలో ప్రజలు హాజరై సభలను విజయవంతం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. పెత్తందారి , పెట్టుబడిదారుల వ్యవస్థ పై తిరుగుబాటు కోసం సమ సమాజ నిర్మాణం కోసం అనేక రకాల లెఫ్ట్ బావలు కలిగిన నాయకులు ప్రసంగించే ఉపన్యాసాలు వేరు గద్దర్ పాటలు పాడి ప్రజలను చైతన్యం చేసిన తీరు వేరు . గద్దర్ పాడిన పాటలకు ఆకర్షితులై వేలమంది యూనివర్సిటీ విద్యార్థులు, యువతి యువకులు తమ వంతుగా నక్సలైట్ ఉద్యమాలో 1970 - 80 దశకంలో చేసిన సంఘటనలు ఎన్నో చూసా ము. బుల్లెట్ కన్నా తన పాటనే శక్తివంతమైన దని నిరూపించిన ఘనత గద్దర్ కు దక్కుతుంది. తనను హత్య చేయడానికి తనపై కాల్పులు జరిపితే జంక లేదు అయన వెన్నుపూసలు దిగిన బుల్లెట్ తో 26 సంవత్సరాల పాటు సహ జీవనం చేసిన ఘనుడు ఆదరని బెదరని వాడు గద్దర్. భారతదేశ విప్లవ ఉద్యమాల చరిత్రలో ఐదు దశాబ్దాల పాటు శ్రామిక వర్గం దోపిడి నుండి పేద ప్రజల విముక్తి చేయడం కోసం ఆయన అనుక్షణం సహవాసం చేస్తూనే వచ్చారు. గద్దర్ గురించి ఎంత చెప్పినా తక్కువే ఆయన ఒక తరగని గణి. విశ్వ రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన రచనలు ప్రసంగాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తే గద్దర్ తన అట,పాటల ద్వారా ప్రతి ఒక్కరిని కదిలించి ప్రపంచ ఖ్యాతి గరించారు .

జానపదాలకు కొత్త కొత్త బాణీలను అర్థాలు చెప్పిన గొప్ప సాంస్కృతిక శిఖరం అయన గద్దర్ అంటే ప్రజల గుండెచప్పుడు . విప్లవాలకు సంబంధంలేని సాధారణ ప్రజలు అయన కు కోట్ల మందిలో అభిమానులుగా ఉన్నారు.

కమ్యూనిస్టు పార్టీలో వర్గ విభేదాలున్న అందర్నీ కలుపుకొని పోయిన గొప్ప మనసున్న వ్యక్తి గద్దర్. 1970 దశకంలో ఓట్లను బహిష్కరించాలని పిలుపునిచ్చిన పార్టీలో ఉండి 2020 వరకు వచ్చేటప్పటికి భారత రాజ్యాంగాన్ని చేత పట్టుకొని రాజ్యాంగాన్ని రక్షించాలని ఓట్ల విప్లవం రావాలని ఒకే మనిషికి ఒక ఓటు విలువను తెలియజేపే విధంగా ప్రచారం చేశారు. భారతదేశ ఉద్యమాల చరిత్ర గద్దర్ పాత్ర లేకుండా ఊహించలేం.

ఒక వైపు విప్లవ భావాలు ద్వారా బూర్జువ రాజకీయ పార్టీల ఆలోచనలను ఎండగడుతూనే మరోవైపు దళితులు గిరిజనులు ఆదివాసీలు స్త్రీల హక్కులకై పోరాటం చేసిన నాయకుడు గద్దర్ అందులో ప్రధానంగా ప్రకాశం జిల్లా చుండూరులో జరిగిన నరమేధానికి చలించిపోయిన ఆయన " దళిత పులులమ్మ కారంచేడులో కలబడి నిలబడి పోరాడిన యోధులన్నా " అంటూ పాటలు రాసి బాధితులకు అండగా నిలిచి నేనున్నానంటూ నిలబడిన నాయకుడు గద్దర్ .



పూర్వపు మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలో గుమ్మడి శేషయ్య, లక్ష్మమ్మ దంపతులకు 31 జనవరి 1949 న జన్మించిన గుమ్మడి విఠల్ రావు తూప్రాన్ లోనే హై స్కూల్ వరకు విద్యాభ్యాసం చేశారు . పాఠశాల స్థాయి నుండి మిత్రులతో కలిసి నాటకాలు బుర్రకథలు చెప్పడం ప్రారంభించి అదే జీవితంలో ఎంచుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌లో చేరిన ఆయన 1969 ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విద్యకు స్వస్తి పలికారు . ఎంప్లాయ్మెంట్ ద్వారా సిండికేట్ బ్యాంకులో క్లారికల్ ఉద్యోగం కూడా వచ్చింది . కొన్నాళ్లపాటు కంటోన్మెంట్ లోని పికెట్‌లోని సిండికేట్ బ్యాంకు బ్రాంచ్‌లో క్లారికల్ ఉద్యోగంలో చేరారు . అక్కడ కూడా సాంస్కృతిక కళా ప్రదర్శనలు కోసం ప్రతిసారి డుమ్మాలు కొట్టడంతో ఆయనను పూర్వపు నల్లగొండ జిల్లా భువనగిరికి బదిలీ చేశారు . కొన్నాళ్లు ఉద్యోగం చేసిన అప్పటికే జననాట్య మండలి ఏర్పాటు కావడంతో అందులో సాంస్కృత విభాగంలో నాటి రోజుల్లో చెరబండ రాజుతో పరిచయాలు ఏర్పడి కళా ప్రదర్శనలను నిర్వహించారు. సిండికేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నప్పుడే హైదరాబాదులోని కోఠి ప్రాంతంలోని చప్పల్ బజార్ నివాసి విమలమ్మతో ఆదర్శ వివాహం చేస్తున్నారు . గద్దర్ జీవిత ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు మలుపులు కష్టాలు కన్నీళ్లను చవిచూశారు గద్దర్ అంటే చైతన్య గీతం గద్దర్ అంటే ఒక ఉద్వేగం ఆయన పాటల్లో కనిపిస్తుంది . దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పని తీరు పట్ల ఎన్నో విమర్శనాత్మక పాటలు పాడారు. ప్రధానంగా చెప్పుకోవాల్సిన అంశం గుమ్మడి విఠల్ రావు గా ఉన్న సమయంలో ప్రముఖ సినీ దర్శకుడు బి నరసింగరావు హైదరాబాదులో నిర్వహిస్తున్న ఆర్ట్ లవర్స్ , కళ ప్రేమికులను సంస్థ ద్వారా అనేక కళ ప్రదర్శన నిర్వహించారు. అదే సమయంలో జననాట్యమండలి ఏర్పాటు చేశారు. మొదటిగా రాసిన పాట ఆపురా రిక్షావోడా నేను వస్తా నీ వెంట అంటూ రాసిన పాటను ముదిరించాలంటే ఏ పేరు పెట్టాలి సొంత పేరు పెడితే పోలీసు నిర్బంధం ఎదుర్కోవాల్సి వస్తుందని పంజాబ్‌లో స్వతంత్ర పోరాటం కోసం పోరాడిన గదర్ పార్టీ పేరు మీద పాటను ప్రచురించామని ప్రింటింగ్ సమయంలో గదర్ పేరు కాస్త గద్దర్‌గా ప్రింట్ అయిందని నాటినుండి గుమ్మడి విఠల్ రావు అలియాస్ గద్దర్‌గా మారిపోయానని ఆయన స్వయంగా ఎన్నోసార్లు ప్రకటించారు .

**ప్రతి పాటకు కథ ఉంది**

ప్రతి పాటకు ఒక కథ ఉందని ఎన్నోసార్లు చెప్పినా ఆయన ఎన్నో పాటలకు ప్రాణం పోసారు ఆయన 1970 దశకంలో " ఇయాల రేపు అంట లస్కర్ బోనాలు అంట మన బోనాలు ఎప్పుడు పిల్లా ఓ బాలమణి అంటూ లస్కర్ బోనాల " పై పాడిన పాట ప్రాచుర్యం పొందింది . అదే క్రమంలో మాభూమి సినిమాలోని బండి యాదగిరి రాసిన పాట ' బండెనుక బండి కట్టి 16 బండ్లు కట్టి ఏ బండ్లో వస్తావు కొడుకో నైజాము సర్కరోడా ! అనే పాట గద్దర్‌కు గుర్తింపు తేవడంతో పాటు ఒక సంచలనం రేపింది. అక్కడినుండి ఆయన జానపద బాణీల పాటలతో సాంస్కృతిక శిఖరంగా ఎదిగారు .

ప్రతి సంఘటనకు స్పందించిన ఆయన పాటలు రూపంలో ప్రజల ముందు ఉంచారు రైల్వే కార్మికులు రైలు పట్టాలతో పనిచేసే శ్రమజీవులను గుర్తించి " గ్యాంగోళ్ల మండి బాబు మేము గ్యాంగ్ వాళ్ళము " 1990 ప్రాంతంలో కలర్ టీవీలు వచ్చినప్పుడు " కలర్ టీవీ వచ్చింది ఇంట్లో కయ్యం పెట్టింది వంటలు ఎట్లా చేసుకోవాలి నేర్పిస్తుంది ఇంట్లో మా పిల్లలకు క్రికెట్ ఎట్లా ఆడాలో క్యాచ్ క్యాచ్ అంటూ పాడారు " ఇంట్లో శుభ్రం చేసే చీపురు కట్టపైన అందమైన పాట పాడారు . చెత్త కుప్పం మీద , మరుగుదొడ్డి మీద, దండాలు దండా లో అన్న

కంపెనీ కూలోడా , పొట్టకూటి కోసం కొడుకు పోలీసులు చేరినాడు ఎప్పుడు వస్తాడో కొడుకు ఎట్లున్నాడు , అంటూ ఒక తల్లి ఆవేదన , అసెంబ్లీ తీరును గమనించినాయన భలే గుందిరో మన అసెంబ్లీ అంటూ విమర్శనాత్మకంగా చర్చించారు, ఆయన పాడిన పాటలు లాల్ సలాం లాల్ సలాం లాల్ సలాం , అదిగదిగో చూడు అమెరికా వోడు వస్తుండు అంటూ ప్రైవేటీకరణను వ్యతిరేకించు పాడారు, కల్లు ముతోయమ్మ మాయమ్మ అంటూ వేల పాటలు రాసి పాడారు . ప్రతి పాటకు కథ ఉందని కథలోని కష్టాలని పాటల రూపంలో వ్యక్తం చేశారు. **(మిగతా రేపు)**

## తల్లి ఎదురుచూపు

రాతిరి వాకిట్లో కూర్చొని చంద్రుడ్ని
చూస్తోంది
పిల్లాడి మాటల్లా - వెలుగు జిమ్ముతోంది
వాణ్ణి చూడాలని - తల్లి కళ్లలో ఆశ
అమెరికాలో వున్న బిడ్డ కోసం - ప్రతి
రోజు ఎదురు చూపు

పక్కింటి పిల్లాడు వస్తే -నా బిడ్డ గుర్తుకు
వస్తాడు
అతను మాట్లాడుతూ వుంటే నా బిడ్డ
మాట్లాడినట్లు అనిపిస్తుది
తన బిడ్డ రూపమే దాచిన మాతృ
మనసులో మౌనాలే పలుకుతాయి

విడియో కాల్ చేస్తా అన్నాడు-
అన్న మాటకు నమ్మకం పెడుతూ,
ఎప్పటికో అప్పటికీ ఎదురుచూస్తూ
ప్రతి రోజు అదే నిద్ర లేని రాత్రి
బిడ్డ తలపులతో - గుండె లోతుల్లో
శబ్దించే ఊహా-

అక్కడ చలిలో ఉంటాడని - ఇక్కడ
చలిమంట వేసింది
అక్కడ వేడి ఎక్కువ అంటావు కదా -
ఇక్కడ శీతల పానీయం ఉంచింది
బిడ్డకు అవసరం లేదు ఎక్కడున్నా
అన్న ప్రేమ
కానీ తల్లి ప్రేమకి మాత్రం -వాడిని
చూడాలి అనే వేదనే నిత్యం!


ఇంట్లో అన్నీ ఉన్నాయ్ -కాని నవ్వు లేదు
బిడ్డ అరుపులే ఓ శ్రావ్యమైన సంగీతం
లాంటివి
తల్లి గుండె సన్నవి - జ్ఞాపకాలతో
నిండినవి
ఎంత టెక్నాలజీ వచ్చినా -అమ్మను
మరవకు

ఫోన్‌లో ఏదో మాటే - కానీ కన్నీటి వెనక
ఉన్న ప్రాణమే వేరు బాబు!
ఎంతో మాట్లాడాలని వున్నా కన్నీరు
గొత్తును ఆపుతుంది
పోనీ బాబూ - ఒక్కసారి రా సెలవుల్లో..

- షహనాజ్


భక్తి

## జీవితం సఫలం కావాలంటే



ప్రస్తుత కాలంలో మనిషి తనను తాను ఒక భిన్నమైన, ప్రత్యేకమైన ప్రాణిలా భావించుకుంటున్నాడు. తన దగ్గర ఎంతో సాంకేతికత ఉన్నదనీ, ఒకప్పుడు లేని ఎన్నో ఉపకరణాలు ఉన్నాయనీ గర్వపడుతున్నాడు. ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్‌తోనే గడుపుతున్నాడు. అదో అద్భుతమైన సాంకేతికత అని అనుకుంటున్నాడు. కానీ ఆ సాంకేతికతను ఎందుకు తయారు చేశారో ఎప్పుడైనా ఆలోచించారా? వాటిని కంపెనీలు తయారు చేస్తున్నది మానవ శ్రేయస్సు కోసం కాదు, స్వలాభం కోసం. మనకు సదుపాయాలు కల్పిస్తున్నందుకు డబ్బు తీసుకుంటున్నారు. సిమ్ కార్డు లేనిదే ఫోన్ పని చెయ్యదు. పైగా రీఛార్జి చేసుకుంటూ ఉండాలి. అలాగే ఫోన్ ఛార్జింగ్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. ఎవరైతే ఎక్కువగా ఫోన్ వాడుతూ ఉంటారో వాళ్ళు తమతో పవర్ బ్యాంక్ మోస్తూ ఉంటారు. ఫోన్‌లో ఛార్జింగ్ తక్కువగా ఉందని తెలిసిన వెంటనే ఛార్జింగ్ పెడతారు. కొత్త ఫోన్ కొనడానికి వెళుతున్నప్పుడు అది మనకు ఎంతో మేలు చేస్తుందనే ఆశతో ఉంటాం. కానీ కొన్న తరువాత ఎప్పుడూ దాని గురించే ఆలోచించే పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడికైనా వెళ్ళేముందు... అక్కడ ఛార్జింగ్ చేసుకొనే అవకాశం ఉందో లేదో ఆలోచిస్తారు. ఈ విధంగా పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ ఫోన్ గురించే ఆందోళన చెందేవారు చాలామంది ఉన్నారు. తనను సతమతం చేసే ఆలోచనల నుంచి కాపాడుకోవడానికి ఏ సాంకేతికతను వ్యక్తులు ఉపయోగించాలనుకుంటారో... ఆ సాంకేతికతే వారికి మరిన్ని ఆలోచనలు కలిగిస్తూ ఉంటుంది. మరి ఎప్పుడూ ఆలోచనలోనే మునిగి ఉండే మనిషికి అసలైన ఆనందానుభూతి ఎలా లభిస్తుంది? మనమందరం మన జీవితాల్లో ఆనందాన్వేషణలో ఉన్నాం. కానీ చింతలు, చికాకులతో సతమతం అవుతున్నంతకాలం ఆనందానుభూతి పొందలేమనేది గ్రహించాలి. ఈ ప్రపంచంలో ఎన్నో విషయాల మీద వితండవాదాలు జరుగుతూ ఉంటాయి. కానీ సాధువులు, మహాత్ములు అన్ని విషయాలనూ ఎప్పుడో చెప్పేశారు. రాయాల్సినవన్నీ ఇంతకుముందే రాశారు. 'ఆత్మానందం లేక మానవుడు, కాశీ మధురలు తిరిగేను - కస్తూరి మృగం తన నాభిలోనే ఉన్న కస్తూరికోసం వనమెల్లా తిరిగినట్టు...' ఇది విన్న ప్రతిసారీ నవ్వొస్తూ ఉంటుంది. ఇలాంటి మంచి విషయాలు మనిషి బుర్రకు ఎందుకు ఎక్కవు? వాటిని అమలు చేయడానికి మనిషి ఎందుకు ప్రయత్నించడం లేదు? వేద వ్యాసుడి లాంటి మహా ఋషులు రచనలు చేయడానికి కారణం ఏమిటి? వాటిని చదవడానికో, గుర్తు పెచ్చుకోవడానికో కాదు... పుస్తకాల్లో ఉన్న విషయాలను గుర్తు పెట్టుకున్నంత మాత్రాన జీవితం సఫలం కాదు. వాటిని ఆచరించాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ | బుధవారం | 06 । ఆగస్టు । 2025



## బిల్లు ఎగ్గొట్టేందుకు మాస్టర్ ప్లాన్.. కానీ అడ్డంగా దొరికిపోయారు..

**లక్నో-నవభూమి:** రెస్టారెంట్‌లో భోజనం చేసిన తర్వాత బిల్లు చెల్లించకుండా తప్పించుకోవాలని కొంతమంది యువకులు చేసిన ప్లాన్ అట్టర్ ఫ్లాప్ అయింది. చివరికి సీసీటీవీ ఫుటేజ్ వల్ల అడ్డంగా దొరికిపోయారు. ఈ సంఘటన లక్నోలోని కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న శాస్త్రి చౌక్‌లోని బిర్యానీ బే రెస్టారెంట్‌లో చోటుచేసుకుంది. అసలేం జరిగిందంటే..జూలై 31 రాత్రి, 8 నుండి 10 మంది యువకులు ఒక బ్యాచ్‌గా ఆ రెస్టారెంట్‌కి వెళ్లారు. వెజ్, నాన్ వెజ్



బిర్యానీలు ఆర్డర్ చేశారు. ఆహారం వడ్డించిన కొద్ది సేపటికే, వారిలో ఒకరు తన వెజ్ బిర్యానీలో ఎముక వచ్చిందంటూ గోల చేయడం ప్రారంభించాడు. దీంతో ఈ ఘటనపై రెస్టారెంట్ మేనేజర్ పోలీసులకు ఫోన్ చేయగా, వారు అక్కడికి వచ్చి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఆ ఫుటేజ్‌లో ఒక యువకుడు, తన నాన్ వెజ్ బిర్యానీ లోని ఎముకను మరొకరికి అందించగా, ఆ యువకుడు తెలివిగా ఆ ఎముకను వెజ్ బిర్యానీ ప్లేట్‌లో ఉంచినట్లు స్పష్టంగా కనిపించింది.వెంటనే బిల్లు ఎగ్గొట్టడానికి మాస్టర్ ప్లాన్ వేశారని పోలీసులకు అర్థమైంది. రెస్టారెంట్ యజమాని రవికర్ సింగ్ మాట్లాడుతూ, యువకులు ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారన్నారు.

## జయబచ్చన్ .. రేఖా గుప్తా : దేశభక్తి ఫైట్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత సైన్యం పాకిస్థాన్‌పై నిర్వహించిన తాజా సర్జికల్ స్ట్రైక్‌కు 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టడంపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై బాలీవుడ్ నటి, రాజ్యసభ సభ్యురాలు జయా బచ్చన్ చేసిన వ్యాఖ్యలు, ఆపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఇచ్చిన కౌంటర్ ఈ చర్చను మరింత తీవ్రతరం చేశాయి. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ సింధూర్' అనే పేరు చుట్టూ జరుగుతున్న రాజకీయ, సామాజిక చర్చ వివాదాస్పదమవుతోంద.. సిందూర్: సంస్కృతి, భావోద్వేగాల ప్రతీక బొత్స, ధర్మాన మౌనమెందుకు? భారతీయ సంస్కృతిలో సింధూరం అనేది కేవలం ఒక సౌందర్య సాధనం కాదు. ఇది సౌభాగ్యానికి, వివాహ బంధానికి, మహిళల గౌరవానికి ప్రతీక. వివాహిత మహిళలకు ఇది ప్రత్యేక గుర్తింపునిస్తుంది. ఈ నేపథ్యంలో సైనిక చర్యకు ఈ పేరు పెట్టడంపై జయా బచ్చన్ అభ్యంతరం వ్యక్తంచేయడం వెనుక భావోద్వేగ కోణం ఉంది. యుద్ధంలో వీరులైన సైనికులు ప్రాణాలు కోల్పోతే, వారి భార్యలు కోల్పోయే సింధూరం ఆమెకు గుర్తుకు వచ్చి ఉండవచ్చు. ఈ అభిప్రాయం ఒక వ్యక్తిగత, భావోద్వేగ ప్రతిస్పందనగా చూడాలి. -దేశభక్తి, రాజకీయ కోణం జయా బచ్చన్ వ్యాఖ్యలను ఢిల్లీ సీఎం రేఖా గుప్తా గట్టిగా ఖండించారు. దేశభక్తిని ప్రశ్నించే విధంగా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని, ఇది కేవలం సినిమా డైలాగుల స్థాయిలో ఉందని రేఖా గుప్తా విమర్శించారు. దేశం మీద ప్రేమ ఉండాలని, దేశ శత్రువుల పట్ల సానుభూతి ఉండకూడదని ఆమె పరోక్షంగా చెప్పకనే చెప్పారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ స్పందనలో దేశభక్తి అంశం ప్రధానంగా కనిపిస్తుంది, కానీ ఇది వ్యక్తిగత దూషణలకు దారితీయడం వల్ల చర్చలో సమతుల్యత దెబ్బతింది. ఆపరేషన్లకు పేరు పెట్టడంలో కొత్త ధోరణి ఇటీవలి కాలంలో భారత రక్షణ వ్యవస్థ తన ఆపరేషన్లకు శక్తివంతమైన, భావప్రధానమైన పేర్లను ఇస్తోంది. గతంలో జరిగిన ఆపరేషన్ సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ బాలాకోట్, ఆపరేషన్ మహాదేవ్ వంటివి ఈ కోవకు చెందినవే. 'ఆపరేషన్ సింధూర్' కూడా అదే కోణంలో చూడవచ్చు. ఇది శత్రువులకు గట్టిగా బుద్ధిచెప్పాం అనే సంకేతం ఇస్తుంది. ఈ పేరు వెనుక ఉన్న ఉద్దేశం దేశభక్తిని ప్రేరేపించడమే తప్ప, మహిళల గౌరవాన్ని తగ్గించడం లేదా వారి బాధలను చిన్నబుచ్చడం కాదనే వాదన ఉంది. ఒకరిపై ఒకరు బురద -సాంస్కృతిక, రాజకీయ వైరుధ్యం కాదు ఈ మొత్తం చర్చలో ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, సంస్కృతి, భావోద్వేగాలు, దేశభక్తి పరస్పరం విరుద్ధం కావు. అవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. జయా బచ్చన్ వ్యాఖ్యలు సిందూరం యొక్క సాంస్కృతిక, భావోద్వేగ కోణాన్ని హైలైట్ చేస్తే, రేఖా గుప్తా వ్యాఖ్యలు దేశభక్తి, జాతీయ భద్రత కోణాన్ని తెలియజేస్తున్నాయి. ఇద్దరూ తమ తమ దృక్పథం నుంచి మాట్లాడారు. అయితే, ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం, వ్యక్తిగత దూషణలకు దిగడం వల్ల అసలు సమస్య నుండి ప్రజల దృష్టి మళ్ళుతోంది. ఈ చర్చను మరింత నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్ళడం అవసరం.

## 17 వేల కోట్ల రుణ మోసం.. ఈడీ ముందు విచారణకు హాజరైన అనిల్ అంబానీ



**ముంబై- నవభూమి:** ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీఈడీ విచారణకు హాజరయ్యారు. రూ.17 వేల కోట్ల విలువైన రుణ మోసానికి సంబంధించిన కేసులో 5న విచారణకు రావాలంటూ ఈ నెల 1న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చోటా అంబానీకి సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం న్యూఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో ఈడీ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేయనుంది.

గత వారం రిలయన్స్ గ్రూప్‌తో సంబంధం ఉన్న 50 కంపెనీలు, 25 మంది వ్యక్తులకు చెందిన ముంబైలోని దాదాపు 35 చోట్ల ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దాఖలు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఈ చర్యలు చేపట్టింది.కాగా, బ్యాంకులకు రుణాల ఎగవేత కేసుల్లో అనిల్ అంబానీకి ఈడీ ఉచ్చు బిగుస్తోంది. రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసులో లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసింది. తాజాగా అనిల్ అంబానీ కంపెనీలకు రుణాలు ఇచ్చిన బ్యాంకులకు ఈడీ లేఖ రాసింది. రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్‌కు రుణాలు ఇచ్చిన 12-13 ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు ఈడీ తాజాగా లేఖలు రాసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూకో, పంజాబ్, సింద్ బ్యాంక్‌ల నుంచి రుణాల ఎగవేతకు సంబంధించిన వివరాలను తమకు ఇవ్వాలని కోరినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఈ రుణాలకు సంబంధించి కొంత మంది బ్యాంకు అధికారులను కూడా ఈడీ పశ్నించే అవకాశం ఉందని తెలిసింది.కాగా, 2017 నుంచి 2019 వరకు ఎస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాలను అక్రమంగా దారి మళ్లించారనే ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. గ్రూపు కంపెనీలకు రుణాలు ఇవ్వడానికి ముందు బ్యాంక్ ప్రమోటర్లతో సంబంధం ఉన్న సంస్థలకు నిధులు బదిలీ అయ్యాయని ఈడీ అధికారులు గుర్తించారు. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు సంబంధించిన విషయాలను ఈడీతో అధికారులు పంచుకున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.3,742.60 కోట్లుగా ఉన్న కార్పొరేట్ రుణ వితరణ ఆ మరుసటి ఏడాదికిగాను రూ.8,670 కోట్లకు పెరిగింది.

## సనాతన ధర్మం సంకెళ్లను తెంచుకోవడానికి ఉన్న ఏకైక ఆయుధం విద్య : కమల్ హాసన్

**ముంబై-నవభూమి:** సనాతన ధర్మంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్. సనాతన ధర్మం సంకెళ్లను తెంచుకోవడానికి ఉన్న ఏకైక ఆయుధం చదువు మాత్రమేనని తెలిపాడు. నటుడు సూర్య స్థాపించిన అగరం ఫౌండేషన్ ఇటీవలే 15 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ ఫౌండేషన్ వలన ఇప్పటివరకు 5000 మందికి పైగా విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసుకోగా.. 2000 మందికి పైగా విద్యార్థులు ప్రస్తుతం చదువుకుంటున్నారు. అయితే ఈ సంస్థ 15వ వార్షికోత్సవాన్ని చెన్నైలో జరుపగా.. ఈ వేడుకకి ముఖ్య అతిథిగా కమల్ హాసన్ వచ్చి మాట్లాడాడు.

## జైపూర్‌లో ల్యాండ్ అయిన జెలెన్‌స్కీ భార్య.. ఇంత ఆకస్మికంగా ఎందుకొచ్చారంటే?



**జైపూర్-నవభూమి:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ సతీమణి.. ఆ దేశ ప్రథమ మహిళ ఓలేనా వోలోడిమిర్ ఒలేనా జెలెన్స్కా ఆకస్మికంగా జైపూర్ విమానాశ్రయాన్ని సందర్శించారు. వాణిజ్య ఒప్పందాల కోసం జపాన్‌కు వెళ్తున్న ఉక్రెయిన్ ప్రతినిధి బృందంలో ఆమె కూడా ఉండగా.. ఈ బృందం ప్రయాణిస్తున్న విమానం ఇంధనం నింపుకోవడానికి జైపూర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగింది. ఈ అనూహ్యమైన విమాన ఆపరేషన్ దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.ఉక్రెయిన్ ప్రతినిధి బృందం ప్రయాణిస్తున్న విమానం ఈ ఉదయం 6.30 గంటలకు జైపూర్ విమానాశ్రయానికి చేరుకుంది. ఈ విమానంలో ప్రథమ మహిళ ఒలేనా జెలెన్స్కాతో పాటు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబియా మరియు 23 మంది సభ్యులు ఉన్నారు. సుమారు రెండు గంటల పాటు విమానాశ్రయంలోనే ఉన్న వీరు.. ఉదయం 8.15 గంటలకు జపాన్‌కు తిరిగి బయలుదేరారు. ఈ సమయంలో ప్రథమ మహిళ ఒలేనా జెలెన్స్కా, ప్రతినిధి బృందం విమానాశ్రయం యొక్క వీఐపీ లాంజ్‌లో ఉన్నారు. వారిని కలవడానికి ఢిల్లీలోని ఉక్రెయిన్ దౌత్య కార్యాలయం నుంచి ప్రత్యేక సిబ్బంది వచ్చారు.ఏపీలో విద్యార్థులకు శుభవార్త.. వారందరికి ఉచితంగా 'నీట్, ఐఐటీ' శిక్షణ.. వివరాలివేభారత విదేశాంగ మంత్రిత్వ శాఖ విమానం రీఫ్యూలింగ్ కోసం చేసిన అభ్యర్థనను ఆమోదించింది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ కూడా తగిన ప్రొటోకాల్‌ను పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఒక దేశం ప్రథమ మహిళ భారత్‌కు రావడం, రీఫ్యూలింగ్ కోసం ఆగడం వంటివి అంతర్జాతీయంగా కీలక పరిణామాలుగా పరిగణించవచ్చు. విమానం ఇంధనం నింపుకునే సమయంలో ప్రతినిధి బృందానికి వీఐపీ లాంజ్‌లో అల్పాహారాన్ని అందించారు. ఆ బృందంలోని ఎవరికీ ఇమ్మిగ్రేషన్ లేదా ఫ్రిస్కింగ్ వంటి తనిఖీలను నిర్వహించలేదు. ఇది అంతర్జాతీయ దౌత్య మర్యాదల్లో ఒక భాగంగా జరిగింది.

గత మూడేళ్లుగా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం సాగిస్తూ వస్తోంది. దీంతో మాస్కోను నిలువరించేందుకు జెలెన్స్కీ సర్కారు అంతర్జాతీయ సమాజం నుంచి సాయం కోరుతోంది. ఈక్రమంలోనే అధ్యక్షుడి సతీమణి జపాన్ పర్యటన చేపట్టారు. రష్యాపై ఆంక్షలు విధించడంతో పాటు ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి సాయం చేయాలని ఆమె టోక్యోను కోరారు.

## రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్.. వందే భారత్ స్లీపర్ రైలు వచ్చేస్తోంది.. ఎప్పుడంటే?



**భావ్‌నగర్-నవభూమి:** భారతీయ రైల్వే చరిత్రలో ఒక కొత్త శకం ప్రారంభం కాబోతోంది. దేశంలోనే మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు సెప్టెంబర్ నెలలో ప్రారంభం కానుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ రైలు ప్రయాణికులకు ఒక విలాసవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది. ఈ కొత్త రైలు రాక భారతీయ రైల్వేలలో ఒక విప్లవాత్మక మార్పుగా ఆయన అభివర్ణించారు.మంత్రి అశ్విని వైష్ణవ్ భావ్‌నగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో డిజిటల్ పద్ధతిలో మూడు కొత్త రైళ్లను ప్రారంభించారు. వీటిలో అయోధ్య ఎక్స్‌ప్రెస్, రేవా-పుణె ఎక్స్‌ప్రెస్, జబల్‌పూర్-రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ఈ సందర్భంగానే ఆయన వందే భారత్ స్లీపర్ రైలు ప్రయోగం గురించి కీలక ప్రకటన చేశారు. ఈ రైలు రాకతో సుదూర ప్రయాణాలు మరింత సులువుగా, వేగంగా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎనిమిది కొత్త అమృత్ భారత్ రైళ్లను కూడా ప్రవేశ పెట్టినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కొత్త రైళ్ల ద్వారా దేశవ్యాప్తంగా రైలు కనెక్టివిటీ, సేవలు మరింత మెరుగుపడతాయని ఆయన నొక్కి చెప్పారు.వందే భారత్ స్లీపర్ రైలు ఒక సాధారణ స్లీపర్ కోచ్ రైలు కాదని.. ఇది ఆధునిక సాంకేతికత, అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించబడిందని వివరించారు. వేగం, భద్రత, సౌకర్యం దీని ప్రత్యేకతలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న వందే భారత్ రైళ్లు చైర్ కార్ మోడల్‌లో పగటిపూట ప్రయాణానికి అనువుగా ఉన్నాయి. అయితే ఈ స్లీపర్ రైలు రాత్రి ప్రయాణాలకు ప్రత్యేకంగా రూపొందించబడింది. సుదీర్ఘ ప్రయాణాలలో ప్రయాణికులు సుఖంగా నిద్రపోవడానికి, విలాసవంతమైన సేవలు పొందడానికి ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఈ రైలులో మెరుగైన బెడ్డింగ్, పడకలను అనుసంధానించిన ప్రత్యేక లైటింగ్, విశాలమైన బాత్రూమ్‌లు, సెన్సార్ ఆధారిత తలుపులు, మరియు మెరుగైన ఎయిర్ కండిషనింగ్ వంటి అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

ఇప్పటి వరకు దేశంలో మొత్తంగా 50 కంటే ఎక్కువ వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. కానీ అవి చైర్ కార్ సౌకర్యంతో శతాబ్ది రూట్‌లలో నడుస్తున్నాయి. ఈ వందే భారత్ స్లీపర్ రైళ్లను మాత్రం రాజధాని రూట్లలో నడిచేలా రూపొందించారు. ఈ రైళ్లు గంటకు 180 కిలో మీటర్ల వేగంతో పరుగులు పెడుతాయి. ఏపీ ఫస్ట్ క్లార్, ఏసీ 2 టయర్, ఏసీ 3 టయర్ సహా 16 కోచ్‌లతో.. 1128 మంది ప్రయాణికుల సామర్థ్యాన్ని ఈ రైళ్లు కల్గి ఉంటాయి. ఇవి న్యూఢిల్లీ-హౌరా, న్యూఢిల్లీ-ముంబయి, న్యూఢిల్లీ-పుణే, న్యూఢిల్లీ-సికింద్రాబాద్ మధ్య నడిచే అవకాశం ఉంది. అయితే ఈ విషయంలో రైల్వే బోర్డుదే తుది నిర్ణయం.

## ఆది పెరుక్కు ఉత్సవం..: అమ్మవారి మొక్కు తీర్చుకోవాలంటే తలపై కొబ్బరి కాయ కొట్టించుకోవాల్సిందే..!





**కరూర్-నవభూమి:** మన దేశంలో భక్తి, విశ్వాసం, సంప్రదాయాలు అనేవి అందరి జీవితాల్లో అంతర్భాగం అయ్యాయి. అయితే ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. దాదాపుగా అందరూ దేవుళ్లను కొలుస్తూనే ఉంటారు. తమదైన శైలిలో మొక్కులు చెల్లించుకుంటూ కోరికలు కోరుకుంటారు. అలాగే ఆయా గుడులకు వెళ్తూ దర్శనలు చేసుకుంటారు. అయితే చాలా చోట్ల సాధారణంగానే దర్శన భాగ్యం ఉండగా.. తమిళనాడులోని ఓ ఆలయంలోకి వెళ్లాలంటే మాత్రం చాలా సాహసమే చేయాలి. సాహసమా ఏంటి అనుకుంటున్నారా.. ఏమీ లేదండి ఓ కొబ్బరి కాయను నెత్తిమీద కొట్టించుకోవాలి. మాడు పగిలితేనే మాత దర్శనం దొరుకుతుంది. మరి ఆ ఆలయం ఏంటి, దాని ప్రత్యేకత ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి. తమిళనాడులోని కరూర్ జిల్లాలో ఉన్న మెట్టుమహాదానపురం గ్రామంలో శ్రీ మహాలక్ష్మి అమ్మన్ దేవాలయం ఉంటుంది. అక్కడే ప్రస్తుతం పెరుక్కు ఉత్సవాలు జరుగుతున్నా యి. అయితే ఈ సమయంలో అక్కడికెళ్లే భక్తులు తమ తలలపై కొబ్బరి కాయలు కొట్టించుకుని మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు. వినేందుకు చాలా వింతగా అనిపిస్తున్నప్పటికీ.. చాలా ఏళ్లుగా అక్కడ ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఆచారం వినడానికే కాదండోయ్.. చూడటానికి మరింత ఆశ్చర్యకరంగా అనిపిస్తుంది. ఎందుకంటే ఆలయ పూజారులు.. ఒకరి తరువాత మరొకరి భక్తుల తలలపై కొబ్బరికాయలు కొడతారు. ఈ ప్రక్రియలో తలలకు గాయాలు కావడం సర్వసాధారణం.

భక్తులు దైవం పట్ల తమకున్న భక్తిని, నమ్మకాన్ని ప్రదర్శించడానికి ఈ ఆచారాన్ని పాటిస్తారు. కొబ్బరి కాయలు కొట్టిన తర్వాత రక్తం కారుతున్నా, విపరీతమైన నొప్పి తమను వేధిస్తున్నా వారు మాత్రం నవ్వుతూ.. అమ్మవారిని దర్శించుకుంటారు. ఇలా చేస్తే తాము కోరుకున్న కోరికలు నెరవేరుతాయని, ఇబ్బందులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అయితే తలపై కొబ్బరి కాయలు కొట్టించుకోవడం సాహసమైనదే అయినప్పటికీ.. అనేక మంది భక్తులు.. గుంపులు గుంపులుగా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొంటూ ఉంటారు. ఈ వినూత్న ఆచారం వల్ల కొన్ని దురదృష్టకర సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. చాలా మంది భక్తులకు తీవ్రమైన గాయాలయ్యాయి. కొందరి తలల నుంచి రక్తం కారడం కూడా కనిపించింది. దీంతో ఆలయ సిబ్బంది వెంటనే స్పందించి గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించారు. గాయాలకు పసుపు రాసి, నొప్పి తగ్గించేందుకు ప్రయత్నించారు. అయితే గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆలయ సమీపంలోనే ఒక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఆ వైద్య శిబిరంలో సుమారు 40 మందికి పైగా భక్తులకు చికిత్స అందించారు. వారిలో చాలామందికి తల గాయాలకు కుట్లు వేయాల్సి వచ్చింది. ఇంత జరుగుతున్నా ఆ తర్వాత కూడా మరెంతో మంది భక్తులు తమ తలలపై కొబ్బరి కాయలు కొట్టించుకున్నారు.

## పాకిస్థాన్‌కు భారీగా అమెరికా ఆయుధాల సరఫరా.. పాత క్లిప్ షేర్ చేసిన భారత సైన్యం



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్థాన్ యుద్ధ సమయంలో పాకిస్థాన్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేసిందని భారత సైన్యం చారిత్రక సాక్ష్యాలతో సహా గుర్తు చేసింది. 1971లో అప్పటి రక్షణ శాఖ మంత్రి రాజ్యసభలో ఈ విషయాన్ని వెల్లడించగా.. అప్పటి పేపర్ క్లిప్పును ఇప్పుడు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అందులో అమెరికా, చైనా కలిసి పాకిస్థాన్‌కు తక్కువ ధరకే ఆయుధాలు అమ్మాయని, వాటిని బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో ఉపయోగించారని ఉంది. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా విమర్శలు చేయడంతో భారత్ ఈ విధంగా స్పందించింది. 1971: అంతర్జాతీయ వ్యవహారాలలో అమెరికా భారతదేశంపై అప్పుడప్పుడు చేసే విమర్శలకు భారత సైన్యం ఒక చారిత్రక సాక్ష్యంతో ఘాటుగా సమాధానం ఇచ్చింది. రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనడంపై ఇటీవల అమెరికా ఆందోళన వ్యక్తం చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ విషయంపై కోపంతోనే 25 శాతం సుంకాలతో పాటు ఫెనాల్టీలు కూడా విధించింది. అంతటితో ఆగకుండా రష్యాతో వ్యాపారం చేస్తూ.. ఉక్రెయిన్‌తో యుద్ధం చేసేందుకు సాయం చేస్తోందని ఆరోపించింది. ఈక్రమంలోనే భారత సైన్యం దీటుగా బదులు ఇచ్చింది. తప్పు చేసేది మేము కాదు మీరని పరోక్షంగా చెప్పేలా.. 1971లో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతుండగా అమెరికా పెద్ద ఎత్తున దాయాది దేశానికి ఆయుధాలు సరఫరా చేసినట్లు వివరించింది. కేవలం నోటి మాటతో కాకుండా అప్పుడు దీనిపై వచ్చిన వార్తా క్లిప్‌ను కూడా ఎక్స్ వేదికగా షేర్ చేసింది. 1971వ సంవత్సరం ఆగస్టు 5వ తేదీ నాటి ఈ వార్తా పత్రిక కథనం.. అప్పటి భారత రక్షణ ఉత్పత్తి శాఖ మంత్రి వీసీ శుక్లా రాజ్యసభలో చేసిన ప్రకటనను ప్రస్తావిస్తుంది. ఆ సమయంలో సోవియట్ యూనియన్ మరియు ఫ్రాన్స్ వంటి దేశాలు పాకిస్థాన్‌కు ఆయుధాలు ఇవ్వడం మానేసినప్పటికీ.. అమెరికా మాత్రం పాకిస్థాన్‌కు నిరంతరాయంగా ఆయుధాలను సరఫరా చేసిందని ఆయన పార్లమెంటులో పేర్కొన్నారు. 1954 నుండి పాకిస్థాన్‌కు అమెరికా సుమారు 2 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను అందజేసిందని ఈ వార్తా కథనంలో స్పష్టంగా ఉంది. అమెరికా, చైనా కలిసి ఆయుధాలను చాలా తక్కువ ధరకే పాకిస్థాన్‌కు అమ్ముతున్నాయని, ఆ ఆయుధాలను బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్య పోరాట యోధులపై జరిగిన హింసాకాండలో ఉపయోగించారని ఆ క్లిప్‌లో ఉంది.

## 15000 డాలర్లు.. అమెరికా వీసా ఇక మరింత భారం




**న్యూయార్క్-నవభూమి:** అగ్రరాజ్యం అమెరికా వీసా విధానంలో మరోసారి కఠినమైన మార్పులు తీసుకురావడానికి సిద్ధమైంది. వలసదారులపై ఇప్పటికే కఠిన నిబంధనలను అమలు చేస్తున్న అమెరికా ప్రభుత్వం, ఇప్పుడు బిజినెస్ టూరిస్ట్ వీసాల దరఖాస్తుదారులపై భారీ ఆర్థిక భారాన్ని మోపనుంది. తాజాగా అమెరికా విదేశాంగశాఖ ప్రతిపాదనల ప్రకారం, వీసా కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం $5,000 నుండి గరిష్ఠంగా $15,000 వరకు షూరిటీ బాండ్‌ను చెల్లించాల్సి ఉంటుంది. -పైలట్ ప్రోగ్రామ్‌గా ఆరంభం ఈ కొత్త విధానం ప్రస్తుతానికి 12 నెలల పాటు ఒక పైలట్ ప్రోగ్రామ్‌గా అమలు కానుంది. దీనికి సంబంధించిన అధికారిక నోటీసులు ఫెడరల్ రిజిస్ట్రీలో ప్రచురించిన 15 రోజుల్లోగా ఈ పాలసీ అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం వీసా పొందాలనుకునే వారిపై గణనీయమైన ప్రభావాన్ని చూపనుంది. షూరిటీ బాండ్ ఎలా పని చేస్తుంది? ఈ విధానం ప్రకారం వీసా దరఖాస్తు సమయంలోనే అభ్యర్థి నిర్ణీత మొత్తం డాలర్లను షూరిటీ బాండ్‌గా చెల్లించాలి. వీసా గడువు పూర్తయిన తర్వాత అభ్యర్థి చట్టబద్ధంగా అమెరికాను విడిచి వెళ్ళిపోతే, ఈ బాండ్ మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి ఇచ్చేస్తుంది. ఒకవేళ వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థి అమెరికాలోనే ఉండిపోతే, లేదా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే, ప్రభుత్వం ఆ బాండ్ మొత్తాన్ని స్వాధీనం చేసుకుంటుంది. ఈ షూరిటీ బాండ్ నిబంధన అన్ని దేశాలకు వర్తించదు. అమెరికా ప్రభుత్వం త్వరలో ఈ నిబంధన వర్తించే దేశాల జాబితాను విడుదల చేయనుంది. ప్రస్తుతం వీసా వేవర్ ప్రోగ్రామ్ కింద ఉన్న 42 దేశాలకు ఈ కొత్త నిబంధన వర్తించదు. ఈ దేశాలలో ఎక్కువగా ఐరోపా దేశాలు, కొన్ని ఆసియా , మధ్యప్రాచ్య దేశాలు ఉన్నాయి. వ్యక్తిగత పరిస్థితులను బట్టి కొంతమందికి ఈ నిబంధనల నుండి మినహాయింపులు లభించే అవకాశం కూడా ఉందని తెలుస్తోంది. భద్రతా కారణాలే ప్రధాన ఉద్దేశం వీసా గడువు ముగిసినా దేశం విడిచి వెళ్ళకుండా అమెరికాలోనే ఉండిపోయే వారి వల్ల దేశ భద్రతకు ముప్పు ఏర్పడుతుందనే ఆందోళనతో అమెరికా ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించుకుంది. ఈ విధానం కొత్తదేమీ కాదుబీ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2020లో దీనిని ప్రవేశపెట్టారు. అప్పట్లో కోవిడ్ మహమ్మారి కారణంగా అంతర్జాతీయ ప్రయాణాలు నిలిచిపోవడంతో ఇది పూర్తిగా అమలు కాలేదు. ఇప్పుడు మళ్లీ ఈ విధానాన్ని తిరిగి తెరపైకి తీసుకొస్తున్నారు. ఈ తాజా నిర్ణయం వీసా కోసం ఎదురుచూస్తున్న వారిపై ఆర్థికంగా తీవ్ర భారం మోపడమే కాకుండా, దరఖాస్తుదారుల సంఖ్యను కూడా గణనీయంగా తగ్గించవచ్చు. షూరిటీ బాండ్‌ను చెల్లించలేని చాలా మందికి అమెరికాకు వెళ్ళాలనే కల కేవలం కలగానే మిగిలిపోయే అవకాశం ఉంది. వీసా విధానాలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలంటే ఇటువంటి మార్పులను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కర్నాటకలో ట్రాన్స్‌పోర్టు వర్కర్ల సమ్మె.. ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం




**బెంగుళూరు-నవభూమి:** కర్నాటక(రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి పబ్లిక్ బస్సు సేవలు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆందోళన చేయవద్దు అని కోర్టు స్టే ఇచ్చినా ఉద్యోగ సంఘాలు మాత్రం నిరసనలో పాల్గొన్నాయి. జీతాలను సవరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అనేక చోట్ల బస్సులను డిపోల్లోనే పార్క్ చేశారు. కొన్ని బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి.సమ్మెలో పాల్గొనేందుకు కొందరు ఉద్యోగులు వ్యతిరేకించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను తరలించేందుకు కొందరు డ్రైవర్లు బస్సులను ఆపరేట్ చేస్తున్నట్లు తెలిసింది. పరిస్థితిని అధిగమించేందుకు రవాణా సంస్థ ట్రైనీ డ్రైవర్లను రంగంలోకి దించింది. బెంగుళూరు, చిక్కమంగళూరు, రాయ్‌చుర్, చిత్రదుర్గ్, హుబ్లి, ధర్వాడ్, బెల్గావి, మంగుళూరు, మైసూరు, తుమకూరు, హసన్ మాడికేరి, శివమొగ్గ, కాలబుర్గి పట్టణాల్లో ప్రయాణికులు భారీ సంఖ్యలో ఉన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు దొరక్క వేల సంఖ్యలో ప్రయాణికులు నిలిపోయారు.సమ్మె ప్రారంభం కావడానికి ముందు బయలుదేరిన బస్సులు మాత్రమే రోడ్లపై ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు బస్సు ఆపరేటర్లు, క్యాబ్ డ్రైవర్లు దండిగా ఆర్జిస్తున్నారు. బెంగులూరులో ఆటో రిక్షాలు ఎక్కువగా వసూల్ చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగ సంఘాలు, కర్నాటక ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఎరియర్స్ రూపంలో 38 నెలల జీతాన్ని ఇవ్వాలని, అలాగే 2024 జనవరి ఒకటో తేదీ నుంచి సవరించిన వేతనాన్ని ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



## అల్జీమర్స్‌కు టీకా మందు

పైబడే వయసులో వేధించే ఆరోగ్య సమస్య అల్జీమర్స్. ఇప్పటివరకూ ఈ రుగ్మతకు అడ్డుకట్ట వేసే చికిత్సలు రూపొందలేదు. అయితే తాజాగా అల్జీమర్స్‌ను అడ్డుకునే ఒక టీకాను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆ వివరాలు....మతిమరుపు, నాడీకణాల క్షీణతతో సంబంధమున్న 'టౌ' అనే విషపూరిత ప్రొటీన్ లక్ష్యంగా పని చేసే ఒక టీకాను న్యూ మెక్సికోలోని శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. ఇప్పటివరకూ అల్జీమర్స్‌కు కేవలం లక్షణాలను నియంత్రించే చికిత్స మాత్రమే కొనసాగుతూ ఉంది. దీనికి భిన్నంగా, తాజాగా అభివృద్ధి చేసిన టీకా, శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ, టౌ ప్రొటీన్‌ను గుర్తించి, దాన్ని హతం చేసేలా రోగనిరోధక వ్యవస్థకు శిక్షణనిస్తుంది. ఈ దిశగా ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, టీకా అందించిన ఎలుకల్లో టౌ ప్రొటీన్ ఉత్పత్తి క్షీణించినట్టు, ఫలితంగా అల్జీమర్స్ వ్యాధి ఉధృతి కూడా గణనీయంగా కుంటుపడినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఫలితాల ఆధారంగా ప్రస్తుతం ఇవే ప్రయోగాలను మనుషుల మీద చేపట్టే ప్రయత్నాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, ఈ ప్రయోగాలు విజయవంతమైతే, ఈ టీకా అతి త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ఆడపిల్ల పుట్టిందని ప్రాణాలతో పాతిపెట్టారు.. కట్ చేస్తే 170 దేశాల్లో మోత మోగించింది!



పుట్టగానే అడవిలోకి తీసుకెళ్లి సజీవంగా పాతిపెట్టారు. ఆడపిల్లగా పుట్టడమే ఆమె చేసిన పాపం. తల్లి చేసుకున్న పుణ్యం వల్ల ఎలాగోలా ఆ పసిగుడ్డు గోతి నుంచి బయటపడింది. కానీ, మృత్యువు ఆమెను అనుక్షణం వెంటాడింది. సమాజం చంపేస్తామని బెదిరించింది. అప్పటికే ముగ్గురు ఆడపిల్లలున్న ఇంట్లో.. ఏడో సంతానంగా మళ్లీ ఆడపిల్ల పుట్టినందుకు ఆమె తల్లిదండ్రులకు జరిమానా విధించారు. పేదరికం, కర్కశ సమాజంలో ఎన్నో అడ్డంకులు.. ప్రతి అడుగులోనూ ఆమెను అతలాకుతలం చేశాయి. అయినా పట్టువిడవలేదు. వచ్చిన ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోలేదు. అలా రాజస్థాన్ ఏడారుల నుంచి ప్రపంచవేదికలపై తన డ్యాన్స్‌తో మోత మోగించారు. 'కల్బేలియా' నృత్య రాణిగా ఎదిగారు. ఆమె గ్రేస్‌ను ప్రపంచం సెలెబ్రేట్ చేసుకుంది. భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. ఆమే రాజస్థాన్‌కు చెందిన 'కల్బేలియా' ఫోక్ డ్యాన్సర్.. గులాబో సపేరా. ఇదీ ఆమె కథ.

**పుట్టగానే పాతిపెట్టారు.**

గులాబో సపేరా (ధన్‌వంతీ) 1973లో రాజస్థాన్‌లోని పాములు ఆడించే కల్బేలియా తెగలో జన్మించారు. అప్పటికే ముగ్గురు ఆడపిల్లలతో భారంగా ఉన్న కుటుంబంలో.. ఏడో సంతానంగా గులాబో పుట్టారు. దీంతో మళ్లీ ఆడపిల్ల పుట్టిందని చుట్టుపక్కల అమ్మలక్కలంతా ఆడిపోసుకున్నారు. తల్లికి చెప్పకుండానే.. అడవిలోకి తీసుకెళ్లి గులాబోను సజీవంగా పాతిపెట్టారు.

**అమ్మ ప్రేమే కాపాడింది..**

'నా బిడ్డ ఏది' అని గులాబో తల్లి.. తన సోదరిని అడగ్గా.. 'నీ బిడ్డను అమ్మలక్కలంతా అడవిలో పాతిపెట్టారు' అని చెప్పేసరికి ఆమె గుండె తరుక్కుపోయింది. 'నా బిడ్డ బతికే ఉంటుంది అనే నమ్మకం నాకుంది.. ఎక్కడ పాతిపెట్టారో చెప్పు' అని సోదరిని బతిమాలింది. 'బతికి ఉన్నా లేకున్నా.. నేను నవమాసాలు మోసిన బిడ్డను ఒకసారి తట్టిచూస్తాను' అని ప్రాధేయపడింది. అనంతరం సోదరితో కలిసి అడవిలోకి వెళ్లి.. మట్టిలోంచి గులాబోను బయటకు తీసింది. అప్పుడే పుట్టిన పసికందు.. దాదాపు 7 గంటల పాటు మట్టి కింద ఉన్నా.. ఆమె ఊపిరి గాల్లో కలిసిపోలేదు. గులాబో తల్లి నమ్మకమే గెలిచింది.

**ఆడపిల్ల పుట్టినందుకు జరిమానా..**

గులాబోను అడవిలోంచి తీసుకొచ్చని విషయం ఊరంతా పాకింది. అమ్మలక్కలు, ముసలమ్మలందరూ.. గులాబో తల్లిదండ్రులను అనరాని మాటలు అన్నారు. 'ఈ పిల్ల చచ్చిపోవాల్సింది.. మీరు కొత్త సంప్రదాయం తీసుకువస్తున్నారా?' అని కసురుకున్నారు. కానీ, ఆమె తండ్రి.. 'నా బిడ్డను చంపుకోలేను' అని తెగించి చెప్పేశారు. దీంతో గులాబో తల్లిదండ్రులకు జరిమానా విధించారు. అక్కడితో ఆగకుండా.. 'ఈ పిల్ల చనిపోవాల్సింది.. కానీ ఎలాగోలా చస్తుంది.. చంపేస్తాం' అని బెదిరించారు. అప్పటి నుంచి గులాబోను తండ్రి ఎప్పుడూ తనతో పాటు తీసుకెళ్లేవారు.

**అప్పటి నుంచే డ్యాన్స్..**

గులాబో తండ్రి పాముల ప్రదర్శనలు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. గులాబోను కూడా తనతో పాటు తీసుకెళ్లేవాడు. పాములకు తాగించే పాలను ఆమెకు పట్టించేవాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 8–9 గంటలు నాన్నతోనే గడిపేది గులాబో. అలా నాగస్వరం వింటూ.. దానికి తగ్గట్టుగా అప్పటినుంచే డాన్స్ చేసేది. పాముల కదలికలను జాగ్రత్తగా గమనించేది. వాటిని అనుసరించి నృత్యం చేసేది. పాములతోనే తనకు రోజు గడిచేది. వాటితోనే గులాబో ఆడుకునేది. ఎందుకంటే.. అవే తన స్నేహితులు, తన పరివారం అంటారు గులాబో. తనకు రెండేళ్లు వచ్చేసరికి.. ఆడపిల్ల ఇంట్లో ఉండాలి.. అలా మగ పిల్లాడిలా డ్యాన్స్ చేయిస్తున్నావని తన తండ్రిని తిట్టిపోశారు చుట్టుపక్కల వాళ్లు. దీంతో గులాబోను ఇంట్లో వదిలేశారాయన.

**ఏంటీ కల్బేలియా డ్యాన్స్..?**

కల్బేలియా (సపేరా) రాజస్థాన్ జోధ్‌పూర్‌లోని జిప్సీ తెగకు చెందిన సంప్రదాయ నృత్యం. పలు ప్రత్యేక సందర్భాల్లో ఆ ట్రైబ్‌కు చెందిన మహిళలు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. పురుషులు పూంగీ, ఖంజరీ, డుఫ్లీ, మోర్చంగ్, ధోలక్.. వంటి సంగీత వాయిద్యాలు వాయిస్తుంటే.. ఆ ట్యూన్‌కు తగ్గట్టుగా మహిళలు నృత్యం చేస్తుంటారు. నాగ స్వరం ఊదితే పాములు ఎలా మెలికలు తిరుగుతాయో.. అలాంటి భంగిమలే కల్బేలియా డ్యాన్స్‌లో కనిపిస్తాయి. కల్బేలియా నృత్యంలో జానపద సంగీతానికి/ పాటలకు తగ్గట్టుగా డ్యాన్స్ చేస్తారు.

**టూరిజం అధికారుల కంట్లో పడిన గులాబో..**

ఇంట్లో ఉన్న గులాబోకు తన తల్లి మరిన్ని డ్యాన్స్ మూమెంట్‌లు నేర్పించింది. అలా క్రమంగా తన డ్యాన్స్‌ను మెరుగుపరుచుకుంది. గులాబో ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పుడు.. ఒక జాతరలో డ్యాన్స్ చేసింది. తండ్రి వాయిస్తున్న నాగస్వరానికి పాములాగా డ్యాన్స్ చేస్తున్న గులాబోను.. రాజస్థాన్ టూరిజం డిపార్ట్‌మెంట్ అధికారులు చూశారు. అనంతరం సాయంత్రం స్టేజ్ పర్ఫామెన్స్ ఇవ్వమని అడిగారు. అందుకుగానూ రూ.50 నోటు ఇచ్చారు. కరెన్సీ నోటును పట్టుకోవడం అదే మొదటిసారి అని.. పాములు ఆడించినందుకు అప్పటివరకు తమకు నాణేలే ఇచ్చావారని గులాబో ఓ సందర్భంలో చెప్పారు.

**గులాబో సపేరా, కల్బేలియా డ్యాన్స్ ఆర్టిస్ట్ జీవితాన్ని మార్చేసిన సంఘటన..**

ఆ తర్వాత కొన్నాళ్లకు రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు షిఫ్ట్ అయింది గులాబో కుటుంబం. 1985లో 13 ఏళ్ల వయసున్న గులాబోకు.. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ప్రదర్శన ఇచ్చే అవకాశం వచ్చింది. అది గులాబో జీవితాన్నే మార్చేసింది. ఆ ప్రదర్శన తర్వాత.. తనను చంపేయాలన్న సమాజమే తల వంచింది. అంతేకాకుండా తమ కుమార్తెలకు కూడా కల్బేలియా డ్యాన్స్ నేర్పించమని అక్కడి ఆడవాళ్లు గులాబోను కోరారు. అప్పుడే.. ఆడపిల్లలు పుట్టగానే చంపేసే దురాచారాన్ని అంతం చేస్తానని తన ప్రజలకు మాటిచ్చానని అంటారు గులాబో.

అలా ఆటుపోట్లనే అవకాశాలుగా మలచుకుని అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు గులాబో సపేరా. తన జాతి వారసత్వ సంపదను సజీవంగా కాపాడుతూ.. భవిష్యత్ తరాలకు అందిస్తున్నారు. ఇప్పుడు గులాబో ఒక సెలెబ్రేటెడ్ కల్బేలియా డ్యాన్సర్ మాత్రమే కాదు.. రోల్ మోడల్, టీచర్‌గా రాణిస్తున్నారు. భారత్‌లోని పలు ప్రదేశాల్లో, విదేశాల్లో కూడా డ్యాన్స్ స్కూల్స్ నడుపుతున్నారు. ఆమెను ఇప్పటికే అనేక అవార్డులు వరించాయి.

చావు కోరల నుంచి తప్పించుకుని.. సమాజ తిరస్కరణను ఎదుర్కొని ప్రపంచ ఖ్యాతి పొందారు గులాబో సపేరా. ఆమె విజయ గాథ.. ప్రతికూలతలను శక్తిగా ఎలా మార్చుకోవాలో మనకు నేర్పుతుంది. ఆమె కథ చాలామందికి.. ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజలకు స్ఫూర్తినిస్తుంది. ధైర్యం, పట్టుదల ఉంటే చిక్కటి చీకటిని కూడా చీల్చి.. ఉషోదయం వైపు ఎలా పయనించవచ్చో గులాబో చేసి చూపించారు. చిన్న సమస్యలకే జీవితం ఇక ఇంతే.. అనుకునే నవయువలకు గులాబో సపేరా జీవితం ఆదర్శం.

# పెళ్లికి ముందు లాగా ప్రేమించడం ప్రేమ పెళ్లి తర్వాత ఎందుకు కష్టం అవుతుంది..



మీరు ఎవరినైనా హృదయపూర్వకంగా ప్రేమిస్తే, ఆ వ్యక్తిని మీ జీవిత భాగస్వామిగా చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. మీ బాయ్‌ఫ్రెండ్ లేదా గర్ల్‌ఫ్రెండ్‌ని పెళ్లి చేసుకోవడం అనేది ఒక అందమైన కల నెరవేరడం లాంటిది. మొదట్లో ప్రేమ వివాహం చాలా బాగుందని అనిపించినా కొంత కాలం తర్వాత ఇద్దరి వైఖరిలో మార్పు రావడం చాలా సహజం. అయితే, పెళ్లికి ముందు లాగా ప్రేమించడం లేదని మీ భాగస్వామి భావించవచ్చు. పెళ్లికి ముందు లాగా ప్రేమించడం భర్త లేదా భార్యకు ఎందుకు కష్టంగా మారుతుందో ఈ కథనంలో తెలుసుకుందాం.

**1. బాధ్యతల భారం:**

పెళ్లి తర్వాత డబ్బు సంపాదించడానికి, ఇంటి బాధ్యతలను నిర్వహించడానికి జీవిత భాగస్వాములపై ఒత్తిడి పెరుగుతుంది. సాధారణంగా పెళ్లికి ముందు బాధ్యతలు తక్కువగా ఉంటాయి. పెళ్లికి ముందు ఫ్రీగా ఉన్నట్లు పెళ్లి తర్వాత ఉండలేం. కానీ, పెళ్లి తర్వాత బాధ్యతలు ఎక్కువ అవుతాయి. కాబట్టి, పెళ్లి తర్వాత ప్రేమ తరచుగా వెనుకబడిపోతుంది.

**2. సమయం లేకపోవడం:**

బాధ్యతల భారం కారణంగా, మీరు ఒకరికొకరు తక్కువ సమయం ఇవ్వగలుగుతారు. ఉద్యోగం అంటూ డే అంతా ఆఫీస్ లోనే సరిపోతుంది కాబట్టి ఒకరికొకరు సమయం కేటాయించలేకపోవచ్చు. ఇలా ఉండటం వల్ల కూడా పెళ్లికి ముందు ప్రేమించుకున్నట్లు పెళ్లి తర్వాత ఉండలేం.

**3. అధిక అంచనాలు:**

వివాహానికి ముందు, బాయ్‌ఫ్రెండ్ లేదా గర్ల్‌ఫ్రెండ్‌కు మనం అలా ఉండాలి, ఇలా ఉండాలి అని ఎన్నో అనుకుంటారు. ప్రేమికులు తమ భవిష్యత్తు వైవాహిక జీవితం గురించి అధిక అంచనాలను ఏర్పరుచుకుంటారు. అయితే, ఆ అంచనాలు నెరవేరకపోతే వారు ప్రేమపై విశ్వాసం కోల్పోతారు.


4. ప్రతికూల భాగాలు తెరపైకి వస్తాయి:

పెళ్లికి ముందు ప్రేమికులు ప్రతిరోజూ లేదా వారంలో కేవలం కొన్ని గంటలపాటు మాత్రమే కలుసుకుంటారు.. కాబట్టి ఉన్న సమయంలో హ్యాపీగా ఉంటారు. కానీ, పెళ్లయ్యాక 24 గంటలు కలిసిఉంటారు కాబట్టి చెడు లక్షణాలు బయటపడుతాయి. ఇలా పెళ్లి తర్వాత కనిపించే కొన్ని చెడు గుణాలను ఎదుటివారు స్వీకరించలేకపోతారు.

**5. కుటుంబ అంచనాలు:**

వివాహం తర్వాత, మీరు మీ ప్రేమికుడితో మాత్రమే జీవించలేరు.. ఎందుకంటే కుటుంబం కూడా మీ నుండి అనేక రకాల అంచనాలను కలిగి ఉంటుంది. కుటుంబ ఒత్తిడి కారణంగా, మీరు తరచుగా మీ భర్త లేదా భార్యతో మీ పాత ప్రేమ జీవితాన్ని గడపలేరు.

# ఈ లక్షణాలున్న వారు ఎప్పుడైనా మిమ్మల్ని మోసం చేయవచ్చు..



జీవితం అనేది సుదీర్ఘ ప్రయాణం. దీనిలో మనం చాలా మందిని కలుస్తాము. కొంతమంది మన జీవితంలో ఆనందాన్ని తెస్తారు. కొందరు మనకు ముఖ్యమైన పాఠాలు నేర్పుతారు. కానీ దురదృష్టవశాత్తు, ఈ కాలంలో మనల్ని మోసం చేసేవారే ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా ఈ 5 లక్షణాలున్న వ్యక్తి మిమ్మల్ని ఎప్పుడైనా మోసం చేయవచ్చు. కాబట్టి, ఇలాంటి వారికి దూరంగా ఉండటం బెటర్.

**1. అహేతుకంగా మాట్లాడటం:**

మోసపూరిత వ్యక్తుల యొక్క అతి పెద్ద లక్షణం ఏమిటంటే వారు తరచుగా అహేతుకంగా మాట్లాడటం. వారి మాటల్లో స్పష్టత ఉండదు. మీరు ఒక వ్యక్తిలో మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రవర్తనను చూసినట్లయితే, మీరు అతని పట్ల జాగ్రత్తగా ఉండాలి.


**2. మాట నిలబెట్టుకోకపోవడం:**

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండని వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి. ఎందుకంటే అలాంటి వ్యక్తులు కట్టుబాట్లను పాటించరు. అంతేకాకుండా వారు ఎవరినైనా ఎప్పుడైనా మోసం చేయవచ్చు.

**3. నిరంతర అబద్ధం:**

అబద్ధం మోసానికి స్పష్టమైన సంకేతం. ఒక వ్యక్తి పదే పదే అబద్ధాలు చెబితే అతన్ని నమ్మడం కష్టం. చిన్న అబద్ధాలు కూడా పెద్ద మోసానికి నాంది కాగలవు. అందువల్ల మీరు మరింత అప్రమత్తంగా ఉండాలి. వారితో ఎలాంటి వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దు.

**4. ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం:**



ఇతరుల గురించి తరచుగా చెడుగా మాట్లాడే వ్యక్తులు మీకు కూడా అదే విధంగా చేయవచ్చు. అలాంటి వ్యక్తులు కబుర్లు చెప్పడం, ఇతరుల గురించి ప్రతికూలంగా మాట్లాడటం వంటివి చేస్తుంటారు. అలాంటి వ్యక్తుల నుండి దూరం పాటించడం మంచిది. ఎందుకంటే మీరు లేనప్పుడు వారు మీ గురించి మరొకరితో చెడుగా మాట్లాడవచ్చు.


**5. స్వార్థపూరిత ప్రవర్తన:**

తమ గురించి మాత్రమే ఆలోచించి, ఇతరుల గురించి పట్టించుకోని వ్యక్తులు కూడా మోసం చేయవచ్చు. అలాంటి వారు తమ ప్రయోజనాల కోసం ఎవరినైనా ఉపయోగించుకోవచ్చు. అందువల్ల, స్వార్థపూరిత ప్రవర్తనను ప్రదర్శించే వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి.

**ముఖ్యమైన సలహా..**

ఈ సంకేతాలు మిమ్మల్ని జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నాయి. మోసాన్ని నివారించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు, కానీ ఈ సంకేతాలను గుర్తించడం, జాగ్రత్తగా ఉండటం ద్వారా మీరు దాని ప్రభావాన్ని తగ్గించవచ్చు. వెంటనే ఎవరినీ నమ్మవద్దు.

# పిల్లల చేతి రాత అందంగా



కొంతమంది పిల్లల చేతిరాత అంత అందంగా ఉండదు. అక్షరాలను ఒక క్రమంలో కాకుండా ఎగుడు దిగుడుగా, కొన్నింటిని పెద్దగా మరికొన్నింటిని చిన్నగా రాస్తుంటారు. ఎంత బాగా చదివినప్పటికీ చేతిరాత సరిగా లేకపోతే పరీక్షల్లో మార్కులు కూడా తగ్గుతుంటాయి. అలాకాకుండా పిల్లల చేతిరాత చక్కగా ఉండాలంటే తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

ముందుగా పిల్లలు పెన్సిల్‌ను ఎలా పట్టుకుంటున్నారో పరిశీలించాలి. చూపుడు వేలు, మధ్యవేలు, బొటనవేలు మధ్య పెన్సిల్ సరిగా అమరేలా చూడాలి. ఈ మూడు వేళ్లతో పెన్సిల్‌ను గట్టిగా పట్టుకోవడం నేర్పించాలి. చాలామంది పిల్లలు పెన్సిల్‌ను చూపుడు వేలు, బొటనవేలుతో మాత్రమే పట్టుకుంటూ ఉంటారు. దీనివవల్ల సరైన గ్రిప్ దొరకక చేతిరాత సరిగా రాదు.

పిల్లలకు అక్షరాలను సరళరేఖ వెంబడి ఒకే రీతిలో రాయడం నేర్పించాలి. రూల్డ్ నోట్‌బుక్స్‌లో రాస్తూ ఉంటే కొద్ది రోజుల తరవాత తెల్ల కాగితం మీద కూడా చక్కగా రాయడం వస్తుంది.

అరచేతులు, వేళ్లు వేగంగా కదిలిస్తూ చేసే పనులను పిల్లలకు చెప్పి చేయించాలి. మట్టితో బొమ్మలు చేయడం, సూదిలో దారం ఎక్కించడం, సొంతంగా ఆహారాన్ని తినడం, బొమ్మలతో పజిల్స్ పూర్తిచేయడం లాంటివి చేయిస్తూ ఉంటే ఏకాగ్రత కుదురుతుంది. చేసే పనికి తగ్గట్టు వేళ్లను కదిలించడం పిల్లలకు అలవాటవుతుంది. క్రమంగా చేతిరాత మెరుగవుతుంది.

పిల్లల చేత అక్షరాలను సరైన క్రమంలో దిద్దించాలి. తరవాత వాటిని వరుసలో రాయమని చెప్పాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే అక్షరాలు రాసే విధానం పిల్లలకు అర్థమవుతుంది. వాటిని అందంగా ఎలా రాయాలో తెలుస్తుంది. క్రమంగా పదాలు, వాక్యాలు రాయడాన్ని పిల్లలకు నేర్పించాలి.

వాక్యాలు రాసేటప్పుడు పదాల మధ్య చిన్న ఖాళీ ఉంచాలని పిల్లలకు చెప్పాలి. పదాలు రాసేటప్పుడు అక్షరాల సైజు ఒకేలా ఉండేలా సాధన చేయించాలి. రాయడానికి కష్టంగా ఉన్న పదాలను విడిగా పలుమార్లు రాయిస్తే పిల్లలు సులువుగా వాక్యాలు రాయగల్గుతారు. చేతిరాత కూడా పొందికగా మారుతుంది.




# నవ బిజినెస్

## ట్రంప్ బెదిరింపులు.. మళ్లీ నష్టాల బాట పట్టిన స్టాక్ మార్కెట్లు..

**ముంబై-నవభూమి:** సోమవారం లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు మంగళవారం మళ్లీ నష్టాల బాట పట్టాయి. భారత్‌పై మరింతగా సుంకాలను పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో మదుపర్లు అమ్మకాలకు దిగారు. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో సూచీలు నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల బాటలో




ఉన్నాయి
సోమవారం ముగింపు (81, 018)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా నష్టాల్లోకి జారుకుంది. ప్రస్తుతం ఉదయం 10:40 గంటల సమయంలో సెన్సెక్స్ 410 పాయింట్ల నష్టంతో 80, 608 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 115 పాయింట్ల నష్టంతో 24, 607 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో నవుమా హెల్త్, కేన్స్ టెక్నాలజీస్, మాజగాన్ డాక్, ఏపీఎల్ అపోలో, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హిందుస్థాన్ పెట్రో, మనప్పురం ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, పీబీ ఫిన్‌టెక్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి.

## భారత్‌పై మరింతగా పన్నులు పెంచుతా.. డొనాల్డ్ ట్రంప్ మరోసారి బెదిరింపు..



**న్యూయార్క్-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌మరో సారి భారత్‌పై తన ఆగ్రహాన్ని వెల్లడించారు. రష్యా నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయమై అమెరికా హెచ్చరించినా భారత్ వెనక్కి తగ్గపోవడంతో ఆయన ఆగ్రహం మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. భారత్‌పై 25 శాతం పన్నులు పెంచుతున్నట్టు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ పన్నులతోనే ఆగనని ముమ్ముందు మరింతగా పెంచుతానని ట్రంప్ తాజాగా ప్రకటించారు 'రష్యా యుద్ధంలో ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు చనిపోతున్నారో భారత్ పట్టించుకోవడం లేదు. రష్యా నుంచి ఆయిల్ కొంటూ ఆ దేశానికి నిధులు సమకూర్చడం ఆపడం లేదు. కాబట్టి భారత్‌పై ముమ్ముందు మరింతగా సుంకాలు పెంచుతాను' అని ట్రూత్ సామాజిక మాధ్యమం ద్వారా ట్రంప్ సోమవారం హెచ్చరించారు. అలాగే వలస వ్యవహారాల్లోనూ అమెరికాను భారత్ మోసం చేస్తోందని వైట్‌హౌస్ ఉన్నతాధికారి స్టీఫెన్ మిల్లర్ వ్యవహరించారు.

కాగా, రష్యా నుంచి చమురు కొనే విషయంలో అమెరికా అభ్యంతరాలను భారత్ గట్టిగా తిప్పికొట్టింది. దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికే రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా ఇప్పటికీ రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్, విద్యుత్ వాహనాలు, ఎరువుల తయారీకి అవసరమైన పలేడియంను దిగుమతి చేసుకోవడాన్ని ప్రశ్నించింది.

## కొత్త కారు కొనాలా? ఈ కార్లపై రూ.2.30 లక్షలు తగ్గింపు.. ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే




**ముంబై-నవభూమి:** కొత్త కారు కొనుగోలు చేయాలనుకునే వారికి ప్రస్తుతం చాలా కంపెనీల కార్లు అందుబాటులో ఉన్నాయి. అయితే తమకు కావాల్సిన ఫీచర్లతో తక్కువ ధరలో లభించే కార్లను ఎంచుకోవడం తెలివైన నిర్ణయంగా చెప్పవచ్చు. అలా మీరు కూడా మంచి ప్రీమియం కారును తక్కువ ధరకు కొనుగోలు చేయాలనుకుంటుంటే ప్రస్తుతం మంచి ఆఫర్ అందుబాటులో ఉంది. ప్రముఖ కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ భారీ డిస్కౌంట్ ఆఫర్ తీసుకొచ్చింది. భారత్ మార్కెట్లోకి అడుగుపెట్టి ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న క్రమంలో తమ కంపెనీకి చెందిన హెక్టార్, హెక్టార్ ప్లస్ మోడల్ కార్లపై డిస్కౌంట్ ప్రకటించింది. గరిష్ఠంగా రూ.2.30 లక్షల వరకు రాయితీలు కల్పిస్తోంది. ఇది పరిమిత కాల ఆఫర్‌గా కంపెనీ పేర్కొంది. 2019లో భారత మార్కెట్లోకి ఎంజీ హెక్టార్ అడుగుపెట్టింది. దేశంలో తొలి ఇంటర్నెట్ కనెక్టెడ్ ఎస్‌యూవీగా ఎంజీ హెక్టార్ కారు నిలిచింది. డ్యూయల్ పేన్ పనోరమిక్ సన్ రూఫ్, 14 ఇంచుల హెచ్‌డీ టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 70కి పైగా కనెక్టెడ్ ఫీచర్లు, అధునాత భద్రతా వ్యవస్థలు ఈ కారులో ఉన్నాయి. ఇలాంటి ప్రీమియం ఫీచర్లు కలిగిన కార్లపై గణనీయమైన తగ్గింపులు ప్రకటించింది కంపెనీ. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్ కారుపై రూ.2.14 లక్షల వరకు డిస్కౌంట్ కల్పిస్తోంది. ఈ ఆఫర్ సమయంలో ఈ కారును రూ.19 లక్షలు (ఎక్స్ షోరూమ్) ధరకే కొనుగోలు చేయవచ్చు. ఇక బేస్ వేరియంట్ అయిన స్టైల్ ట్రిమ్ కారు ధరను రూ.25 వేలు పెంచడం గమనార్హం.

ఎంజీ మోటార్ హెక్టార్ ప్లస్ ఎస్‌యూవీ కారు విషయానికి వస్తే 6 సీటర్ వేరియంట్లన్నింటి ధరలు తగ్గించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్ కారు ధరపై గరిష్ఠంగా రూ.2.30 లక్షల మేర డిస్కౌంట్ ప్రకటించింది కంపెనీ. హెక్టార్ ప్లస్ 7 సీటర్ ఎస్‌యూవీ కారులోనూ, షార్ప్ 1.5 పెట్రోల్ వేరియంట్లోనూ ఏకంగా రూ.2.30 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తోంది. సెలెక్ట్ ప్రో, షార్ప్ ప్రో, స్నోస్టార్మ్, బ్లాక్ స్టార్మ్, సావీ ప్రో వంటి ట్రిమ్స్ కార్లపై రూ.2 లక్షల వరకు తగ్గింపు ఇస్తున్నారు. ఈ డిస్కౌంట్లు పరిమిత కాలం పాటు అందుబాటులో ఉంటాయని కంపెనీ వెల్లడించింది. అయితే, ఎప్పటి వరకు అందుబాటులో ఉంటాయనే విషయాన్ని తెలపలేదు. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం అయితే ఈనెలాఖరు వరకు డిస్కౌంట్ కల్పించే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

## ఫైలింగ్ తర్వాత 30 రోజుల్లో వెరిఫై చేయకపోతే మీ ఐటీ రిటర్న్స్

**ముంబై-నవభూమి:** మీరు ఆదాయపు పన్ను రిటర్న్స్ ) దాఖలు చేశారా..? అయితే అంతటితో మీ పని పూర్తి కాలేదు. ఆన్‌లైన లో రిటర్న్‌లు అప్‌లోడ్ చేసిన తర్వాత 30 రోజుల్లోగా వాటిని తప్పనిసరిగా వెరిఫై చేయాల్సి ఉంటుందని, లేదంటే ఆదాయపు పన్ను శాఖ మీరు దాఖలు చేసిన ఆ రిటర్న్‌ను చెల్లనివిగా పరిగణిస్తుందని ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు. కేవలం ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లో వివరాలు సమర్పించినంత మాత్రాన ప్రక్రియ ముగిసినట్లు కాదని నిపుణులు చెబుతున్నారు. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి ఐటీఆర్ ఫైల్ చేసేందుకు పొడిగించిన గడువు సెప్టెంబర్ 15 తో ముగియనుంది. ఇప్పటికే చాలామంది పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే ఫైలింగ్ తర్వాత అత్యంత కీలకమైన వెరిఫికేషన్ దశను నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. గడువులోగా వెరిఫై చేయని రిటర్న్‌లను ఆదాయపన్ను శాఖ ప్రాసెస్ చేయదు. పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రెండు పద్ధతుల్లో వెరిఫై చేయవచ్చు.

## బవిస్టిన్ - ప్రసిద్ధమైన ఫంగిసైడ్ బ్రాండ్‌కు 50 ఏళ్లు -ఘనంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ ఉత్సవం




**ముంబై-నవభూమి:** భారతదేశంలోని ప్రముఖ పరిశోధన ఆధారిత అగ్రరాసాయన సంస్థ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ తన ఐకానిక్ ఫంగిసైడ్ బ్రాండ్ బవిస్టిన్ గౌరవప్రదమైన 50 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని గర్వంగా ప్రకటించింది. 1975లో ప్రవేశపెట్టిన బవిస్టిన్ భారతీయ వ్యవసాయంలో అత్యంత నమ్మకమైన, అనుభవపూర్వకమైన అంతర్వాహిక శిలింద్రనాసినిగా స్థిరపడింది. దీని వ్యాప్తి గల నిరోధక చికిత్సా లక్షణాలు పంటల ఎదుగుదలలో అన్ని దశలలో ఫంగల్ వ్యాధుల నుండి రక్షణను అందించాయి. ఇది భారత రైతుకు అవసరమైన నమ్మకమైన సహాయకుడిగా ఎదిగింది. బవిస్టిన్‌అంతర్వాహిక లక్షణం కారణంగా, ఇందులోని యాక్టివ్ పదార్థం మొక్కలో అంతర్గతంగా వ్యాపించి, ప్రతి పెరుగుతున్న భాగాన్ని రక్షిస్తుంది. దీని స్థిరమైన పనితీరు నమ్మకమైన ఫలితాలు దశాబ్దాలుగా దీన్ని కేవలం ఉత్పత్తిగా కాకుండా ఒక బ్రాండ్ వారసత్వంగా మార్చాయి ు ఇది క్రిస్టల్ యొక్క "రక్షణ మరియు లాభదాయకత" వాగ్దానాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ గోల్డెన్ జూబిలీ సందర్భాన్ని పురస్కరించుకుని, క్రిస్టల్ మేనేజింగ్ డైరెక్టర్ అంకుర్ అగర్వాల్ మాట్లాడుతూ, "బవిస్టిన్ భారత వ్యవసాయ కుటుంబంలో ఒక భాగంగా మారిపోయింది. గత 50 సంవత్సరాల్లో ఇది పంటలకు రక్షణ కల్పించి, రైతుల ఆదాయాన్ని మద్దతునిచ్చింది ు ఇది క్రిస్టల్ యొక్క ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుంది: శాస్త్రీయంగా ఆధారితమైన, స్థిరమైన పరిష్కారాలతో భారత రైతును శక్తివంతం చేయడం. ఈ గోల్డెన్ జూబిలీ కేవలం ఒక ఉత్పత్తి పట్ల గౌరవం కాదు, నమ్మకాన్ని మరియు పనితీరు మీద ఆధారపడిన సంబంధాన్ని సెలబ్రేట్ చేయడమే."ఈ ఐకానిక్ ప్రయాణాన్ని గుర్తుగా, క్రిస్టల్ సంస్థ లి'బవిస్టిన్ లిమిటెడ్ ఎడిషన్ గోల్డెన్ జూబిలీ ప్యాక్'లిను విడుదల చేసింది, ఇది మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక వంటి బ్రాండ్ విజయానికి ప్రధానమైన రాష్ట్రాల్లో ప్రారంభించబడింది. క్రిస్టల్ (బ్రాండ్స్) బిజినెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్రీ. సోహిత్ సత్యవాలి మాట్లాడుతూ, "జరూరీ థా, జరూరీ హై, ఆర్ జరూరీ రహేగా' అనే మాటలు బవిస్టిన్ ప్రయాణాన్ని అర్థవంతంగా వివరిస్తాయి ఇది గతంలో అవసరమైనది, ప్రస్తుతం ప్రభావవంతమైనది.


భవిష్యత్ తరాలకూ అవసరమైనదిగా నిలుస్తుంది. ఇది ఒక సాధారణ ట్యాగ్‌లైన్ కాదు. ఇది భారత వ్యవసాయంపై బవిస్టిన్ యొక్క నిబద్ధతను, అలాగే రైతు-ఆధారిత వినూత్నతలను అందించే మన శాశ్వత వాగ్దానాన్ని తిరిగి ధృవీకరించే మాటలు."
బవిస్టిన్ 50గ్రా, 100గ్రా, 250గ్రా 500గ్రా ప్యాక్‌ల లో లభిస్తుంది, ఇది ఇప్పటికీ రైతులు, వ్యవసాయ నిపుణులు విక్రేతల మధ్య వ్యాధి నివారణకు ప్రాధాన్యత గల ఎంపికగా కొనసాగుతోంది. క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ గురించి:
క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ అనేది పరిశోధన ఆధారిత, సమగ్ర వ్యవసాయ ఇన్‌పుట్ సంస్థ, ఇది ఫసలుల రక్షణ, విత్తనాలు వ్యవసాయ యాంత్రీకరణ రంగాల్లో స్థిరమైన పరిష్కారాలను అందిస్తుంది. దేశవ్యాప్తంగా బలమైన ప్రాతినిధ్యం 35కి పైగా దేశాల్లో ఉనికితో, క్రిస్టల్ నవీనత, సామర్థ్యము విశ్వాసం ద్వారా లాభదాయకమైన వ్యవసాయాన్ని సాధించడంలో రైతులకు సహకరించడంలో కట్టుబడి ఉంది.
వెబ్‌సైట్: %www.crystalcropprotection.com

## టెస్లా సెకెండ్ షోరూం ప్రారంభానికి రంగం సిద్ధం..




**ముంబై-నవభూమి:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీ లో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీ లో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది.
ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. RWD (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ RWD వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.


## యస్ బ్యాంక్ లోన్ మోసం కేసు.. ఈడీ ముందుకు అనిల్ అంబానీ



**ఢిల్లీ-నవభూమి:** రూ.17వేల కోట్ల లోన్ మోసం కేసు విచారణ నిమిత్తం పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ ఈడీ ఎదుట హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఢిల్లీలోని ఈడీ ఆఫీస్‌కు ఆయన చేరుకున్నారు. 11.30 గంటలకు విచారణ మొదలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈడీ అధికారులు అనిల్ లాయర్లను లోపలికి అనుమతించలేదు. లాయర్లు లేకుండానే అనిల్‌ను విచారిస్తున్నారు. మొత్తం విచారణను కెమెరాలో రికార్డు చేస్తున్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ యాక్ట్ కింద అనిల్ అంబానీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు. కాగా, లోన్ మోసం కేసుకు సంబంధించి ఈడీ ఆగస్టు 1వ తేదీన ఆయనకు సమన్లు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఆ వెంటనే అంబానీకి లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న బిశ్వాల్ ట్రేడ్ లింక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి బిశ్వాల్‌ను సైతం అరెస్ట్ చేసింది. రూ.68.2కోట్ల విలువైన ఫేక్ గ్యారెంటీలు ఇచ్చాడన్న ఆరోపణల నేపథ్యంలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ కింద బిశ్వాల్ ను అదుపులోకి తీసుకుంది.


కేసు వివరాలు
2017 నుంచి 2019 మధ్య కాలంలో రిలయన్స్ కంపెనీ యస్ బ్యాంకు నుంచి రూ.3వేల కోట్ల లోన్లు తీసుకుంది. ఈ రూ.3వేల కోట్లను అనిల్ అంబానీ దారి మళ్లించారన్న ఆరోపణలు ఉన్నాయి. లోన్ ఇవ్వడానికి ముందు బ్యాంకు ప్రమోటర్లకు పెద్ద మొత్తం నిధులు అందినట్లు ఈడీ కనుగొంది. రూ.3వేల కోట్ల లోన్ నిధుల మళ్లింపును క్విడ్ ప్రోకోగా తేల్చింది. అంతేకాదు.. రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ మరో రూ.14వేల కోట్ల లోన్ మోసాలకు పాల్పడినట్లు ఈడీ అధికారులు తేల్చారు. మొత్తం రూ.17వేల కోట్లకు సంబంధించి ప్రస్తుతం విచారణ జరుగుతోంది. వివిధ బ్యాంకుల నుంచి రిలయన్స్ కంపెనీ తీసుకున్న లోన్ల గురించీ ఈడీ ఆరా తీస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులకు లోన్ల వివరాలు చెప్పాలంటూ లేఖలు రాసింది.

# రూపాయికి సుంకాల పోటు



**ముంబై-నవభూమి:** గడిచిన కొన్ని రోజుల్లో భారత కరెన్సీ విలువ తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతోంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం మరో 48 పైసలు పతనమై రూ.87.66 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల పోటు, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. గతవారంలోనూ రూపాయి మారకం విలువ 1.2 శాతం పతనమైంది. 2022 డిసెంబరు తర్వాత మన కరెన్సీకిదే అతిపెద్ద వారం రోజుల క్షీణత. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితితోపాటు విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటంతో రాబోయే కాలంలో కూడా రూపాయి బలహీనంగానే ఉండవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్, కరెన్సీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అభిప్రాయపడ్డారు. రాబోయే సెషన్లలో డాలర్-రూపీ మారకం రేటు రూ.88.50కి చేరుకోవచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నివేదిక అంచనా వేసింది. అయితే, బలహీనపడుతున్న డాలర్, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటి అంశాలు కనిష్ఠ స్థాయిల్లో రూపాయికి మద్దతుగా నిలవవచ్చని ఫారెక్స్ వర్గాలు భావిస్తున్నాయి. ట్రంప్ భారత్‌పై విధించిన 25 శాతం సుంకాలు ఈ నెల నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ దెబ్బతో ఎగుమతులపై 30% మేర ప్రభావం పడవచ్చని జీటీఆర్ఐ అంచనా వేసింది. ఈనేపథ్యంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే సుంకాల పోటు నుంచి కాస్త ఊరట లభించవచ్చని ఎగుమతిదారులు ఎదురుచూస్తున్నారు. కానీ, యూఎస్‌తో ట్రేడ్ డీల్ ఎప్పటి లోగా కుదురుతుందన్న విషయంలో అనిశ్చితి పెరుగుతోంది. ఇదిలా ఉండగా.. గతనెలలో ఎఫ్ఐఐలు మొత్తం రూ.17,400 కోట్లకు పైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈనెల 1న రూ.5,588.91 కోట్లు, 2న రూ.3,366.40 కోట్లు, సోమవారం మరో రూ.2,566.51 కోట్ల నికర అమ్మకాలు జరిపారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, ఈ ఏడాది ద్వితీయార్ధంలో మన రూపాయి ఆసియాలోకెల్లా అత్యంత కనిష్ఠ పనితీరు కనబరిచిన కరెన్సీగా మిగిలిపోవచ్చని డాయిష్ బ్యాంక్ భావిస్తోంది. ఈ ఏడాది చివరికల్లా డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠానికి జారుకోవచ్చని అంచనా వేసింది. అమెరికా సుంకాల సంబంధిత ప్రతికూలతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణే రూపాయిపై ప్రధానంగా ఒత్తిడి పెంచుతున్నాయని ఫారెక్స్ విశ్లేషకులు పేర్కొన్నారు.

## ఐదో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా భారత్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ ప్రపంచంలో ఐదో అతి పెద్ద విమానయాన సేవల మార్కెట్‌గా అవతరించిందని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. గత ఏడాది భారత్‌లో 21.1 కోట్ల మంది (జాతీయ, అంతర్జాతీయ) విమాన ప్రయాణం చేశారని, 2023తో పోలిస్తే విమాన ప్రయాణికుల సంఖ్య 11.1 శాతం పెరిగిందని తాజా నివేదికలో వెల్లడించింది. అలాగే, ముంబై-ఢిల్లీ అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటల్లో ఒకటని పేర్కొం ది. ప్రపంచవ్యాప్తంగా 350 ఎయిర్‌లైన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఏటీఏ రిపోర్టులోని మరిన్ని విషయాలు..గత ఏడాదికి గాను 87.6 కోట్ల మంది ప్రయాణికులతో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా అమెరికా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. 74.1 కోట్ల ప్రయాణికులతో చైనా రెండో స్థానంలో ఉంది. ప్రపంచంలోని అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటలో ముంబై-ఢిల్లీ 7వ స్థానంలో ఉన్నాయి. గత ఏడాది ఈ ఎయిర్‌పోర్టుల మధ్య 59 లక్షల మంది ప్రయాణించారు. ఈ విషయంలో ఆసియా పసిఫిక్ విమానాశ్రయాల జంటలే అధికం. జెజు-సియోల్ ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయ జంటగా నిలిచింది. గత ఏడాది ఈ రెండు ఎయిర్‌పోర్ట్‌ల మధ్య 1.32 కోట్ల మంది ప్రయాణించారు. గత ఏడాది అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో బిజినెస్, ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించిన వారి సంఖ్య 11.8 శాతం పెరగగా.. ఎకానమీ క్లాస్ ప్రయాణికుల వృద్ధి 11.5 శాతంగా నమోదైంది. 2024లో అంతర్జాతీయ బిజినెస్, ఫస్ట్ క్లాస్ ప్రయాణికుల మొత్తం సంఖ్య 11.69 కోట్లకు పెరిగింది. ఇది మొత్తం అంతర్జాతీయ ప్రయాణికుల్లో 6 శాతానికి సమానం.

## ఎంత పని చేస్తివయ్యా ట్రంప్.. ఒకరోజే రూ.2 లక్షల కోట్లు లాస్..!



**న్యూయార్కు-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ భయాలు వెంటాడుతున్నాయి. భారత్‌పై 25 శాతం సుంకాలు, ఆపైన పెనాల్టీలు విధిస్తామని ట్రంప్ ప్రకటించిన క్రమంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు నష్టాలను చవి చూశాయి. మంగళవారం (ఆగస్టు 5) రోజు సెన్సెక్స్ , నిఫ్టీలు నష్టాల్లో ముగిశాయి. ట్రంప్ టారిఫ్‌లకు తోడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రైవ్య పరపతి విధాన కమిటీ సమావేశం కొనసాగుతుండమూ ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో ఆర్‌బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోన్న అనిశ్చితిలో మదుపరులు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో ఈరోజు ట్రేడింగ్ సెషన్‌లో సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ ఏకంగా 300 పాయింట్ల మేర పడిపోయింది. నిఫ్టీ 24,700 మార్క్ దిగువకు చేరుకుంది. ఈరోజు ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,946 వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకుల్లోనే సాగింది. ఒక దశలో ఏకంగా 80,554 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 308 పాయింట్ల నష్టంతో 80,710 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 50 ఇండెక్స్ 25,590- 24,733 పాయింట్ల మధ్య కదలాడి చివరకు 73.20 పాయింట్ల నష్టంతో 24,650 వద్ద స్థిరపడింది. ట్రంప్ సుంకాల ప్రభావం, ముడి చమురు ధరల నేపథ్యంలో రూపాయి విలువ భారీగా పడిపోతోంది. ఇవాళ 15 పైసలు పడిపోయి 87.81 వద్దకు దిగజారింది. నిఫ్టీ సూచీలో చూస్తే ఇన్ఫోసిస్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్ ప్రైజెస్ షేర్లు భారీ నష్టాల్లో ముగిశాయి. దీంతో ఇన్వెస్టర్లు ఒక్క రోజే రూ. 2 లక్షల కోట్లు నష్టపోయారు. మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం సంపద విలువ క్రితం రోజు రూ. 452 లక్షల కోట్లు ఉండగా అది ఈరోజు రూ. 450 లక్షల కోట్లకు తగ్గింది.
రష్యా చమురును కొనుగోలు చేసినట్లయితే భారత్‌పై అదనపు సుంకాలతో పాటు పెనాల్టీలు వేస్తామని ట్రంప్ బెదిరిచడం ఇన్వెస్టర్ల సెంటిమెంటును దెబ్బతీసిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు చేపడుతున్నారు. ఒక్కోరజే రూ. 2566 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. ట్రంప్ సుంకాల భయాలతో ముడి చమురు, గ్యాస్ సెక్టార్ షేర్లు పడిపోయాయి. దాదాపు 1 శాతం మేర నష్టాల్లో ముగిశాయి. అలాగే ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా నిర్ణయాలు బుధవారం వెల్లడించనున్నారు. ద్రవ్యోల్బణం తగ్గినా ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేట్లపై ఆర్‌బీఐ ఆచితూచి వ్యవహరించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## జీ ఎస్ టీ ఎగవేతలు ఐదేళ్లలో రూ. 7.08 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** జీఎసటీ కాలంలోనూ పన్ను ఎగవేతలు యదేచ్ఛగా సాగుతున్నాయి. గత ఐదేళ్లలో (2020-25) 91,370 కేసుల్లో రూ.7.08 లక్షల కోట్ల జీఎసటీ ఎగవేతలను కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని క్షేత్ర స్థాయి జీఎసటీ అధికారులు గుర్తించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయం వెల్లడించారు. గత ఐదేళ్లలో వ్యాపారులు, వ్యాపా ర సంస్థలు, కంపెనీలు ఎగవేసిన రూ.7.08 లక్షల కోట్ల జీఎస్‌టీ కేసుల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాటానే రూ.2.79 లక్షల కోట్ల వరకు ఉందని మంత్రి చెప్పారు. ఐతే గత ఐదేళ్లలో స్వచ్ఛంద డిపాజిట్ పథకం ద్వారా రూ.1.29 లక్షల కోట్ల జీఎసటీ ఎగవేతల సొమ్మును అధికారులు రాబట్టగలిగారు.
2024-25 ఆర్థిక సంవత్సరంలో 33,056 కేసుల్లో రూ.2.23 లక్షల కోట్ల జీఎసటీ ఎగవేతలను అధికారులు గుర్తించారు. ఇందులో 15,283 కేసులు ఐటీసీ ఎగవేతలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ ఎగవేతల ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.58,772 కోట్ల వరకు గండి పడింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ రూ.2.30 లక్షల జీఎసటీ ఎగవేతలకు సంబంధించిన కేసులను సీజీఎసటీ అధికారులు గుర్తించారు. ఇందులో ఐటీసీ స్వాహా రూ.36,374 కోట్ల వరకు ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.32 లక్షల కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జీఎసటీ ఎగవేత కేసులను అధికారులు గుర్తించారు. జీఎసటీ ఎగవేతలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్య లు చేపట్టింది. ఇందులో భాగంగా ఇ-ఇన్వాయిసింగ్, జీఎస్‌టీ అనలిటిక్స్ వంటి డిజిటైజేషన్ చర్యలతో పాటు నిఘాను పటిష్ఠం చేయడం, రిటర్న్‌ల స్క్రూటినీ చేపట్టినట్టు పంకజ్ చౌదరి చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సీజీఎసటీ రూపంలో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు నికరంగా రూ.10.26 లక్షల కోట్లు చేరింది. సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం ఇది (రూ.10.62 లక్షల కోట్లు) 96.7 శాతానికి సమానమని మంత్రి తెలిపారు. ఐరన్, స్టీలు వ్యాపారంలో ఉన్న ఒక ఢిల్లీ వ్యాపారి బోగస్ ఇన్‌వాయిసలతో రూ.47.12 కోట్ల ఐటీసీ స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ ఘరానా పెద్ద మనిషి అసలు వస్తువులే సరఫరా చేయకుండా బోగస్ ఇన్వాయిసలతో ఈ మొత్తాన్ని స్వాహా చేసినట్టు అధికారులు చెప్పారు.

# ఓటీటీ ఫ్లాప్‌గా నిలిచిన కపిల్ షో.. వెల్లువెత్తుతున్న విమర్శలు!



ఒకప్పుడు రియాల్టీ షోలకు, స్టాండ్ అప్ కామెడీ షోలకి మంచి ప్రేక్షకాదరణ లభించేది. కానీ రాను రాను ఆ క్రేజ్ తగ్గిపోతోంది అనే వార్తలు వ్యక్తం అవుతున్నాయి. ఒకప్పుడు తమ షోలతో ఇండియాలోనే బెస్ట్ టీఆర్పీ రేటింగ్ సొంతం చేసుకున్న షోలు కూడా ఇప్పుడు మినిమం రేటింగ్ సాధించడంలో కూడా వెనకడుగు వేస్తున్నాయి అంటే.. ఇక ప్రేక్షకులను మెప్పించడంలో ఆ షోలు ఎంతగా వెనకబడిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. సరిగా ఇప్పుడు కూడా ఒక షో అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది. గతంలో నంబర్ వన్ షోగా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న కపిల్ శర్మ షో ఇప్పుడు విమర్శలు ఎదుర్కోవడమే కాదు.. ఓటీటీ ఫ్లాప్ షో అంటూ నిందలు కూడా మోస్తోంది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.డబ్బింగ్ ఆర్టిస్ట్ , స్టాండప్ కమెడియన్, టెలివిజన్ హోస్ట్, నటుడు, నిర్మాత, గాయకుడిగా కూడా పేరు సొంతం చేసుకున్న కపిల్ శర్మ.. “ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో “ అనే టాక్ షో కి హోస్ట్ గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. 2016 ఏప్రిల్ 23న ప్రారంభం అయ్యింది. మొదట్లో మంచి ప్రజాధారణ పొందిన ఈ షో.. ప్రస్తుతం నెట్ ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ప్రసారమవుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఈ షో పట్ల ప్రేక్షకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది. అంతేకాదు సోషల్ మీడియా ద్వారా తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు కూడా.. ఒకప్పుడు ది కపిల్ శర్మ షో ప్రేక్షకులను ఎంతలా ఆకర్షించిందో..ఆ ఆకర్షణ ఇప్పుడు కరువైంది అని చాలామంది ఎత్తిచూపుతున్నారు. ఈ షో ప్రారంభమైనప్పుడు పెద్ద సంఖ్యలో గొప్ప నటీనటులు అతిథులుగా వచ్చారు.

నవచిత్ర



# విశ్వంభరలో ఓ అందమైన చందమామ.. స్పెషల్ లుక్!




టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వస్తున్న విజువల్ వండర్ విశ్వంభర సినిమా పట్ల అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. సోషియో ఫాంటసీ జోనర్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ని యంగ్ డైరెక్టర్ వశిష్ట తెరకెక్కిస్తుండగా.. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. మెగాస్టార్ సరసన త్రిష ప్రధాన కథానాయికగా కనిపించనుండగా, కన్నడ బ్యూటీ ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్, ఇతరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాజిటివ్ ఎనర్జీ ఇచ్చిన నెగిటివ్ రోల్ ఇప్పుడు చిత్ర బృందం ఆశికా రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌లో ఆశికా రంగనాథ్ సంప్రదాయ దుస్తుల్లో, చందమామ లాంటి మెరుపుతో అందంగా కనిపించారు. నెక్లెస్ చేతికి గాజులు, నుదుటి బొట్టు.. మొత్తం లుక్ ఆకర్షణీయంగా కలర్‌ఫుల్‌గా ఉండటంతో ఈ క్యారెక్టర్‌పై ఇంట్రెస్ట్ పెరిగింది. ఆమె గ్లామర్ యాంగిల్‌ని హైలైట్ చేస్తూ రూపొందించిన పోస్టర్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. మెగా ఫ్యాన్స్ తో పాటు సాధారణ ఆడియన్స్ కూడా ఆశికా కొత్త లుక్‌పై పాజిటివ్ కామెంట్లు చేస్తున్నారు.విశ్వంభర మూవీలో ఆశికా రంగనాథ్ కీలక పాత్రలో నటించబోతున్నారు. త్రిషతో పాటు చిరు సరసన మరో గ్లామరస్ ఫేస్‌గా ఆమె స్థానం సంపాదించుకుంది. కన్నడలో స్టార్ ఇమేజ్ ఉన్న ఆశికా, తెలుగులో విశ్వంభరతో మరింతగా క్రేజ్ సంపాదించుకునే అవకాశం ఉంది. తాజాగా విడుదలైన పోస్టర్ ఆధారంగా ఆమె పాత్ర సినిమాకు ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి, త్రిష, ఆశికా రంగనాథ్ మధ్య సీన్స్ సినిమా హైలైట్ కానున్నాయని టాక్. ఇక ఈ సినిమాలో చిరంజీవికి నాలుగేళ్ల కొడుకు ఉంటాడన్న సమాచారం ఇప్పటికే బయటకు వచ్చింది. సినిమాలోని కథ, కాన్సెప్ట్ గురించి దర్శకుడు వశిష్ట ఇటీవల క్లారిటీ ఇచ్చారు. పంచభూతాలతో ఐదు లోకాల కాన్సెప్ట్‌తో సినిమా నడవనుందని, వీఎఫ్ఎక్స్ పరంగా టాలీవుడ్‌లోనే కాకుండా ఇండియన్ సినిమాల్లోనూ కొత్త ట్రెండ్ సెట్ చేయబోతుందని వెల్లడించారు. ఈ సినిమాలో, ఉడుత, రెక్కల గుర్రం వంటి క్యారెక్టర్స్‌కు కూడా స్పెషల్ ఇంపోర్టెన్స్ ఉందని టాక్. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు తుదిదశలో ఉన్నాయి. ప్రమోషన్స్ కూడా మళ్లీ స్టార్ట్ చేశారు. అక్టోబర్‌లో ట్రైలర్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన పోస్టర్లతో విశ్వంభర మూవీ క్రేజ్‌ను పెంచుతూ పోతున్నారు. తాజాగా విడుదలైన ఆశికా రంగనాథ్ పోస్టర్ మూవీపై అంచనాలను మరింతగా పెంచింది. సినిమా రిలీజ్‌కు ఇంకా కొంత టైం ఉన్నప్పటికీ, ఇలాంటి ప్రోమోషనల్ అప్‌డేట్స్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తాయని చెప్పవచ్చు.

# మృణాల్ రుసరుసలు ఎందుకంటే..?



బాలీవుడ్ సీరియల్స్ లో టాలెంట్ చూపించి అక్కడ నుంచి సిల్వర్ స్క్రీన్ ప్రమోట్ అయ్యింది మృణాల్ ఠాకూర్. హిందీలో సినిమాలు చేస్తూ ఒక మోస్తారు కెరీర్ కొనసాగిస్తున్న అమ్మడికి తెలుగు నుంచి సీతారామం ఆఫర్ రావడం అది ఆమె చేయడం ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడం అంతా అలా జరిగింది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన సీతారామం సినిమాలో మృణాల్ ఠాకూర్ సీతామహాలక్ష్మి పాత్రలో అదరగొట్టేసింది. తెలుగులో ఎంట్రీ ఇవ్వడమే ఒక సూపర్ హిట్ పడటంతో అమ్మడు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది.అడివి శేష్ తో డెకాయిట్..సీతారామం తర్వాత నానితో హాయ్ నాన్న చేసింది మృణాల్ ఠాకూర్. ఆ సినిమా కూడా సక్సెస్ అయ్యింది. ఇక థర్డ్ మూవీగా విజయ్ దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ చేసింది మృణాల్. ఆ ఒక్క సినిమా అమ్మడికి కాస్త షాక్ ఇచ్చింది. ప్రెజెంట్ అడివి శేష్ తో డెకాయిట్ మూవీ చేస్తుంది మృణాల్ ఠాకూర్. ఆ సినిమాతో పాటు హిందీలో కూడా వరుస ప్రాజెక్ట్ లు చేస్తుంది.రీసెంట్ గా అజయ్ దేవగన్ తో మృణాల్ ఠాకూర్ నటించిన సినిమా సన్ ఆఫ్ సర్దార్ 2. ఈ సినిమా లాస్ట్ వీక్ రిలీజైంది. సినిమాకు ఆశించిన రేంజ్ లో పాజిటివ్ టాక్ రాలేదు. ఐతే సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఆఫ్టర్ రిలీజ్ మృణాల్ సోషల్ మీడియా ఫాలోవర్స్ తో చిట్ చాట్ చేసింది. ఈ చాట్ లో భాగంగా మృణాల్ ఒక వ్యక్తి మీ సినిమాకు వచ్చిన రివ్యూస్ చూసి సినిమా వెళ్దామనుకున్న వాడినే ఆగిపోయా అన్న కామెంట్ కనబడింది.

**సినిమా సూపర్ హిట్ అయితే రివ్యూస్ కూడా..**

దానికి మృణాల్ ఆన్సర్ ఇస్తూ సినిమాను రివ్యూస్ మిస్ లీడ్ చేస్తాయని అన్నది. సినిమా ఎలా ఉంది అన్నది ఆడియన్స్ రివ్యూస్ చదివి కాదు చూసి డిసైడ్ చేయాలని అన్నది మృణాల్ ఠాకూర్. సినిమా సూపర్ హిట్ అయితే రివ్యూస్ కూడా సినిమాను బాగానే ఎంకరేజ్ చేస్తారని అంటారు. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయితే మాత్రం ఆ సినిమా మీద రివ్యూస్ ఎఫెక్ట్ పడిందని అంటారు.


ఈమధ్య కొన్ని సినిమాలు అసలు రివ్యూస్ పట్టించుకోకుండా హిట్ అయినవి ఉన్నాయి.. కేవలం మౌత్ టాక్ తో సూపర్ హిట్ అవుతున్న ప్రాజెక్ట్ లు ఉన్నాయి. సో సినిమా రిజల్ట్ కాస్త తేడా ఉండగానే రివ్యూస్ మిస్ లీడ్ చేస్తున్నాయి. నెగిటివ్ రివ్యూస్ వల్లే సినిమాలు ఆడట్లేదని చెప్పడం ఏమాత్రం కరెక్ట్ కాదు. మృణాల్ ఠాకూర్ సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమా చాలా పర్సనల్ గా తీసుకున్నట్టు ఉంది. అందుకే ఆ సినిమా నెగిటివ్ రివ్యూస్ పై ఆమె రుస రుసలాడుతున్నారు.

# కియారా బికినీ విషయంలోనే ఎందుకు వివాదం..!




హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటించిన 'వార్ 2' విడుదలకు సిద్ధం అయింది. ఈనెల 14న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల కాబోతున్న వార్ 2లో హృతిక్ రోషన్‌కి జోడీగా కియారా అద్వానీ నటించిన విషయం తెల్సిందే. కియారా అద్వానీ ఈ సినిమా ప్రమోషన్‌లో పాల్గొనలేక పోతుంది. కియారా అద్వానీ గర్భతి కావడంతో ప్రమోషన్స్‌కి దూరంగా ఉంది. ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చిన కియారా అద్వానీ విశ్రాంతిలో ఉన్నట్లు తెలుస్తోంది. మరో నెల లేదా రెండు నెలల తర్వాత విడుదల ఉండి ఉంటే ఖచ్చితంగా కియారా అద్వానీని ప్రమోషన్స్‌లో చూసే అవకాశం ఉండేది అనేది బాలీవుడ్ వర్గాల టాక్. వార్-2 సినిమా గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. ఈ సమయంలోనే సినిమాలో కియారా అద్వానీ వేసుకున్న బికినీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వార్ 2 లో కియారా బికినీ లుక్ వైరల్ కియారా అద్వానీ బికినీ ఫోటోలకు మంచి స్పందన వచ్చింది. ఇప్పటి వరకు బాలీవుడ్‌లో ఏ హీరోయిన్ బికినీలో ఇంత అందంగా కనిపించలేదు అంటూ కియారా అద్వానీ అభిమానులు చాలా మంది కామెంట్స్ చేస్తూ వచ్చారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించిన గత చిత్రాల్లోనూ అందాల ఆరబోత చేసింది. కానీ ఈసారి అంతకు మించి అన్నట్లుగా అందంగా కనిపించింది. ఈ అందంకు కారణం సీజీ వర్క్ అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, కొందరు మరో రకంగా విమర్శలు చేస్తున్నారు. మొత్తానికి వార్ 2 సినిమాలోని కియారా అద్వానీ లుక్‌ను చాలా మంది చాలా రకాలుగా విమర్శలు చేయడం, ట్రోల్స్ చేయడం జరుగుతుంది. బాలీవుడ్‌లో ఈ జాడ్యం చాలా కాలంగా కొనసాగుతోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో కియారా అద్వానీ ఒక హీరోయిన్ గురించి మరో హీరోయిన్ అభిమానులు లేదా పీఆర్ టీం ట్రోల్స్ చేయడం, సోషల్ మీడియా ద్వారా నెగటివ్ ప్రచారం చేయడం అనేది కామన్‌గా జరుగుతూనే ఉంది. ఇండస్ట్రీలో కియారా అద్వానీ గురించి ఎప్పుడూ ఏదో ఒక పుకారు లేదా నెగటివ్ ప్రచారం ఉంటుంది. ఆమె ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పటి నుంచి కష్టపడి స్టార్డం దక్కించుకుంది. తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. ఇండస్ట్రీలో నెపో కిడ్‌గా అడుగు పెట్టినప్పటికీ ఆమెకు ఉన్న ప్రతిభ కారణంగా తక్కువ సమయంలోనే సొంతగానే స్టార్‌డం దక్కించుకుంది.

# సౌత్ లో మరో రాజమౌళి ఆయనే!



దేశం గర్వించ దగ్గ దర్శకుల్లో రాజమౌళి ఒకరు. ఆయన విజయాలే అంతటి గొప్ప స్థానాన్ని కట్టబెట్టాయి. పాన్ ఇండియా చిత్రానికి కొత్త మీనింగ్ పరిచయం చేసిన ఘనుడు జక్కన్న. కెరీర్ లో ఇంత వరకూ వైఫల్యమే ఎరుగని డైరెక్టర్. స్టూడెంట్ నెంబర్ నుంచి మొన్నటి 'ఆర్ ఆర్ ఆర్' వరకూ ప్రతీది ఓ గొప్ప కళాఖండమే. చిత్ర పరిశ్రమకు ఎన్నో విజయాలు అందించారు. తన విజయాలతో టాలీవుడ్ గమనాన్ని విశ్వవ్యాప్తం చేసారు. 'బాహుబలి', 'ఆర్ ఆర్ ఆర్' లాంటి విజయాలతో అంతర్జాతీయ స్థాయికి చేరారు. అందుకే ప్రఖ్యాత నటులంతా రాజమౌళితో కలిసి పని చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. వైఫల్యమే ఎరుగని సంచలనం ఆ రకంగా తెలుగు చలన చిత్ర పరిశ్రమ రాజమౌళికి ఎంతో రుణపడి ఉంది. అంతటి లెజెండరీ డైరెక్టర్ తోనే సూపర్ స్టార్ రజనీకాంత్ కోలీవుడ్ యువ సంచలనం లోకేష్ కనగరాజ్ ను పోలిక చేయడం విశేషం. టాలీవుడ్ కి రాజమౌళి ఎలాగో? మా కోలీవుడ్ కి లోకేష్ అంటూ స్వయానా ఆయన నోట జాలువారిన వాఖ్య మిది. కోలీవుడ్ లో ఇంత వరకూ వైఫల్యం ఎరుగని దర్శకుడిగా లోకేష్ ని కీర్తించారు. ఇంతింతై వటుడింతైన చందంగా తమిళ పరిశ్రమలో లోకేష్ ఎదుగుదలను సూపర్ స్టార్ గుర్తు చేసుకున్నారు. తొలి సినిమా నుంచి 'లియో' వరకూ లోకేష్ విజయాలను కొనియాడారు. తొలి సినిమాతోనే ప్రశంస ఇంత వరకూ సూపర్ స్టార్ నోట ఏ డైరెక్టర్ గురించి ఇలాంటి ప్రశంస రాలేదు. ఇప్పటి వరకూ రజనీకాంత్ చాలా మంది డైరెక్టర్లతో పని చేసారు.

# ఈ డ్రెస్‌లో పాతికేళ్లు వయసు తగ్గింది!



బాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండియాలోనూ మంచి పాపులారిటీ ఉన్న హీరోయిన్ మలైకా అరోరా. ఈమె హీరోయిన్‌గా చేసిన సినిమాలు తక్కువే, అయితే పలు సూపర్ హిట్ ఐటెం సాంగ్స్ చేసింది. ఆ ఐటెం సాంగ్స్ వల్ల మలైకా అరోరా బాలీవుడ్‌తో పాటు మొత్తం ఇండియా మొత్తం స్టార్‌గా నిలిచింది. మలైకా అరోరా ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ వల్ల ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. సాధారణంగా హీరోయిన్స్ మూడు పదుల వయసు వరకు పర్వాలేదు అన్నట్లుగా ఉంటారు. నాలుగు పదుల వయసుకు వచ్చేప్పటికి చాలా మంది హీరోయిన్స్ అందం తగ్గి పోతూ ఉంటుంది. కానీ కొద్ది మంది హీరోయిన్స్ మాత్రం అయిదు పదుల వయసులోనూ మూడు పదుల వయసు ఫిజిక్, అందంను మెయింటెన్ చేయగలరు. అందులో మలైకా అరోరా ఒకరు అనడంలో సందేహం లేదు. 51 ఏళ్ల వయసులోనూ మలైకా అరోరా అందం మలైకా అరోరా ఇండస్ట్రీలో అడుగు పెట్టి పాతిక ఏళ్లు దాటింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు చేసిన సినిమాలు తక్కువే. అయినా కూడా ఈమెకు అప్పటి నుంచి ఇప్పటి వరకు సాలిడ్ స్టార్‌డం కొనసాగుతూనే ఉంది. ఇటీవల మలైకా 51 ఏళ్ల వయసులో అడుగు పెట్టింది. అయినా కూడా ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఫోటోలు, వీడియోలు చూస్తే ఖచ్చితంగా ఆశ్చర్య పోవాల్సిందే. ఈ మధ్య కాలంలో హీరోయిన్స్ చాలా మంది మూడు పదుల వయసులోకి అడుగు పెట్టగానే బరువు పెరగడం, ఫేస్ లో మార్పులు రావడం జరుగుతూ ఉంటుంది. తినే ఆహారం, వేసుకునే మేకప్ వల్ల కొన్నాళ్ల తర్వాత అందం పోతుందని చాలా మంది అంటూ ఉంటారు. కానీ మలైకా అరోరా మాత్రం నేచురల్ బ్యూటీ అనేందుకు ఈ ఫోటోలు సాక్ష్యం. స్లీవ్‌లెస్ వైట్ డ్రెస్‌లో మలైకా అందాల షో తాజాగా మలైకా అరోరా ఈ అందమైన ఫోటోలను షేర్ చేసింది. సాధారనంగానే మలైకా షేర్ చేసే ఫోటోల్లో చాలా అందంగా కనిపిస్తుంది. ఈసారి అంతకు మించి అన్నట్లుగా అందంగా కనిపిస్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఔట్ ఫిట్‌ను ధరించడం ద్వారా ఈ ఫోటోలకు డబుల్ రీచ్ దక్కింది అనడంలో సందేహం లేదు. ఈ వైట్ డ్రెస్‌లో మలైకా చాలా అందంగా కనిపిస్తుంది. ఈ డ్రెస్ కారణంగా మలైకా ఏకంగా పాతికేళ్ల వయసు తగ్గి మూడు పదుల వయసు కంటే తక్కువ వయసు అమ్మాయి అన్నట్లుగా కనిపిస్తుంది


# సోనూసూద్ మానవత్వం..

## ఫిష్ వెంకట్ కుటుంబానికి అండగా..



టాలీవుడ్‌లో ఎన్నో చిత్రాల్లో తన కామెడీతో ప్రేక్షకులను అలరించిన ఫిష్ వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం ఇండస్ట్రీలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పలు సినిమాల్లో గుర్తింపు తెచ్చుకున్న వెంకట్ చేసిన కామెడీ పాత్రలు అభిమానుల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయాయి. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వెంకట్‌కి చికిత్స సమయంలో పెద్దగా సహాయం అందకపోవడం, తర్వాత మరణానంతరం పరిశ్రమ నుంచి సానుభూతి స్పందన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ పరిస్థితుల్లో బాలీవుడ్ స్టార్ సోనూసూద్ చేసిన పని అందరినీ ఆకట్టుకుంది. సోనూసూద్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. సోనూ సూద్ నటించిన పలు సినిమాల్లో అతని గ్యాంగ్ లో ఒక వ్యక్తిగా వెంకట్ కనిపించారు. ఇక ఫిష్ వెంకట్ కుటుంబాన్ని స్వయంగా పరామర్శించేందుకు హైదరాబాద్‌కి వచ్చిన ఆయన, వెంకట్ నివాసానికి వెళ్లారు. అక్కడ వెంకట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకట్ కుటుంబ సభ్యులను ఓదార్చుతూ, “మీ బాధను నేను కూడా అనుభవిస్తున్నాను. మీరు ఎలాంటి సాయం కోరినా, ఎప్పుడైనా నన్ను నిశ్చయంగా సంప్రదించండి. మీకు నేను అండగా ఉంటాను,” అని చెప్పారు. సోనూసూద్ ఇలా స్పందించడం ఇప్పుడు సినీ వర్గాల్లో, అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. కోవిడ్ సమయంలో దేశవ్యాప్తంగా వేలాది మంది వలస కార్మికులకు సహాయంగా నిలబడి రియల్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న సోనూసూద్, ఇప్పుడు కూడా తన మానవతా హృదయాన్ని చూపించారు. ఫిష్ వెంకట్ కుటుంబాన్ని పరామర్శిస్తూ, అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పడం వల్ల ఆయనపై మరింత ప్రశంసలు కురుస్తున్నాయి. సోషల్ మీడియాలో ప్రస్తుతం సోనూసూద్‌కి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ప్రతి ఒక్కరూ ఆయన సేవా మానవత్వాన్ని ప్రశంసిస్తూ పోస్ట్‌లు చేస్తున్నారు. ఫిష్ వెంకట్ సినీ ప్రయాణం మూడు దశాబ్దాలకు పైగా సాగింది. తెలుగు సినిమాల్లో చిన్న పాత్రల్లో నటిస్తూ కామెడీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన కామెడీ ప్రేక్షకులను మళ్లీ మళ్లీ నవ్వించేలా ఉంది. బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో మెరిసిన ఆయన ఆకస్మిక మరణం తెలుగు సినిమాకు తీరనిలోటు. వెంకట్ కుటుంబానికి ఇండస్ట్రీలోని చాలా మంది స్పందించకపోయినా, సోనూసూద్ మానవత్వంతో ముందుకు రావడం సరికొత్త ఉదాహరణగా నిలిచింది.

# గంభీర్ కళ్లలో నీళ్లు.. మ్యాచ్ అనంతరం గంభీర్ ఎంత ఎమోషనల్ అయ్యాడో చూడండి..



**లండన్-నవభూమి:** టీమిండియా టీ-20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్ బాధ్యతలు స్వీకరించాడు. అప్పటికే ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియాను గంభీర్ మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్తాడని అందరూ భావించారు. అతడు కోరినవన్నీ ఇవ్వడానికి బీసీసీఐ అంగీకరించింది. అయితే ఆ తర్వాత టీమిండియా ఆటతీరు తీవ్ర విమర్శలపాలైంది. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఓటమిపాలైంది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. శ్రీలంకతో వన్డే సిరీస్ కోల్పోయింది.టీమిండియా పేలవ ప్రదర్శన కారణంగా గంభీర్ పలు విమర్శలు ఎదుర్కొన్నాడు.

ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ మొదలైంది కుర్రాళ్లతో కూడిన టీమిండియా.. ఇంగ్లండ్‌లో పెద్దగా సాధించేది ఏమీ ఉండదని అందరూ అనుకున్నారు. అనుకున్నట్టుగానే తొలి టెస్ట్‌లో టీమిండియా పరాజయం పాలైంది. అయితే రెండో టెస్ట్ మ్యాచ్‌లో అనూహ్యంగా పుంజుకుని భారీ విజయం సాధించింది. ఇక, మూడో టెస్ట్‌లో చివరి వరకు పోరాడి 21 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఓటమి తప్పదనుకున్న నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకుంది. ఇక, ఐదో టెస్ట్ కూడా చేజారినట్టే అనుకున్న తరుణంలో థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది.ఓవల్‌లో ఐదో టెస్ట్ మ్యాచ్ విజయం అనంతరం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చిన్న పిల్లాడిలా సంబరాలు చేసుకున్నాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు. సహచరులను హత్తుకుని ఎమోషనల్ అయ్యాడు. నిజానికి గంభీర్ ఎలాంటి భావోద్వేగాలనూ ప్రదర్శించాడు.

అయితే ఈ సిరీస్ ఓడిపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో గంభీర్ ఎమోషనల్ అయ్యాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# సుయ్ సెలబ్రేషన్స్



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్‌తో టెస్టులో చివరి వికెట్ తీసిన అనంతరం సిరాజ్.. రెండు చేతులూ వెనక్కినెట్టి గట్టిగా అరుస్తూ సింహనాదం చేశాడు. దీన్ని 'సుయ్' సెలబ్రేషన్స్ అంటారు. సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఇదే రీతిన సెలబ్రేట్ చేసుకుంటాడు. 2013లో ఓ మ్యాచ్‌లో గోల్ కొట్టినప్పుడు రొనాల్డో తొలిసారిగా ఈ విన్యాసాన్ని ప్రదర్శించాడు. సుయ్ అనేది పోర్చుగీసు పదం. దీనికి అవును అనే అర్థం. 'అవును.. నేను ప్రత్యర్థిని పడగొట్టా' అనే అర్థం వచ్చేలా ఈ విన్యాసాన్ని ఆటగాళ్లు ప్రదర్శిస్తుంటారు.

సిరాజ్‌లాంటి బౌలర్ ఉంటే..సిరాజ్, ప్రసిద్ధ్‌లాంటి బౌలర్లుంటే కెప్టెన్సీ చేయడం తేలికవుతుంది. ఆఖరి రోజు మా ప్రదర్శపై పూర్తి సంతృప్తిగా ఉన్నా. నిజానికి ఇరు జట్లు గ్రేడ్ 'ఎ' క్రికెట్ ఆడాయి. మేం గెలుస్తామన్న నమ్మకం నాలుగో రోజే కలిగింది. ఎందుకంటే ఒత్తిడి ఉన్నది వారిపైనే.

టెస్టు క్రికెట్.. ఎప్పుడూ ఉత్కంఠ రేపుతుంది. సిరీస్ 2-2తో సమం చేసిన కుర్రాళ్ల ప్రదర్శనకు పదికి పది మార్కులు.పోరాటం అద్భుతం: కోహ్లీ

టీమిండియాకు గొప్ప విజయం. సిరాజ్, ప్రసిద్ధ్ పోరాటం, పట్టుదల జట్టుకు చిరస్మరణీయ గెలుపును అందించింది. సిరాజ్ జట్టు కోసం సర్వశక్తులూ ఒడ్డాడు.

నవక్రీడ

# సెమీస్‌కు ఆరుగురు బాక్సర్లు



**బ్యాంకాక్:-నవభూమి:** అండర్-22 ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు సెమీస్ చేరి ఆరు పతకాలు ఖాయం చేశారు. వీరిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. సోమవారం జరిగిన క్వార్టర్స్ బౌట్‌లో ప్రియ (60 కిలోలు), పరంజల్ యాదవ్ (70 కి)తోపాటు హర్ష్ (60 కి), నీరజ్ (75 కి), రాకీ చౌదరి (85 కి), ఇషాన్ (90o కి) గెలిచి సెమీసకు చేరుకొన్నారు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**